ఢిల్లీలో భారీ అగ్నిప్రమాదం

ఢిల్లీలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. కరోల్ బాగ్ ప్రాంతంలోని గఫ్ఫార్ మార్కెట్ లో జరిగిన ప్రమాదంలో పలు దుకాణాలు కాలిపోయాయి. భారీగా ఆస్తి నష్టం సంభవించింది. మొబైల్ దుకాణాలు అగ్నికి ఆహుతి కావడంతో చాలా మంది నష్టపోయారు. ప్రమాదం జరిగిన ప్రాంతమంతా దట్టమైన పొగలు అలుముకోవడంతో సహాయక చర్యలు చేయడం కష్టంగా మారింది. ప్రమాదం జరిగిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది, రెస్క్యూ టీంలు చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. అయితే అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. అయితే కొన్ని గంటల పాటు శ్రమించి ఎట్టకేలకు మంటలను అదుపులోకి తీసుకు రాగలిగారు నాలుగు అంతస్థుల భవనంలో అగ్ని ప్రమాదం సంభవించడంతో సహాయక చర్యలు చేపట్టడం కూడా కష్టసాధ్యంగా మారింది.

స్వర్ణాంధ్ర

తెలుగు దినపత్రిక


సంపాదకుడు : కె.బి.జి. తిలక్

ఘోర ప్రమాదం.. ఏడుగురు స్పాట్ డెడ్

జార్ఖండ్‌లోని ఖుంటి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. జార్ఖండ్‌లోని ఖుంటి జిల్లా కర్రా–తోర్పా ప్రధాన రహదారిపై జోనే–లుద్రు మలుపు వద్ద ఈ ప్రమాదం జరిగింది.గురువారం రాత్రి ఓ స్కూటీ అదుపుతప్పి ప్రమాదానికి గురవ్వగా.. అక్కడ సహాయం కోసం గుమిగూడిన స్థానికుల మీదకు అతివేగంగా వచ్చిన లారీ దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ముగ్గురు మహిళలు, ముగ్గురు పిల్లలతో సహా మొత్తం ఏడుగురు మృతి చెందారు. మృతుల్లో పాకో దేవి, కసిలా దేవి, మన్సు దేవి, గోలు కుమార్, అంజలి కుమారి, తూటీ కుమారి, సౌరభ్ నాయక్ ఉన్నారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారిని పోలీసులు ఖుంటి సదర్ ఆసుపత్రికి తరలించారు.ప్రమాదం జరిగిన వెంటనే లారీ డ్రైవర్ వాహనాన్ని అక్కడే వదిలేసి పరారయ్యాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

R.N.I.No.APTEL/1999/1614 సంపుటి : 28 సంచిక 196 విజయవాడ 07 నవంబర్ 2026 శనివారం 9 పేజీలు వెల : 2 రూపాయలు swarna_tilak@rediffmail.com´

'దేశ ద్రోహం': మోడీ రేపిన 'రాహుల్ మంటలు'



ప్రధాని మోదీ, రాహుల్ గాంధీ మధ్య 'దేశద్రోహి' వ్యాఖ్యలతో రాజకీయ వివాదం ముదురుతోంది. విదేశీ శక్తులతో చేతులు కలిపి దేశద్రోహానికి పాల్పడుతున్నారంటూ గత నెల 31న మోదీ రాహుల్‌పై విమర్శలు చేశారు. దీనికి స్పందించిన రాహుల్.. మోదీనే దేశద్రోహి అని నిరూపిస్తానని, ఐదు నిమిషాలు చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఈ వివాదం జాతీయ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. –దేశద్రోహి–– ఇప్పుడు జాతీయ రాజకీయాల్లో పెను ప్రకంపనలు సృష్టిస్తున్న ఏకైక పదం. –ఎవరు దేశ ద్రోహి.–– అంటూ.. కాంగ్రెస్ చేస్తున్న వ్యాఖ్యలు.. బీజేపీలో వణుకు పుట్టిస్తున్నాయని జాతీయ మీడియా చెబుతోంది. ––ప్రధాని మోదీనే దేశద్రోహి. ఈ విషయాన్ని ఐదు నిమిషాల్లో నిరూపిస్తా. ఆయనను చర్చకు రమ్మనండి–– అంటూ.. కాంగ్రెస్ అగ్రనేత.. రాహుల్ గాంధీ గత మూడు రోజులుగా ఊరూ వాడా పిలుపునిస్తున్నారు. ఎక్కడ మీటింగ్ పెట్టినా.. ఇదే వ్యాఖ్యలు చేస్తున్నారు. దీనికి కౌంటర్ ఇవ్వలేక బీజేపీ అగ్రనాయత్వం సతమతం అవుతోంది.

బీజం ఎక్కడ పడింది?

–దేశ ద్రోహం.. దేశ ద్రోహి– వ్యాఖ్యలకు మూలం.. ప్రధాని నరేంద్ర మోడీ గత నెల 31న గుజరాత్‌లో నిర్వహించిన కార్యక్రమంలో చేసిన వ్యాఖ్యలే!. ఆ రోజు మాజీ ఉప ప్రధాని ఉక్కు మనిషి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని గుజరాత్‌లో నిర్వహించిన ఏక్తాదివస్ కార్యక్రమంలో మోడీ మాట్లాడారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీని నేరుగా కార్నర్ చేశారు. ––విదేశీ శక్తులతో చేతులు కలిపి దేశద్రోహానికి పాల్పడుతున్నారు.–– అంటూ రాహుల్ పేరును పేర్కొన్నారు. ఇక అక్కడి నుంచి మంటలు రాజుకున్నాయి. ఎవరు దేశ ద్రోహి.. అంటూ రాహుల్‌గాంధీ ఆవెంటనే స్పందించారు. విదేశీ శక్తులకు అమ్ముడు పోయింది ఎవరో నిరూపిస్తామని.. చర్చకు రావాలని నేరుగా ప్రధానినే ఆయన టార్గెట్ చేశారు. ––రండి.. చర్చిద్దాం. ఎవరు దేశానికి ద్రోహం చేస్తున్నారో.. చెప్పడానికి నా వద్ద అన్ని ఆధారాలు ఉన్నాయి. మీరు నన్ను అంటున్నారు కదా.. వాటిలో ఒక్క ఆధారం అయినా బయట పెట్టండి–– అంటూ రాహుల్ నిలదీశారు. దీనిపై బీజేపీ నుంచి ఎలాంటి కౌంటర్లు రావడం లేదు. దీంతో రాహుల్ మరింతగా ప్రధానిని కార్నర్ చేస్తూ.. తాజాగా పంజాబ్‌లో నిర్వహించిన పార్టీ కార్యక్రమంలోనూ ప్రధాని సెంట్రిక్‌గానే కామెంట్లు కుమ్మరించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంపుతో చేతులు కలిపి దేశానికి ద్రోహం ఎవరు చేశారో.. చెబుతానన్నారు. ఐదు నిమిషాలు చర్చకు రావాలని.. మీరు –నేను మాత్రమే చర్చల్లో పాల్గొందామని.. కావాలంటే.. భారీ భద్రతను ఏర్పాటు చేసుకోవాలని ఆయన ఆఫర్ ఇచ్చారు. దేశానికి అన్ని విధాలా ద్రోహం చేస్తూ.. ఎదురు దాడి చేస్తున్నారని దుయ్యబట్టారు. కాగా.. ఈ వ్యవహారంపై బీజేపీ నుంచి ఎలాంటి ఆన్సర్ లేక పోవడం గమనార్హం. అంతేకాదు.. తాను చేసిన వ్యాఖ్యలపై ప్రధాని సైలెంట్ అయిపోగా.. రాహుల్ మాత్రం వాటిని కొనసాగిస్తున్నారు. మరి ఈ వివాదంఎటుదారితీస్తుందోచూడాలి. మరో రెండుమాసాల్లోబిహార్‌ఎన్నికలుఉన్నసమయంలో ఈ వ్యవహారంతమకుకలిసివస్తుందనిఅంచనా వేస్తున్నారు.

గెలిచామన్న ఆనందం కూటమిలో కనిపించడం లేదే?



కూటమి పార్టీలో మున్సిపల్ ఎన్నికల్లో గెలిచామన్న ఆనందం కనిపించడం లేదు. అత్యధిక శాతం స్థానాల్లో గెలిచినప్పటికీ ఆశించిన విధంగా ఓటర్లు ఓటు వేసేందుకు ముందుకు రాకపోవడంతో పాలనపై ప్రజల అభిప్రాయం ఎలా ఉందోనన్న ఆందోళన కలిగిస్తుంది. ప్రస్తుతానికి వైసీపీ బలం తగ్గలేదు. అలాగే కూటమి పార్టీల ఓట్ల శాతం కూడా తగ్గకపోవడం ఒకింత ఊరట కలిగించడమే కానీ, ఓటర్లు శాసనసభ ఎన్నికల తరహాలో పోలింగ్ కేంద్రాలకు పోటెత్తకపోవడం ఒకింత ఆలోచించాల్సిన విషయం ఎందుకంటే.. కూటమిని గెలిపించాలనుకుంటే ప్రజలు స్వచ్ఛందంగా తరలి వచ్చే వారని, అది జరగకపోవడం కొంత దడ మొదలయింది. సంక్షేమం, అభివృద్ధి అనే పేరుతో జనం ముందుకు వెళ్లినా ఆశించిన ప్రయోజనం దక్కలేదన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. అయితే చాలా చోట్ల ఓట్ల బదిలీ జరిగినా, అనంతపురం, ఆదోని పంటి ప్రాంతాల చోట ఓట్ల బదిలీ జరగలేదని కూటమి పెద్దలు అక్కడి నేతలకు క్లాస్ పీకినట్లు తెలిసింది.

స్థానిక సంస్థల సభ్యుల చేతివాటం...

కూటమికి ఈ ఎన్నికల్లో మరొక ప్రమాదం కూడా పొంచి ఉంది. ఇప్పటికే ఎమ్మెల్యేల అవినీతిని ప్రజలు తట్టుకోలేకపోతున్నారు. ఇక స్థానిక సంస్థల ఎన్నికలు జరగడంతో పంచాయతీ వార్డు సభ్యులు, కౌన్సిలర్లు, సర్పంచ్ లు, ఛైర్మన్ లు, మేయర్లు కూడా వస్తున్నారు. ఈ ఎన్నికల్లో దాదాపు 95 శాతం పదవులు కూటమి దక్కడంతో ఇక అవినీతితో సాధారణ ఎన్నికల సమయానికి మరింత ప్రజల్లో వ్యతిరేకత వచ్చే అవకాశముంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో దాదాపు 1,50 లక్షల మంది ప్రజాప్రతినిధులు జనం పైన పడితే ఇక తట్టుకుంటారా? మార్చుకోరా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో డబ్బులు పంపిణీ చేసి గెలవడంతో వాటిని సంపాదించుకోవడానికి కొందరు అక్రమ మార్గాలను తొక్కే అవకాశముంది.

నిధుల వినియోగంలోనూ...

అదే సమయంలో సమస్యల పరిష్కారంలో కూడా చొరవ చూపకపోయినా ఆ ప్రభావం కూటమి సర్కార్ పై పడుతుంది. నిధులను సక్రమంగా వినియోగించుకోకపోయినా, తమ కళ్ల ముందే ఎక్కువ డబ్బులు సంపాదించి ఖరీదైన కార్లు, భవంతులు నిర్మించుకుంటే అది కూడా ప్రభుత్వానికి సాధారణ ఎన్నికల్లో ఇబ్బందికరంగా మారనుంది. ఎమ్మెల్యేలనే కూటమి పార్టీల నాయకత్వాన్ని కట్టడి చేయలేకపోతున్నాయి. ఇక ఇంత స్థాయిలో చిన్న స్థాయిలో ఉన్నవారిని అదుపు

ప్రయాణికురాలిపై బస్సులోనే డ్రైవర్ అత్యాచారం

కాపలా కాసిన కండక్టర్

ఈమధ్య కాలంలో అత్యాచారాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఎక్కడ పడితే అక్కడే అమాయక మహిళలను బలాత్కరిస్తూ.. కాసేపటి సుఖం కోసం వాళ్ల జీవితాలనే పాడు చేస్తున్నారు. తాజాగా ఇలాగే చేశాడో ప్రైవేట్ బస్సు డ్రైవర్. తన బస్సులో ఎక్కిన మహిళా ప్రయాణికురాలిని క్షేమంగా గమ్యస్థానంలో దింపకుండా నిర్మానుష్య ప్రదేశానికి తీసుకువెళ్లి అత్యాచారం చేశాడు. ఇందుకు కాపలాగా బస్సు కండక్టర్‌ను పెట్టగా అతడు కూడా సాయం చేశాడు. ఆ పూర్తి వివరాలు మీకోసం.హర్యానాలోని ఫరీదాబాద్‌కి చెందిన 56 ఏళ్ల మహిళ.. పలు ఇళ్లలో పని చేస్తూ జీవనం సాగిస్తోంది. అయితే ఎప్పటిలాగే ఫిబ్రవరి 9వ రోజు కూడా పనికి వెళ్లింది. సాయంత్రం ఆరు గంటల ప్రాంతంలో తిరిగి ఇంటికి చేరుకోవడానికి సెక్టార్ 17లోని బైపాస్ రోడ్డులో నిలబడి ఉంది. అక్కడే సాయంత్రం 6 గంటలకు ఓ ప్రైవేటు బస్సు రాగా.. ఆ బస్సు ఎక్కింది. అయితే అందులో ఎవరూ లేరు. ఈమె ఒక్కతే కాగా.. బస్సు డ్రైవర్ ఆమెపై కన్నేశాడు. ఈక్రమంలోనే ఆమె వెళ్లాల్సిన దారిలో కాకుండా వేరే దారిలో తీసుకెళ్లాడు.నిర్మానుష్య ప్రాంతానికి చేరుకోగానే బస్సు ఆపి లోపలికి వచ్చాడు. కండక్టర్ అలాగే చూస్తుండగా.. ఏమైందో అర్థం కాని మహిళ బస్సు ఎందుకు ఆపారంటూ అడుగుతోంది. కానీ అతడు మాత్రం సమాధానం చెప్పకుండానే.. నేరుగా వెళ్లి ఆమెపై పడ్డాడు. అలాగే చూస్తున్న కండక్టర్‌కు బస్సులోకి ఎవరూ రాకుండా చూడమని చెప్పాడు. బయట ఎవరైనా కనిపించినా వెంటనే చెప్పాలని అన్నాడు. ఇందుకు కండక్టర్ కూడా ఒప్పుకోగా.. సదరు డ్రైవర్ దారుణంగా మహిళపై అత్యాచారానికి పాల్పడ్డాడు.కోరిక తీరాక అదే బస్సులో మహిళను తీసుకుని ఓ రోడ్డు వద్ద దింపేశాడు. దారుణంగా అత్యాచారానికి గురైన మహిళ నేరుగా ఇంటికి వెళ్లకుండా.. పోలీస్ స్టేషన్‌కు వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈక్రమంలోనే ఆమెను దింపిన చోటుకు వెళ్లగా అక్కడే బస్సు డ్రైవర్, కండక్టర్ ఉన్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అయితే నిందితుడు డ్రైవర్ 35 ఏళ్ల రోషన్ లాల్, కండక్టర్ నాన్హేలు బదౌన్‌లోని హర్షత్తాపూర్ గ్రామానికి చెందినవారు.రోషన్ మూడు నెలలుగా డ్రైవర్‌గా పని చేస్తున్నప్పటికీ.. నాన్హే ఆరు వారాల క్రితమే ఉద్యోగంలో చేరినట్లు చెప్పారు. వీరి విచారణ తర్వాత నిందితులను స్థానిక కోర్టు ముందు హాజరు పరిచి జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. అయితే నేరానికి ఉపయోగించిన బస్సును కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

గ్యారెంటీలకు గ్యారెంటీ లేదు మహిళలకు కాంగ్రెస్ ధోకా

హక్కుగాప్రజలుకోరడానికివీల్లేదు...గృహలక్ష్మిపథకంపై కర్ణాటక కాంగ్రెస్ సర్కార్ మడతపేచీ...నిధులుంటేనే చెల్లింపులు చేస్తాం...హక్కుగా ప్రజలు కోరడానికి వీల్లేదు... హైకోర్టుకు డీకే సర్కార్ సమాధానం



న్యూఢిల్లీ: గ్యారెంటీలంటూ అలవిమాలిన హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం పథకాల అమలు విషయంలో చేతులెత్తేస్తోంది. ఆర్థిక ఇబ్బందుల కారణంగా తమ ప్రధాన పథకమైన 'గృహ లక్ష్మి' కింద రెండు నెలల చెల్లింపులను నిలిపివేయాల్సి వచ్చిందని రాష్ట్ర ప్రభుత్వం కర్ణాటక హైకోర్టుకు తెలిపింది. దీనివల్ల సుమారు కోటి మంది మహిళలకు అందచేయాల్సిన సుమారు రూ.4,000 కోట్ల మొత్తం బకాయిగా మిగిలిపోయింది. ఈ పథకం కింద అర్హులైన మహిళా గృహ యజమానులకు నెలకు రూ.2,000 అందచేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. 2025 ఫిబ్రవరి, మార్చి నెలలకు సంబంధించి చెల్లించాల్సిన మొత్తం ఒక్కో లబ్ధిదారునికి రూ.4,000 అవుతుంది. రెండు నెలలకు సంబంధించిన ప్రతిపాదనలను ఆర్థిక శాఖకు సమర్పించినప్పటికీ, బడ్జెట్ పరిమితుల కారణంగా గ్రాంట్లను నిలిపివేయాల్సి వచ్చిందని ఒక రిట్ పిటిషన్‌కు సమాధానంగా ప్రభుత్వం పేర్కొంది.

డబ్బుంటేనే చెల్లింపులు

ఈ పథకం కింద అందే సహాయం బడ్జెట్ కేటాయింపులపై ఆధారపడి ఉంటుందని, దీనిని అమలు చేయడగిన హక్కుగా ఎవరూ కోరలేరని ప్రభుత్వం వాదించింది. 2023 ఆగస్టు 30న ప్రారంభించిన ఈ పథకానికి వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ను కొట్టివేయాలని ప్రభుత్వం హైకోర్టును కోరింది. గృహలక్ష్మి పథకం కింద 2025 ఫిబ్రవరి, మార్చి నెలలకు సంబంధించిన రెండు విడతల సాయం అందలేదని పేర్కొంటూ ఇద్దరు సామాజిక కార్యకర్తలు ప్రజాప్రయోజన వ్యాఖ్యం దాఖలు చేశారు. ఈ బకాయిలు సుమారు రూ.4000 కోట్ల మేర ఉన్నాయని, దాదాపు 1.26 కోట్ల మంది మహిళలు ప్రభావితమయ్యారని పిటిషనర్లు పేర్కొన్నారు. ఈ పిటిషన్‌ను జస్టిస్ అనుశివరామన్, జస్టిస్ కేవెన్ భరత్‌కుమార్‌తో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. పథకం కింద ఆర్థిక సాయం అందిస్తామని ప్రభుత్వం ప్రకటించినంత మాత్రాన, దాన్ని నిరంతరం చెల్లించాల్సిన చట్టబద్ధమైన బాధ్యత ఏర్పడదని ప్రభుత్వం తన వాదనలో పేర్కొన్నది.

కాంగ్రెస్ సర్కార్‌పై మహిళల మండిపాటు

ఎన్నికలకు ముందు హామీలిచ్చి, అధికారంలోకి వచ్చాక చేతులెత్తేసిన కాంగ్రెస్ సర్కార్‌పై మహిళలు మండిపడుతున్నారు. అమలు చేయడం చేతకానప్పుడు హామీలెందుకు ఇచ్చారని నిలదీస్తున్నారు. నిధులుంటేనే చెల్లింపులు చేస్తాం.. ప్రజలు హక్కుగా కోరలేరని డీకే సర్కార్ పేర్కొనడాన్ని వారు తప్పుబడుతున్నారు. అమలు చేయడం చేతకాక, కాంగ్రెస్ సర్కార్ కుంటిసాకులు చెబుతున్నదని విమర్శిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీకి గట్టి గుణపాఠం చెబుతామని హెచ్చరిస్తున్నారు.

తిరువణ్ణామలై అరుణాచలేశ్వర ఆలయంలో అపచారం....

ఏకంగా నంది వాహనంపై ఎక్కి..!



పంచభూత క్షేత్రాలలో అగ్ని క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన తిరువణ్ణామలై అరుణాచలేశ్వర స్వామి ఆలయంలో ఈ ఏడాది కార్తీక దీపోత్సవాలు నవంబర్ 15వ తేదీన ధ్వజారోహణంతో ప్రారంభం కానున్నాయి. ఈ ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో కార్తీక దీపోత్సవానికి సంబంధించి ఆలయంలో వివిధ ముందస్తు ఏర్పాట్లు చేపడుతున్నారు. ఇందులో భాగంగా గత రెండు రోజులుగా అగ్నిమాపక శాఖ సిబ్బంది ఆలయంలోని నాలుగు గోపురాలను నీటితో శుభ్రం చేసే పనుల్లో నిమగ్నమయ్యారు. అయితే, బుధవారం (నవంబర్ 05) అరుణాచలేశ్వర ఆలయంలోని రాజగోపురం లోపలి భాగాన్ని అగ్నిమాపక సిబ్బంది నీటితో శుభ్రం చేస్తున్న సమయంలో, స్వామివారి వీధి ఉత్సవాలకు ఉపయోగించే నంది వాహనంపైకి ఎక్కి గోపురాన్ని శుభ్రం చేశారు.ఈ ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. దీంతో భక్తులు, ఆధ్యాత్మికవేత్తలు, శివాచార్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఈ చర్యను ఖండించారు.ఈ నేపథ్యంలో తిరువణ్ణామలై అరుణాచలేశ్వర ఆలయ యాజమాన్యం చర్యలు చేపట్టింది. తిరుమంజన గోపురం సమీపంలో విధులు నిర్వహిస్తున్న ఆలయ ఉద్యోగి అశోక్‌ను తాత్కాలికంగా విధుల నుంచి సస్పెండ్ చేస్తూ హిందూ దేవాదాయ శాఖ కమిషనర్ పరనిధరన్ ఆదేశాలు జారీ చేశారు. ఇదిలా ఉండగా, నంది వాహనంపైకి ఎక్కి శుభ్రపరిచే పనుల్లో పాల్గొన్న అగ్నిమాపక శాఖ సిబ్బంది తమ చర్యకు క్షమాపణలు కోరుతూ లేఖ రాసి ఆలయ అధికారులకు అందజేశారు.అరుణాచలేశ్వర ఆలయంలో స్వామివారి వీధి ఉత్సవాలకు ఉపయోగించే పవిత్రమైన నంది వాహనంపైకి ఎక్కి అగ్నిమాపక సిబ్బంది శుభ్రపరిచే పనులు చేయడం భక్తుల్లో తీవ్ర ఆందోళనకు, అసంతృప్తికి కారణమైంది.

నేను సీడబ్ల్యూసీ మెంబర్‌ను..ఆప్షనల్ టీపీసీసీ పిలిస్తే విచారణకు వస్తానా?



హైదరాబాద్ : తెలంగాణ కాంగ్రెస్ లో అసంతృ జ్వాలలు కొనసాగుతూనే ఉన్నాయి. మొన్న ఢిల్లీ శాంగ్రిలా హోటల్‌లో తాగి తన్నుకున్న మంత్రి దామోదర రాజనర్సింహ, ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావుల వ్యవహారం ఓ కొలిక్కి వచ్చే సూచనలు కనిపించడం లేదు. ఇద్దరి మధ్య సయోధ్య కుదిరిచ్చేందుకు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ నిన్న గాంధీ భవన్‌కు విచారణకు పిలిచాడు.అయితే మహేష్ కుమార్ గౌడ్ స్థాయి ఏంటో తెలుసుకోవాలని, సీడబ్ల్యూసీ శాశ్వత సభ్యుడిని టీపీసీసీ విచారణకు పిలవడం ఏంటని దామోదర రాజనర్సింహ తన సన్నిహితుల వద్ద అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే నిన్న విచారణకు హాజరు కాలేదని గుసగుసలు వినిపిస్తున్నాయి. దామోదర రాజనర్సింహ విచారణకు హాజరు కాకపోవడంతో తానెందుకు విచారణకు రావాలని ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు సైతం దుమ్మా కొట్టారు. ఇద్దరూ రాకపోవడంతో చేసేదేమీ లేక మహేష్ కుమార్ గౌడ్ గాంధీ భవన్ నుంచి నిరాశగా వెళ్లిపోయాడు.

“ఈ రెండేళ్లలో నన్ను ఏమైనా చేయండి.. కానీ నాకు టైం వచ్చినప్పుడు మాత్రం’.. టీడీపీ నేతలకు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి వార్నింగ్

ఏపీలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో వైసీపీ మూడు మున్సిపాలిటీల్లో మాత్రమే గెలవగా.. అందులో నందికొట్కూరు ఒకటి. వైసీపీ యువనేత బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి ఈ విజయంలో కీలక పాత్ర పోషించారు. అయితే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను సజావుగా సాగనీయొద్దనే ఉద్దేశంతో తనను గృహ నిర్బంధం చేశారని.. నియోజకవర్గంలోని తమ పార్టీ నేతలను పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారని ఆయన ఆరోపించారు. ఈ రెండేళ్లలో తనను ఏమైనా చేసుకోండని.. కానీ తనకు టైం వచ్చినప్పుడు మాత్రం తప్పు చేసిన వాళ్లను వదలనన్నారు.ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా నంద్యాల జిల్లా ముచ్చుమర్రిలో వైసీపీ యువ నేత బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డిని పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. ఈ విషయమై సిద్ధార్థ రెడ్డి మాట్లాడుతూ.. నందికొట్కూరు నియోజకవర్గంలో రాత్రి నుంచే వైసీపీ నేతలను పోలీసులు ఆధీనంలోకి తీసుకున్నారని ఆరోపించారు. కొన్ని బూత్‌ల్లో ఏజెంట్లను కూడా కూర్చోబెట్టకుండా దౌర్జన్యం చేస్తున్నారని మండిపడ్డారు. నందికొట్కూరు మున్సిపల్ ఎన్నికల్లో వైసీపీ గెలిచిన తర్వాత ఈ ఎన్నికలను సజావుగా జరగనిస్తారనే ఆలోచన తమలో ఏ కోశానా లేదన్నారు.“మున్సిపాలిటీ ఎన్నికల్లో వైసీపీ గెలిచిన తర్వాత.. డిక్లరేషన్ ఫామ్‌ను ఇవ్వకుండా ఆపేసి.. ఓట్ల కౌంటింగ్‌ను ఆపేసి.. మా ఓట్లను కూడా వాళ్ల ఓట్లలో కలుపుకోవాలని టీడీపీ నేతలు ఆలోచించారు. అది చూశాక ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు సజావుగా సాగుతాయనే నమ్మకం మాకు లేకపోయింది. అందుకు తగ్గట్టుగానే నియోజకవర్గంలోని ప్రతి మండలం, గ్రామంలో ఉండే వైసీపీ లీడర్లను బైండోవర్ చేసి, అవమానించారు” అని బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి ఆరోపించారు.టీడీపీ, వైసీపీ వాళ్లు కొట్టుకుంటే వచ్చే నష్టం లేదన్న సిద్ధార్థ్ రెడ్డి.. పోలీసులు ఇన్వాల్వ్ కావడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు. పోలీసు వ్యవస్థ ఈ స్థాయికి దిగజారిపోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నపెద్దా దీన్ని గమనిస్తున్నారని.. ఈ ప్రభుత్వం నిలబడదని మండిపడ్డారు.తమ ప్రాంతంలో కరువును తట్టుకోలేక రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఉందన్న సిద్ధార్థ రెడ్డి... చుట్టూ నీళ్లు ఉన్నప్పటికీ తమ ప్రాంతానికి నీళ్లు ఇవ్వకుండా.. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ ఏరియాకు తరలిస్తున్నారన్నారు. అతి కష్టం మీద పంటలను పండిస్తే.. పంటకు గిట్టుబాటు ధర అందించడం లేదన్నారు. ప్రభుత్వం నుంచి రైతులకు ఆర్థిక సాయం అందడం లేదని.. ఇలాంటి పరిస్థితుల్లో తెలుగు దేశం ప్రభుత్వం.. పోలీసులను ఉపయోగించుకొని ఎన్నికలు జరుపుతోందని మండిపడ్డారు.ప్రజలు వచ్చి ఓటేస్తే.. ఏజెంట్లు లేకపోయినా ఎన్నికల్లో తామే గెలుస్తామన్న సిద్ధార్థ్ రెడ్డి.. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు తాము టీడీపీ నేతలను ఇలా బెదిరించి ఎన్నికలు నిర్వహించలేదన్నారు. గ్రామాల్లో ఉండే వైసీపీ అభ్యర్థులను, ఇంట్లో ఉండే వాళ్ల ఆడవాళ్లను కూడా అవమానిస్తున్నారని ఆయన మండిపడ్డారు.“ఈ రెండు సంవత్సరాల్లో నన్ను కూడా ఏమైనా చేయాలంటే చేయండి.. నేను టీడీపీ వాళ్ల జోలికి వెళ్లను. గడిచిన 24 గంటల్లో కొన్ని గ్రామాల్లో నాకు సంబంధించిన, వైసీపీ వ్యక్తులను నీచాతినీచంగా అవమానించారు. నన్ను కొట్టాలనుకుంటే కొట్టండి, తిట్టాలనుకుంటే తిట్టండి, చంపాలనుకుంటే చంపండి. కానీ నాకు టైం వచ్చినప్పుడు మాత్రం ఊరుకోను. చేయని తప్పుకు నా గుండెను గాయపర్చారు. మేం అధికారంలో ఉన్నప్పుడు నిజాయితీగా ఉన్న పాపానికి.. ఈ రోజు మీరు పెడుతున్న ఇబ్బంది అంతా ఇంతా కాదు. ఎవరైతే తప్పు పనులు చేస్తున్నారో వాళ్లు తప్పకుండా సమాధానం చెప్పాలి” అని సిద్ధార్థ్ రెడ్డ



హెచ్చరించారు.“నందికొట్కూరులో టీడీపీ వాళ్లు ఎన్నికల రోజున డబ్బులు పంచుతున్నారు. వైసీపీ వాళ్లు పంచొద్దు. ప్రచారం టీడీపీ వాళ్లు చేసుకుంటున్నారు. వైసీపీ వాళ్లను ప్రచారం చేయనీయడం లేదు. ఇంత జరిగినా పోలింగ్ రోజున ఒక్క మనిషి కూడా బయట లేదు. వాళ్లు డబ్బులు పంచినా, వాళ్లే ఏజెంట్లుగా ఉన్నా.. వాళ్లే ప్రచారం చేసుకున్నా గెలవలేరనే భయమా?” అని సిద్ధార్థ రెడ్డి ప్రశ్నించారు.

ఎస్ఈసీ పక్షపాత వైఖరితోనే ప్రజాస్వామ్యానికి ఓటమి : వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి

సీసీ కెమెరాలు,వెబ్‌కాస్టింగ్‌పై సుప్రీంకోర్టుఆదేశాలుబేఖాతర్ ... 31,500 పోలింగ్ బూత్‌లకు గాను కేవలం 16 వేల బూత్‌లలోనే సీసీ కెమెరాలు... కుప్పం నుంచి పులివెందుల వరకు రిగ్గింగ్‌లు, దాడులు, అక్రమ నిర్బంధాలు... కౌంటింగ్‌అక్రమాలపై సీసీకెమెరాల ఫుటేజ్ భద్రపరచాలనిఎస్ఈసీకివిజ్ఞప్తి... అక్రమాలకు పాల్పడిన అధికారులు, పోలీసులపై న్యాయపోరాటం... ఎస్ఈసీని సైతం ఈ అక్రమాలకు బాధ్యత వహించాల్సిందే

విజయవాడ (స్వర్ణాంధ్రప్రతినిధి) : ఎస్ఈసీ పక్షపాత వైఖరి వల్లే రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఓడిపోతోందని, కట్టలు కట్టలుగా ఫిర్యాదులు, ఎన్నికల్లో అక్రమాలకు ఆధారాలు సమర్పించినా ఎస్ఈసీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి అసహనం వ్యక్తం చేశారు. పరిషత్ ఎన్నికల్లో అధికార కూటమి పార్టీల అక్రమాలను ఆధారాలతో సహా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ కి వివరించిన అనంతరం అక్కడే పార్టీ నాయకులతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌంటింగ్ కేంద్రాల్లో టీడీపీకి చెందిన చోటామోటా నాయకులు యథేచ్ఛగా తిరుగుతూ ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేస్తున్నారని, అందుకే కౌంటింగ్ కేంద్రాల్లోని సీసీ కెమెరాల ఫుటేజ్‌ను భద్రపరచాలని మరోసారి ఎస్ఈసీని కోరినట్టు చెప్పారు. ఆ ఫుటేజ్ ఆధారంగా అక్రమాలకు పాల్పడిన టీడీపీ నాయకులను, అధికారులను న్యాయస్థానాల్లో బాధ్యులుగా నిలబెడతామని లేళ్ల అప్పిరెడ్డి హెచ్చరించారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు, వైఎస్సార్‌సీపీ గ్రీవెన్స్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు నారాయణమూర్తి, పార్టీ ఎంప్లాయీస్ అండ్ పెన్షనర్స్ వింగ్ రాష్ట్ర అధ్యక్షుడు నలమారు చంద్రశేఖర్ రెడ్డిలతోపాటు పార్టీ అనుబంధ విభాగాలకు చెందిన పలువురు నాయకులు ఉన్నారు.

పరిషత్ ఎన్నికల్లోనూ ప్రజాస్వామ్యం ఖూనీ:

రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో గత మున్సిపల్ ఎన్నికల తరహాలోనే కూటమి ప్రభుత్వం అరాచకాలకు పాల్పడుతోంది. వైఎస్సార్‌సీపీ నాయకులను అక్రమంగా నిర్బంధించడం, హౌస్ అరెస్టులు చేయడం, పార్టీ ఏజెంట్లను పోలింగ్ కేంద్రాల నుంచి బయటకు పంపించడం వంటి చర్యలతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు. ఎన్నికల ప్రక్రియలో పోలీసులతో పాటు రెవెన్యూ అధికారులను ఉపయోగించుకుని అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారు. మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్‌లో సైతం వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు గెలిచిన చోట రీకౌంటింగ్ పేరుతో ఫలితాలను తారుమారు చేసి టీడీపీ అభ్యర్థులు గెలిచినట్లు ప్రకటించిన దారుణ పరిస్థితులు రాష్ట్రంలో నెలకొన్నాయి.ఎస్ఈసీని కలిసి ఫిర్యాదులు చేసినా, ఆధారాలు సమర్పించినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కనీసం ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలైనా ప్రశాంతంగా నిర్వహించాలని కోరినా పట్టించుకోలేదు.

ఈ అక్రమాలపై ఎస్ఈసీ చర్యలు తీసుకోవాలి :

సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా ఎన్నికల నిర్వహణలో వాటిని తుంగలో తొక్కారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, వీడియో షూటింగ్, వెబ్‌కాస్టింగ్ నిర్వహించాలని, అభ్యర్థులకు రక్షణ కల్పించాలని, ఓటర్లు స్వేచ్ఛగా ఓటు వేసేలా చూడాలని సుప్రీంకోర్టు ఆదేశించినా అమలు చేయలేదు. రాష్ట్రంలో మొత్తం 31,500 పోలింగ్ బూత్‌లు ఉంటే కేవలం 16 వేల బూత్‌లలో మాత్రమే సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. మిగిలిన 15 వేల పోలింగ్ కేంద్రాల్లో కనీసం వీడియో షూటింగ్ కూడా సక్రమంగా జరగలేదు. కుప్పంలో సీసీ కెమెరాలు లేకుండా ఏజెంట్లను బయటకు పంపించి రిగ్గింగ్‌కు పాల్పడిన పరిస్థితులు కనిపించాయి.

పులివెందులలో పెట్రోల్ బాంబులతో ఓటర్లను భయభ్రాంతులకు గురిచేయడం, ఏజెంట్లను పోలీస్ స్టేషన్లలో నిర్బంధించడం, కీలక నేతలను హౌస్ అరెస్టులు చేయడం కొనసాగింది. శిల్పా రవి, చక్రపాణిరెడ్డి, కోడూరు శ్రీనివాసులు, మేరుగ నాగార్జున, శైలజానాథ్ వంటి వైఎస్సార్‌సీపీ నాయకులను నిర్బంధించారు. శ్రీకాకుళంలో ఎమ్మెల్యే శంకర్ వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడులకు దిగుతుంటే, టెక్కలిలో అచ్చెన్నాయుడు ఏజెంట్లకు ఫోన్లు చేసి పిలిపిస్తున్న పరిస్థితులు ఉన్నాయి. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలతో పాటు పల్నాడు జిల్లాలోనూ ఎన్నికల ప్రక్రియను అడ్డుకున్నారు. పల్నాడు జిల్లాలో ఉదయం 10.30 గంటలకే పోలింగ్ అయిపోయిందంటూ ఓటర్లను వెనక్కి పంపిన ఘటనలు జరిగాయి. పుంగనూరు, పీలేరు నియోజకవర్గాల్లో పోలింగ్ కేంద్రాలను ఆక్రమించి రిగ్గింగ్‌కు పాల్పడ్డారు. ఉరవకొండలోని కూడేరు మండలంలో సీఐ దగ్గరుండి దాడులు చేయించాడు. పోలీసు, రెవెన్యూ అధికారుల అండతో జరుగుతున్న ఈ అక్రమాలన్నింటికీ బాధ్యులు ఎవరో తేల్చాల్సిందే.

కట్టలు కట్టలుగా ఫిర్యాదులు, ఆధారాలు సమర్పించాం:

నిన్నటి కౌంటింగ్‌లోనూ వైఎస్సార్‌సీపీ గెలిచిన చైర్‌పర్సన్, కార్పొరేటర్, కౌన్సిలర్ అభ్యర్థుల విజయాలను ప్రకటించకుండా టీడీపీ నాయకుల ఒత్తిళ్లతో ఫలితాలను తారుమారు చేశారు. కౌంటింగ్ కేంద్రాల్లో టీడీపీకి చెందిన చోటామోటా నాయకులు యథేచ్ఛగా తిరుగుతూ ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేశారు. అందుకే కౌంటింగ్ కేంద్రాల్లోని సీసీ కెమెరాల ఫుటేజ్‌ను భద్రపరచాలని మరోసారి ఎస్ఈసీని కోరాం. ఆ ఫుటేజ్ ఆధారంగా అక్రమాలకు పాల్పడిన టీడీపీ నాయకులను, అధికారులను న్యాయస్థానాల్లో బాధ్యులుగా నిలబెడతాం.

ఇప్పటివరకు కట్టలు కట్టలుగా ఫిర్యాదులు, ఆధారాలు సమర్పించినా ఎస్ఈసీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరం. ఎస్ఈసీ పక్షపాత వైఖరి వల్లే రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఓడిపోతోంది. ఎన్నికల్లో ప్రజలు ఓడిపోతున్నారు, ప్రజాస్వామ్యం ఓడిపోతోంది, అప్రజాస్వామిక విధానాలకు పాల్పడుతున్న కూటమి నేతలకు మాత్రం అధికారులు వత్తాసు పలుకుతున్నారు. ఇకపై అక్రమ నిర్బంధాలకు, రిగ్గింగ్‌లకు, కౌంటింగ్ అక్రమాలకు పాల్పడిన ఏ ఒక్క అధికారినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదు. ఎస్ఈసీని కూడా న్యాయపోరాటంలో బాధ్యురాలిగా నిలబెడతాం.

తప్పు చేసిన పోలీసు, రెవెన్యూ అధికారులు, టీడీపీ నాయకులందరిపై చట్టపరంగా, న్యాయపరంగా పోరాటం చేస్తాం. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు వైఎస్సార్‌సీపీ పోరాటం కొనసాగుతుందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి స్పష్టం చేశారు.

రాష్ట్రంలో పతనావస్థలో పోలీస్‌వ్యవస్థ...వెన్నుపోటు పార్టీకి తోలుబొమ్మల్లా పోలీసులు :టీజేఆర్ సుధాకర్‌బాబు ఫైర్

విజయవాడ (స్వర్ణాంధ్రప్రతినిధి) : స్థానిక సంస్థల ఎన్నికలను వెన్నుపోటు పార్టీ పూర్తిగా అపహాస్యం చేస్తూ ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లోనూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు ఫైర్ అయ్యారు.

ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పోలీసులను అడ్డం పెట్టుకుని దౌర్జన్యాలకు పాల్పడుతోందని ఆయన ఆక్షేపించారు. రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ పూర్తిగా అధికార పార్టీకి తొత్తుగా మారిందని ధ్వజమెత్తారు.

అందుకే గతంలో ఎప్పుడూ హింసాత్మక ఘటనలు జరగని బూత్‌లలో సైతం ఇప్పుడు దౌర్జన్యాలు జరుగుతున్నాయని చెప్పారు. కొన్ని చోట్ల ఏకంగా పోలీసులే ఓటర్లను అడ్డుకోవడం అత్యంత హేయమని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన టీజేఆర్ సుధాకర్‌బాబు తేల్చి చెప్పారు.

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పరాకాష్టకు అరాచకాలు:

రాష్ట్రంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో వెన్నుపోటు పార్టీ అరాచకాలు పరాకాష్టకు చేరాయి. అనంతపురం నుంచి శ్రీకాకుళం వరకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను అడ్డుకోవడం, నోటీసులు ఇవ్వడం, హౌస్ అరెస్టులు చేయడం వంటి చర్యలకు పాల్పడుతున్నారు. మరోవైపు టీడీపీ నాయకులు, గుండాలకు రిగ్గింగ్‌లు, పోలింగ్ బూత్‌ల ఆక్రమణలకు పూర్తి స్వేచ్ఛనిస్తున్నారు. వైఎస్సార్‌సీపీకి బలమైన ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని చంద్రబాబు, నారా లోకేష్, పవన్ కళ్యాణ్ ఘర్షణలు సృష్టించే వ్యూహాలు అమలు చేస్తున్నారు. గతంలో ఎలాంటి గొడవలు జరగని పోలింగ్ కేంద్రాల్లోనూ నేడు దాడులు, ఘర్షణలు జరుగుతున్నాయి. ఎన్నికలు స్వేచ్ఛగా జరిగితే ఓటమి తప్పదన్న భయంతోనే చంద్రబాబు అంతులేని అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారు.

దిగజారిన పోలీస్ వ్యవస్థ. తోలుబొమ్మల్లా పోలీసులు:

ఇతర ప్రాంతాల నుంచి గుండాలను తీసుకొచ్చి దౌర్జన్యాలకు పాల్పడుతున్నా పోలీసులు ప్రేక్షకపాత్ర వహిస్తున్నారు. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసు వ్యవస్థ చంద్రబాబుకు తొత్తుగా మారి టీడీపీ గుండాలకు అండగా నిలుస్తోంది. వైయస్సార్ కడప జిల్లాలో ఎంపీ వైయస్ అవినాష్‌రెడ్డిని డీఎస్పీ మురళీనాయక్ అడ్డుకోవడం, పాలపర్తిలో ఏజెంట్ పత్రాలను చింపివేయడం, పులివెందులలో బీటెక్ రవి పోలింగ్ బూత్‌లలో తిష్టవేసి రిగ్గింగ్‌కు పాల్పడుతున్నా పోలీసులు పట్టించుకోకపోవడం దారుణం. లింగాల మండలంలో సాక్షి విలేకరి పుల్లారెడ్డిపై టీడీపీ గుండాలు దాడి చేసి ఫోన్ ధ్వంసం చేసినా పోలీసులు చర్యలు తీసుకోలేదు. మున్సిపల్ ఎన్నికల మాదిరిగానే పరిషత్ ఎన్నికల్లో కూడా యథేచ్ఛగా రిగ్గింగ్ జరుగుతోంది. తిరుపతి జిల్లా పెనగలూరు మండలం నల్లబెద్దిపల్లెలో వైఎస్సార్‌సీపీ ఏజెంట్లను పోలింగ్ కేంద్రాల నుంచి బయటకు లాగేశారు. ఇంకా పులివెందుల, శ్రీకాకుళం, అనంతపురం, నంద్యాల, సత్యసాయి, నెల్లూరు, చిత్తూరు, తిరుపతి, ప్రకాశం, కందుకూరు, సింగనమల, చంద్రగిరి, పుంగనూరు ప్రాంతాల్లో పోలింగ్ బూత్‌ల ఆక్రమణ చేసి యథేచ్ఛగా రిగ్గింగ్ చేస్తున్నారని, అయినా ఎన్నికల అధికారులు, పోలీసులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని టీజేఆర్ సుధాకర్‌బాబు ఆక్షేపించారు.

డబ్బు, అధికారం, బెదిరింపులతోనే కూటమి గెలుపు...నెల్లూరు మున్సిపల్ ఎన్నికల్లో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారు

నెల్లూరు: నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో వెన్నుపోటు పార్టీ కూటమి డబ్బు, అధికార దుర్వినియోగం, బెదిరింపులు, అక్రమాలకు పాల్పడి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిందని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ పి. చంద్రశేఖర్ రెడ్డి ధ్వజమెత్తారు. ఎన్నికల ప్రక్రియలో అడుగడుగునా అధికార దుర్వినియోగం జరిగిందని, ప్రతిపక్ష అభ్యర్థులను పోటీ చేయకుండా అడ్డుకునేందుకు అనేక కుట్రలు పన్ని కుతంత్రాలకు దిగారని ఆయన మండిపడ్డారు.

నెల్లూరు సిటీలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, కానీ అభ్యర్థులకు పోటీ చేసే అవకాశమే లేకుండా చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని స్పష్టం చేసారు. ఐదేళ్లపాటు ప్రజల మధ్య ఉండి సేవ చేసిన అభ్యర్థులను నామినేషన్ దశలోనే వివిధ కారణాలు చూపించి అనర్హులుగా ప్రకటించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వెన్నుపోటు పార్టీ కూటమి ప్రభుత్వం నుంచి ఎన్ని బెదిరింపులు ఎదురైనా వెనకడుగు వేయకుండా పోరాడిన వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు, కార్యకర్తలను ఎప్పటికీ మర్చిపోలేమన్నారు. ఎన్నికల్లో గెలిచినా ఓడినా ప్రజల కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికీ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బంది వచ్చినా అర్ధరాత్రి అయినా వారి దగ్గరకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నానని, వారి కోసం ఎంతవరకైనా పోరాడుతానని హామీ ఇచ్చారు. రెండేళ్ల తర్వాత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడుతుందని, ప్రజల కోసం పోరాడిన ప్రతి ఒక్కరికీ తగిన గౌరవం, గుర్తింపు లభిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. నెల్లూరులో ఉన్న గౌరవప్రదమైన రాజకీయ వాతావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని పి. చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. అధికారంలో ఉన్నవారు ప్రజాస్వామ్య విలువలను గౌరవించాలని, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. వైఎస్సార్‌సీపీ ప్రజల పక్షాన నిరంతరం పోరాడుతుందని, కార్యకర్తలు ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని తేల్చి చెప్పారు.

డివిజన్ల విభజన ప్రక్రియ నుంచే అక్రమాలు:

నెల్లూరు నగరంలో డివిజన్ల విభజన మొదలుకొని ఓటర్ల జాబితాల తయారీ వరకు అనేక అవకతవకలు జరిగాయి. వైఎస్సార్‌సీపీ బలంగా ఉన్న ప్రాంతాలను ముక్కలు చేసి వేర్వేరు డివిజన్లలో కలిపేందుకు ప్రయత్నించారు. కోర్టును ఆశ్రయించినప్పటికీ అధికారులు తమ పద్ధతులను మార్చుకోలేదు.

సెప్టెంబర్ 22న మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో విడుదల చేసిన డివిజన్ వారీ ఓటర్ల జాబితాలకు, నోటిఫికేషన్‌కు ముందు ఇచ్చిన జాబితాలకు భారీ తేడాలు ఉన్నాయి. నోటిఫికేషన్‌కు ఒక్కరోజు ముందు వరకు కూడా ఓటర్ల జాబితాలను తారుమారు చేయడం, పోలింగ్ కేంద్రాలను మార్చడం ద్వారా అభ్యర్థులను, ఓటర్లను గందరగోళానికి గురిచేశారు. 63వ డివిజన్ నుంచి పోటీ చేసిన జిల్లా మైనారిటీ అధ్యక్షుడు సిద్ధిక్ నామినేషన్‌ను అన్యాయంగా తిరస్కరించారు. సిద్ధిక్ అక్టోబర్ 17న నామినేషన్ దాఖలు చేయడానికి వెళ్లిన సమయంలో మురళీకృష్ణ హోటల్ వద్ద జరిగిన చిన్న సంఘటనను సాకుగా చూపించి, అక్టోబర్ 18న ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఆ తర్వాత అక్టోబర్ 19న ఆయన నామినేషన్‌ను అనర్హతకు గురిచేశారు.

అలాగే కబాడిపాలెం ప్రాంతానికి చెందిన శాంతి అనే మహిళ నామినేషన్‌ను కూడా అన్యాయంగా తిరస్కరించారు. ఆమె టౌన్ లెవల్ ఫెడరేషన్ అధ్యక్షురాలిగా పనిచేస్తున్నారనే కారణంతో నామినేషన్‌ను తిరస్కరించారు. పొదుపు సంఘాల్లో సభ్యురాలిగా ఉండి, ఇతర మహిళల కార్యకలాపాలను సమన్వయం చేసే బాధ్యత మాత్రమే ఆమె నిర్వహిస్తున్నారు. అందుకు ఎలాంటి జీతం లేదా గౌరవ వేతనం లేదు. ఈ విషయంపై కలెక్టర్‌ను కలిసినప్పుడు కూడా ఆమె నామినేషన్‌ను పరిగణనలోకి తీసుకుంటామని హామీ ఇచ్చారు. కానీ చివరకు మళ్లీ అదే కారణంతో తిరస్కరించారు.


బెదిరింపులు.. డబ్బులిచ్చి ఒత్తిళ్లు:

నెల్లూరు సిటీలోని 57వ డివిజన్‌కు చెందిన మైనారిటీ నాయకుడు అబ్దుల్ మస్తాన్‌ను పాత కేసుల పేరుతో బెదిరించారు. నగరంలోకి వస్తే పీడీ యాక్ట్ పెడతామని హెచ్చరించారు. అలాగే 64, 58, 69, 10వ డివిజన్లలో పోటీ చేస్తున్న అభ్యర్థులపై తీవ్ర ఒత్తిళ్లు తెచ్చారు. నామినేషన్లు ఉపసంహరించుకోవాలని డబ్బులు ఆశ చూపడం, లేదంటే కేసులు పెడతామని బెదిరించడం వంటి చర్యలకు పాల్పడ్డారు. బీ ఫారాలు ఇచ్చే సమయంలో ఇద్దరు అభ్యర్థులను తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారనే సమాచారం రావడంతో, జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డితో కలిసి కార్లు మార్చుకుంటూ వెళ్లి అభ్యర్థులకు బీ ఫారాలు అందించాల్సిన పరిస్థితి వచ్చింది. నెల్లూరు నగర ఎన్నికల్లో డబ్బు ప్రభావం ఎన్నడూ లేనంతగా పెరిగింది. ఒక్కో డివిజన్‌కు సగటున రూ. 1.3 కోట్ల నుంచి రూ.2 కోట్ల వరకు ఖర్చు పెట్టినట్లు ప్రచారంలో ఉంది. పోలీసు అధికారులను పక్కన పెట్టుకొని టీడీపీ నాయకులు కాన్ఫరెన్స్ కాల్స్‌లో డబ్బులు అందించే విషయంపై మాట్లాడిన 15 రికార్డింగులు నా వద్ద ఉన్నాయి. ఎన్నికల్లో డబ్బు, అధికారం, బెదిరింపులు ప్రధాన పాత్ర పోషించాయి. అందుకే వెన్నుపోటు పార్టీ కూటమి గెల్చింది. ఏది ఏమైనా ప్రజా సమస్యలపై తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందని చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

రాహుల్ ర్యాలీకి గైర్హాజరు: మేనమామ పెద్దకర్మకు వెళ్లినా యూత్ కాంగ్రెస్ నేతపై వేటు

రాహుల్ గాంధీ ర్యాలీకి హాజరుకాని 200 మంది యూత్ కాంగ్రెస్ నేతలపై వేటు...మేనమామ పెద్దకర్మకు వెళ్లినందుకు నేత రోహిత్ రజోరియా సస్పెన్షన్...తెలంగాణలో 14 మంది సహా ఏడు రాష్ట్రాల్లో కార్యకర్తలపై చర్యలు...బార్‌కోడ్, యాప్‌తో హాజరును ట్రాక్ చేసిన యూత్ కాంగ్రెస్...క్రమశిక్షణ కోసమే ఈ చర్యలనిసమర్థించుకున్నయూత్‌కాంగ్రెస్ నాయకత్వం

కాంగ్రెస్ పార్టీలో క్రమశిక్షణ చర్యలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నవంబర్ 1న రాహుల్ గాంధీ పాల్గొన్న ఇండియా కూటమి ర్యాలీకి హాజరుకాని వారిపై యూత్ కాంగ్రెస్ నాయకత్వం కఠినంగా వ్యవహరించింది. దేశవ్యాప్తంగా సుమారు 200 మంది యూత్ కాంగ్రెస్ సభ్యులను పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. అయితే, మేనమామ పెద్దకర్మకు హాజరైనందుకు తనను సస్పెండ్ చేయడంపై ఓ యువజన నాయకుడు తీవ్ర ఆవేదన వ్యక్తం చేయడం ఈ వ్యవహారానికి కేంద్ర బిందువుగా మారింది.



వివరాల్లోకి వెళితే..

యూత్ కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్న రోహిత్ రజోరియా, తన మేనమామ మరణానంతర కర్మకాండల (తెర్వి) కారణంగా రాహుల్ ర్యాలీకి హాజరుకాలేదు. ఈ విషయం గురించి తాను ముందుగానే పార్టీ నాయకత్వానికి సమాచారం ఇచ్చానని, అందుకు సంబంధించిన కార్డును కూడా చూపించానని ఆయన తెలిపారు. అయినప్పటికీ, కనీసం వివరణ కోరకుండా తనను ఏకపక్షంగా సస్పెండ్ చేశారని ఆరోపించారు. గత 15 ఏళ్లుగా పార్టీ కోసం పనిచేస్తున్నానని, అనేకసార్లు పార్టీ నిరసనల్లో పాల్గొని కేసులు, జైలు జీవితం కూడా అనుభవించానని, అయినా తన సేవలను గుర్తించకపోవడం బాధాకరమని అన్నారు.యూత్ కాంగ్రెస్ జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయి సభ్యులందరూ ఈ ర్యాలీకి తప్పనిసరిగా హాజరుకావాలని పార్టీ ముందుగానే ఆదేశాలు జారీ చేసింది. హాజరును ట్రాక్ చేసేందుకు బార్‌కోడ్ స్కానర్లు, “విత్ ఐవైసీ” (ఔట్‌రీచ్ కోజ) అనే ప్రత్యేక యాప్‌ను ఉపయోగించారు. సుమారు 15,000 మంది కార్యకర్తలు వచ్చారని నాయకులు చెబుతున్నా, సాంకేతిక సమస్యలు, కనెక్టివిటీ లోపాల వల్ల కేవలం 2,831 మంది మాత్రమే డిజిటల్‌గా రిజిస్టర్ చేసుకున్నట్లు తెలిసింది. చాలామంది ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే ర్యాలీకి గైర్హాజరయ్యారు.

రాష్ట్రాల వారీగా సస్పెన్షన్లు..

ర్యాలీకి హాజరుకాని వారిపై చేపట్టిన చర్యల్లో భాగంగా మధ్యప్రదేశ్‌లో 60 మంది, గుజరాత్‌లో 49, పశ్చిమ బెంగాల్‌లో 26, తెలంగాణలో 14, ఉత్తరప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్‌లలో చెరో 13, హర్యానాలో 10 మందిని సస్పెండ్ చేశారు. ఈ సంఖ్య 500 వరకు పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

సమర్థించుకున్న యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు

ఈ సస్పెన్షన్లపై యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఉదయ్ భాను చిబ్ స్పందించారు. పార్టీలో జవాబుదారీతనాన్ని పెంచేందుకే ఈ చర్యలు తీసుకున్నామని సమర్థించుకున్నారు. చురుగ్గా పనిచేసే కార్యకర్తలకు బాధ్యతలు అప్పగించేందుకు ఇది దోహదపడుతుందని, భవిష్యత్తులో జరిగే కార్యక్రమాలకు హాజరు శాతం పెంచడమే తమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. మరోవైపు, ర్యాలీకి హాజరైన వారి సంఖ్యపై బీజేపీ నేతలు విమర్శలు గుప్పించారు. మైదానంలో చాలా ప్రదేశాలు ఖాళీగా ఉన్నాయని ఎద్దేవా చేశారు. ఏదేమైనా, ఒకే ఒక్క కార్యక్రమానికి హాజరుకాలేదని ఏళ్ల తరబడి చేసిన సేవలను, త్యాగాలను విస్మరించడం ఎంతవరకు సమంజసమని సస్పెన్షన్‌కు గురైన నేతలు ప్రశ్నిస్తున్నారు.

అదుపులోకి తీసుకున్నప్పటి నుంచే 24 గంటల లెక్క.. అరెస్ట్ పై పోలీసులకు సుప్రీంకోర్టు



అరెస్టు చేసిన వ్యక్తిని 24 గంటల్లోగా మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచాలన్న రాజ్యాంగ నిబంధనపై సుప్రీంకోర్టు కీలక వివరణ ఇచ్చింది. పోలీసులు అధికారికంగా అరెస్టు నమోదు చేసిన సమయం నుంచి కాకుండా.. వాస్తవంగా నిర్బంధించిన క్షణం నుంచే లెక్కించాలని స్పష్టం చేసింది. ఒక వ్యక్తి స్వేచ్ఛకు భంగం కలిగించి అదుపులోకి తీసుకున్న సమయమే ఈ గడువుకు ప్రాతిపదిక అని తేల్చిచెప్పింది.త్రిపురలో ఎన్‌డీపీఎస్ చట్టం కింద నమోదైన కేసులో బెయిల్ నిరాకరిస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ నలుగురు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ కీలక తీర్పు వెలువరించింది. జస్టిస్ ఉజ్జల్ భుయాన్, జస్టిస్ అతుల్ ఎస్. చందుర్కర్‌లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు స్పష్టత ఇచ్చింది.రాజ్యాంగంలోని ఆర్టికల్ 22(2) ప్రకారం అరెస్టయిన వ్యక్తిని ప్రయాణానికి అవసరమైన సమయాన్ని మినహాయించి 24 గంటల్లోగా సమీప మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచాలి. మేజిస్ట్రేట్ అనుమతి లేకుండా అంతకుమించి నిర్బంధంలో ఉంచడానికి వీల్లేదు.సోదాలు, స్వాధీనం ప్రక్రియ పూర్తయ్యాక పోలీసులు అధికారికంగా అరెస్టు నమోదు చేసినప్పటి నుంచే 24 గంటల గడువు ప్రారంభమవుతుందని భావించడం చట్టవిరుద్ధమే కాకుండా రాజ్యాంగ విరుద్ధమని ధర్మాసనం వ్యాఖ్యానించింది.వాస్తవంగా నిర్బంధించిన సమయం నుంచి 24 గంటలు దాటినా మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచకపోతే సంబంధిత వ్యక్తిని వెంటనే విడుదల చేయాలని సుప్రీంకోర్టు పేర్కొంది. ఈ గడువును లెక్కించేటప్పుడు అరెస్టు చేసిన ప్రాంతం నుంచి మేజిస్ట్రేట్ కోర్టుకు చేరుకోవడానికి పట్టే ప్రయాణ సమయాన్ని మాత్రమే మినహాయించాలని స్పష్టం చేసింది.అంతేకాదు, 24 గంటల్లోగా కోర్టు ఎదుట హాజరుపరిచినంత మాత్రాన నిర్బంధం చట్టబద్ధమైనట్లు కాదని ధర్మాసనం తెలిపింది. భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్)లోని సెక్షన్ 58 ప్రకారం.. కేసు పరిస్థితులకు అనుగుణంగా నిర్బంధ సమయం సహేతుకంగా ఉండేలా దర్యాప్తు సంస్థలు చూసుకోవాలని పేర్కొంది.నిందితుడిని తమ ఎదుట హాజరుపరిచినప్పుడు అతడి స్వేచ్ఛకు భంగం కలిగించిన అసలు తేదీ, సమయాన్ని మేజిస్ట్రేట్ నమోదు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. రాజ్యాంగం నిర్దేశించిన 24 గంటల గడువు పాటించారా? లేదా? అన్నది స్వతంత్రంగా పరిశీలించాలని సూచించింది. నిర్బంధం సహేతుకమైన సమయాన్ని మించిందని భావిస్తే తదుపరి రిమాండ్‌కు అనుమతి నిరాకరించే అధికారం మేజిస్ట్రేట్‌కు ఉంటుందని స్పష్టం చేసింది.

కనిపించకుండా పోయిన చిలుక ఆచూకీ చెప్పండి..లక్ష రివార్డ్ పొందండి



వడోదరలో ఓ కుటుంబం తమ ఇంట్లో పెంచుకుంటున్న చిలుక కోసం తీవ్రంగా ఆందోళన చెందుతోంది. బిడ్డలా చూసుకుంటున్న 'లడ్డూ' అనే ఆరు నెలల ఆఫ్రికన్ గ్రే జాతి చిలుక కనిపించకుండా పోవడంతో, దానిని వెతికి పట్టుకొచ్చిన వారికి ఏకంగా రూ. 1 లక్ష బహుమతిగా ఇస్తామని ప్రకటించింది.పారిఖ్ కుటుంబం తెలిపిన వివరాల ప్రకారం, అక్టోబర్ 31వ తేదీ సాయంత్రం 7 గంటల సమయంలో లడ్డూ, తన పంజరం తలుపును అదే తెరుచుకుని బయటకు ఎగిరిపోయింది. అప్పటి నుంచి దాని కోసం తీవ్రంగా గాలిస్తున్నారు. పుణేలోని ఓ బ్రీడర్ నుంచి తెచ్చుకున్న ఈ చిలుకకు దానంతట అదే ఆహారం తినడం రాదని, అందుకే తాము మరింత ఆందోళన చెందుతున్నామని దానిని పెంచుకుంటున్న జ్షిక్షా పారిఖ్ తెలిపారు.లడ్డూ కోసం సేవాసి, గోత్రి, భయ్లీ వంటి ప్రాంతాల్లో వెతికారు. తమ వాయిస్‌ను రికార్డ్ చేసి ప్లే చేయడం, ఈలలు వేయడం వంటి ప్రయత్నాలు చేసినా ఫలితం లేకపోయింది. దాని కాలికి లైసెన్స్ నంబర్‌తో కూడిన రింగ్ ఉందని, బహుశా అది ఏదైనా నిర్మానుష్య ప్రదేశంలో లేదా నది సమీపంలో ఉండవచ్చని కుటుంబ సభ్యులు భావిస్తున్నారు. ఆఫ్రికన్ గ్రే జాతి చిలుకలు తమ యజమానులతో చాలా బలమైన బంధాన్ని ఏర్పరుచుకుంటాయని చెబుతారు. ఇప్పుడు తమ లడ్డూ తిరిగి రావాలని ఆ కుటుంబం ఆశగా ఎదురుచూస్తోంది.

తిరుమల లడ్డూ కేసు విచారణ ఏపీలోనే.. బదిలీ పిటిషన్ కొట్టివేసిన సుప్రీంకోర్టు

తిరుమల లడ్డూ కల్తీ నెయ్యి కేసుకు సంబంధించిన విచారణను ఆంధ్రప్రదేశ్ వెలుపలకు బదిలీ చేసేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఈ కేసు విచారణను మరో రాష్ట్రానికి మార్చాలని నిందితుల్లో ఒకరు దాఖలు చేసిన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం ఈరోజు కొట్టివేసింది. ప్రస్తుత దశలో కేసును బదిలీ చేయాల్సినంత బలమైన కారణాలు కనిపించడం లేదని స్పష్టం చేసింది.ఈ కేసులో నిందితుడిగా ఉన్న మహారాష్ట్రకు చెందిన వ్యాపారవేత్త, మాల్గంగా మిల్క్ అండ్ అగ్రో ప్రొడక్ట్స్ ఎండీ మచీంద్ర శాంతారాం లంకే ఈ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. ఏపీలో ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి ఈ కేసుపై రాజకీయ వ్యాఖ్యలు చేస్తున్నారని, దీనివల్ల నిష్పక్షపాత విచారణకు ప్రతికూల వాతావరణం ఉందని పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ దవే కోర్టుకు తెలిపారు.దీనిపై స్పందించిన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్... "మా ఆదేశాలతో వారందరినీ మౌనంగా ఉండేలా చేశాం. ఏదైనా జరిగితే మీరు మా వద్దకు రావచ్చు" అని వ్యాఖ్యానించారు. తాము గతంలో ఆదేశాలు ఇచ్చిన తర్వాత కూడా రాజకీయ నేతలు వ్యాఖ్యలు చేశారా? అని ధర్మాసనం ప్రశ్నించింది. కేసు బదిలీకి తగిన కారణాలు లేవని పేర్కొంటూ, పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు ధర్మాసనం ప్రకటించింది. దీంతో ఈ కేసు విచారణ ఇకపై ఆంధ్రప్రదేశ్‌లోనే కొనసాగనుంది.

గంటల వ్యవధిలో రెండు ప్రమాదాలు.. తృటిలో బయటపడ్డ ఎమ్మెల్యే వీరేశం

తెలంగాణ ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఒకే రోజు గంటల వ్యవధిలో రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల నుంచి తృటిలో సురక్షితంగా బయటపడ్డారు. నల్గొండ జిల్లాలో గురువారం ఈ సంఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ ప్రమాదాల్లో ఆయన ప్రయాణిస్తున్న రెండు కార్లు పాక్షికంగా దెబ్బతిన్నప్పటికీ, ఆయనకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో కాంగ్రెస్ శ్రేణులు, ఆయన అనుచరులు ఊపిరి పీల్చుకున్నారు.వివరాల్లోకి వెళితే.. ఎమ్మెల్యే వీరేశం గురువారం నకిరేకల్ నుంచి చిట్యాల మండలం చినకాపరిపై తన ఫార్చ్యూనర్ వాహనంలో బయలుదేరారు. కట్టంగూరు మండలం చెర్వు అన్నారం స్టేజీ వద్ద జాతీయ రహదారిపై వెళుతుండగా, వెనుక నుంచి వేగంగా వచ్చిన ఒక కార్నివాల్ కారు ఆయన వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ తాకిడికి ఎమ్మెల్యే కారు ముందు వెళుతున్న ఎస్కార్ట్ వాహనాన్ని ఢీకొంది. ప్రమాద తీవ్రతకు కారు పాక్షికంగా దెబ్బతిన్నప్పటికీ, ఎయిర్‌బ్యాగ్‌లు వెంటనే తెరుచుకోవడంతో వీరేశం సురక్షితంగా బయటపడ్డారు.ఈ ఘటన జరిగిన వెంటనే భద్రతా సిబ్బంది అప్రమత్తమై, ఎమ్మెల్యేను మరో ఇన్నోవా క్రిస్టా కారులోకి మార్చి గమ్యస్థానానికి పంపించారు. అయితే, కొద్దిసేపటికే ఆ ప్రత్యామ్నాయ వాహనం కూడా ప్రమాదానికి గురైంది. చిట్యాల నుంచి తుంగతుర్తి వైపు వెళుతుండగా, ఒక లారీ వీరి కారును ఢీకొట్టింది. అదృష్టవశాత్తూ, ఈ రెండో ప్రమాదం నుంచి కూడా వీరేశం ఎలాంటి అపాయం లేకుండా బయటపడ్డారు.వరుస ప్రమాదాల తర్వాత కూడా ఎమ్మెల్యే వీరేశం తన పర్యటనను కొనసాగిస్తూ జనగామకు వెళ్లారు. ఒకే రోజు రెండుసార్లు ప్రమాద గండం నుంచి తమ నేత క్షేమంగా బయటపడటంతో కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు.

రూ.1020 కోట్ల కొకైన్ స్మగ్లింగ్‌యత్నం..టీ కోసం లారీ డ్రైవర్ ఆగడంతో బయటపడ్డ కుట్ర



యునైటెడ్ కింగ్‌డమ్‌లో (యూకే) సుమారు 80 మిలియన్ పౌండ్ల (దాదాపు రూ. 1,020 కోట్లు) విలువైన కొకైన్‌ను అక్రమంగా రవాణా చేసేందుకు ప్రయత్నించిన కేసులో ముగ్గురు వ్యక్తులకు అక్కడి కోర్టు 47 ఏళ్లకు పైగా జైలు శిక్ష విధించింది. మెట్రోపాలిటన్ పోలీసులు సుదీర్ఘకాలం పాటు దర్యాప్తు చేసి ఈ భారీ డ్రగ్స్ రాకెట్ గుట్టురట్టు చేశారు. ఒక సాధారణ దొంగతనం ఫిర్యాదుతో మొదలైన ఈ కేసు, అంతర్జాతీయ డ్రగ్స్ ముఠాను పట్టించే వరకు వెళ్లడం గమనార్హం.వివరాల్లోకి వెళితే.. 2021 నవంబర్ 26న నార్తాంప్టన్‌షైర్‌లోని లిల్లిపుట్ రోడ్డు వద్ద ఒక హెచ్‌జీవీ లారీ డ్రైవర్ తన కంటైనర్‌ను ఎవరో పగలగొట్టి కొన్ని వస్తువులు దొంగిలించారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే, విచారణ ప్రారంభించిన పోలీసులకు ఇది సాధారణ దొంగతనం కాదని, దీని వెనుక పెద్ద డ్రగ్స్ కుట్ర ఉందని తేలింది. మెక్సికో నుంచి సెప్టెంబర్ 30న బయలుదేరిన ఈ షిప్పింగ్ కంటైనర్‌లో స్టీల్ ఫర్నిచర్ విడిభాగాలు ఉన్నట్లు రికార్డుల్లో ఉంది.బ్రిటన్‌కు చేరుకున్న తర్వాత లారీ డ్రైవర్ రోడ్డు పక్కన ఉన్న బర్గర్ వ్యాన్ వద్ద టీ తాగేందుకు ఆగారు. అదే సమయంలో లారీ వెనుక ఒక గ్రే కలర్ వ్యాన్ ఆగడాన్ని స్థానికులు గమనించారు. అందులో నుంచి దిగిన కొందరు వ్యక్తులు, లారీ వెనుక భాగం నుంచి పెద్ద ప్యాకేజీలను తమ వ్యాన్‌లోకి ఎక్కించుకుని అక్కడి నుంచి పరారయ్యారు. దీంతో పోలీసులు రంగంలోకి దిగి దర్యాప్తు చేపట్టారు. ఆ ప్రాంతంలో జరిపిన సోదాల్లో 18 పెద్ద బ్యాగుల్లో దాచిన 780 కిలోల కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ అంతర్జాతీయ మార్కెట్లో 80 మిలియన్ పౌండ్లకు పైగా ఉంటుందని అంచనా వేశారు.కేసు తీవ్రత దృష్ట్యా దీనిని మెట్రోపాలిటన్ పోలీసులకు అప్పగించారు. ప్రత్యేక బృందాలు రెండేళ్ల పాటు దేశవ్యాప్తంగా దర్యాప్తు చేసి, ఈ నెట్‌వర్క్ కదలికలను ట్రాక్ చేసి, నిందితులకు వ్యతిరేకంగా పక్కా ఆధారాలు సేకరించాయి. ఈ దర్యాప్తునకు నాయకత్వం వహించిన డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ డీన్ గ్రాఫ్టన్ మాట్లాడుతూ.. "ఇది అత్యంత వ్యవస్థీకృత ముఠా పని. యూకే వ్యాప్తంగా కొకైన్ అమ్మి మిలియన్ల కొద్దీ పౌండ్లు సంపాదించాలని నిందితులు ప్లాన్ చేశారు. రెండేళ్ల పాటు క్షుణ్ణంగా దర్యాప్తు చేసి ఈ ముఠా గుట్టు రట్టు చేశాం" అని తెలిపారు.

సిద్దిపేటలో ఘోరం..నీళ్లు కావాలి అని నమ్మించి.. వృద్ధురాలిపై కత్తితో బెదిరింపు



ఒంటరిగా ఉండే వృద్ధులే లక్ష్యంగా దొంగలు సరికొత్త పంథాలో రెచ్చిపోతున్నారు. నమ్మించి మోసం చేయడం ఒకమైతే, ఎదురుతిరిగిన వృద్ధురాలిని ప్రాణాలతో చంపేస్తామని కత్తితో బెదిరించి ఆరు తులాల బంగారాన్ని దోచుకెళ్లాడు ఒక దుండగుడు.. పోలీసులు, బాధితుల కథనం ప్రకారం.. సిద్దిపేట పట్టణంలోని పాత చేపల మార్కెట్ ప్రాంతానికి చెందిన కళ్యకుంట్ల పెంటమ్మ అనే వృద్ధురాలు బుధవారం సాయంత్రం ఇంట్లో ఒంటరిగా ఉన్నారు.ఆ సమయంలో ముఖానికి మాస్క్ ధరించిన ఒక గుర్తుతెలియని వ్యక్తి ఆమె ఇంటి వద్దకు వచ్చాడు..మీ అబ్బాయి ఉన్నాడా? కొంచెం పని ఉంది అంటూ చాలా మర్యాదగా మాటలు కలిపాడు. ఇంట్లో ఎవరూ లేరని, బయటకు వెళ్లారని పెంటమ్మ అమాయకంగా సమాధానం ఇచ్చింది..ఇంట్లో వృద్ధురాలు ఒంటరిగా ఉందనే విషయాన్ని నిర్ధారించుకున్న ఆ దుండగుడు తన అసలు ప్లాన్ అమలు చేశాడు..అమ్మా.. చాలా దాహంగా ఉంది, కొంచెం మంచి నీళ్లు ఇస్తారా? అని అడిగాడు. మానవత్వంతో పెంటమ్మ లోపలికి వెళ్లి నీళ్లు తెచ్చి ఇచ్చింది. అంతటితో ఆగని ఆ కిరాతకుడు,

మరోసారి నీళ్లు కావాలని కోరాడు. ఆమె మళ్లీ నీళ్ల కోసం లోపలికి వెళ్లే లోపు.. వెనుక నుంచి బలవంతంగా ఇంట్లోకి చొరబడ్డాడు..ఇంట్లోకి ప్రవేశించిన వెంటనే ఆ వ్యక్తి పెంటమ్మ మెడలో ఉన్న ఆరు తులాల రెండు వరుసల బంగారు పుస్తెలతాడును బలంగా లాగాడు.అయితే, ఊహించని ఈ ప్రమాదం నుంచి తేరుకున్న పెంటమ్మ ధైర్యంగా దొంగను నిలదీసింది. తన పుస్తెలతాడును దక్కించుకోవ డానికి అతనితో గట్టిగా పెనుగులాడింది. వృద్ధురాలు గట్టిగా అరిస్తే చుట్టుపక్కల వారు వస్తారనే భయంతో దుండగుడు..నా జేబులో కత్తి ఉంది.. గట్టిగా అరిచావో ప్రాణాలు తీసేస్తా అంటూ తీవ్రంగా బెదిరించాడు.ఆపై పెంటమ్మను ఇంట్లోనే బంధించి, బయట నుంచి తలుపునకు గొళ్లెం పెట్టి క్షణాల్లో అక్కడ నుంచి పరారయ్యాడు. కాసేపటికి తేరుకున్న వృద్ధురాలు ఇంటి వెనుక తలుపు ద్వారా ఎలాగోలా బయటకు వచ్చి, ఇరుగుపొరుగు వారికి జరిగిందంతా వివరించింది.బాధితురాలి ఫిర్యాదు మేరకు సిద్దిపేట వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.నిందితుడిని పట్టుకునేందుకు పోలీసులు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. స్థానిక పాత చేపల మార్కెట్ పరిసర ప్రాంతాల్లో ఉన్న సీసీటీవీ (జజుఒ) కెమెరాల ఫుటేజీలను పోలీసులు జల్లెడ పడుతున్నారు. మాస్క్ ధరించిన ఆ వ్యక్తి కదలికలను గుర్తించేందుకు సాంకేతిక ఆధారాలను సేకరిస్తున్నారు.

ఫోర్జరీ పత్రాలతో విలువైన భూమిపై కన్ను.. లేడీ డాన్ కోనేటి సులోచన అరెస్ట్..



ఫోర్జరీ పత్రాలు, నకిలీ రికార్డులతో విలువైన స్థలాలను ఆక్రమిస్తూ బెదిరింపులకు పాల్పడుతున్న మదనపల్లెకు చెందిన లేడీ డాన్, రౌడీషీటర్ కోనేటి సులోచనతో పాటు ఆమె ప్రధాన అనుచరులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ అక్రమ భూ ఆక్రమణ వ్యవహారంలో పీటీ వారెంట్‌పై సులోచన సహా ముగ్గురిని స్వాధీనంలోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు మదనపల్లె టూటౌన్ ఎస్ఐ నాగేశ్వర్‌రావు వెల్లడించారు. ఈ మేరకు ఎస్ఐ నాగేశ్వర్‌రావు పలు కీలక వివరాలను వెల్లడించారు.

కేసు వివరాలు:

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మదనపల్లెకు చెందిన మార్వూరి శ్రీరామ్‌కు చెందిన భూమిని, అతని పెద్దనాన్న కుమారుడు మార్వూరి వెంకటేష్ 2023లోనే రాసిచ్చినట్లు నకిలీ పత్రాలు సృష్టించారు.

ఆ తర్వాత మైసూర్ కడప జిల్లా పులివెందుల సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంలో ఈ నకిలీ పత్రాలతో అక్రమంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. అనంతరం సదరు భూమిలోకి అక్రమంగా ప్రవేశించి, అక్కడ ఉన్న ఆస్తులను ధ్వంసం చేసి భూమిని తమ ఆధీనంలోకి తీసుకున్నారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసిన పోలీసులు, ఇప్పటికే వివిధ కేసుల్లో మదనపల్లె సబ్‌జైలులో ఉన్న నిందితులపై పీటీ వారెంట్ జారీ చేశారు. కోనేటి సులోచన, ఆమె అనుచరుడైన గుండిగల మోహన్, రెడ్డెప్పనాయుడు కాలనీకి చెందిన రియల్టర్ కడియాల శ్రీరాములు నాయుడులను పీటీ వారెంట్‌పై అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండుకు తరలించారు.

ఈ భూ ఆక్రమణ కేసులో ప్రమేయం ఉన్న మరో ఎనిమిది మంది పరారీలో ఉన్నారని, వారిని కూడా త్వరలోనే అరెస్టు చేస్తామని ఎస్ఐ తెలిపారు.కాగా, ఈ కేసులో ప్రధాన నిందితులైన కోనేటి సులోచన, కడియాల శ్రీరాములునాయుడులపై ఇప్పటికే పలు క్రిమినల్, భూ ఆక్రమణ కేసులు నమోదయ్యాయి.. అంతకుముందు కూడా సులోచన జైలుకెళ్లినట్లు పేర్కొంటున్నారు.

తిరుమలలో భక్తుల రద్దీ అంతంత మాత్రమే.. రీజన్ ఇదే

తిరుమలలో భక్తుల రద్దీ తక్కువగానే ఉంది. గత కొన్ని రోజులుగా భక్తుల రద్దీ పెద్దగా లేదు. అనేక కారణాలతో భక్తులు తిరుమలకు రాక తగ్గింది. వరస తుపానులు రావడంతో పాటు ఆంధ్రప్రదేశ్ లో ఎన్నికలు జరుగుతుండటంతో తిరుమలకు భక్తుల రద్దీ తక్కువగానే ఉందని టీటీడీ అధికారులు అంచనా వేస్తున్నారు. సాధారణంగా శుక్రవారం భక్తుల రద్దీ పెరుగుతుంది. కానీ నేడు సాధారణంగానే ఉండటంతో తుపాను, ఎన్నికల ప్రభావమే ప్రధాన కారణాలు కావచ్చని అభిప్రాయం వ్యక్తమవుతుంది. అయితే మధ్యాహ్నానికి భక్తుల రద్దీ పెరిగే అవకాశముందని తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు అంచనా వేస్తున్నారు

దీపావళి సందర్భంగా...

ఈనెల 8వ తేదీన తిరుమలలో దీపావళి ఆస్థానం నిర్వహిస్తున్నారు. దీపావళి ఆస్థానంతో ఆర్జిత సేవలను టీటీడీ రద్దు చేసింది. ఈనెల 15న పుష్పయాగానికి అంకురార్పణ చేయనున్నారు. 16న పుష్పయాగం జరగనుంది. స్వామి వారికి ఏడు టన్నుల పుష్పాలతో స్వామివారికి పుష్పార్చన జరుగుతోంది. ఈ సందర్భంగా 16వ తేదీన శ్రీవారి ఆలయంలో ఆర్జిత సేవలు రద్దు చేసిన టీటీడీ, డిసెంబర్ 20 నుంచి 29వ తేదీ వరకు శ్రీవారి ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనాలు నిర్వహించాలని నిర్ణయించారు. మొదటి మూడు రోజులు ఈ-డిప్



విధానంలో దర్శన టోకెన్లు కేటాయిస్తారు. మిగిలిన ఏడు రోజులు సర్వదర్శనం భక్తులను దర్శనానికి అనుమతించనున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు తెలిపారు.

పదకొండు కంపార్ట్ మెంట్లలో...

ఈరోజు తిరుమలలోని వైకుంఠం క్యూ కాంప్లెక్స్ లోని పదకొండు కంపార్ట్ మెంట్లలో భక్తులు శ్రీవారి దర్శనం కోసం వేచి ఉన్నారు. సర్వ దర్శనం క్యూ లైన్ లోకి ఉదయం టోకెన్లు లేకుండా ప్రవేశించిన భక్తులకు శ్రీవారి దర్శనం ఆరు నుంచి ఎనిమిది గంటల సమయం పడుతుందని తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు తెలిపారు. శీఘ్రదర్శనం టోకెన్లున్న భక్తులకు రెండు నుంచి మూడు గంటల సమయం పడుతుంది. నిన్న తిరుమల శ్రీవారిని 65,218 మంది భక్తుల దర్శించుకోనున్నారు. నిన్న తిరుమల శ్రీవారికి 20,213 మంది భక్తులు తమ తలనీలాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. నిన్న శ్రీవారి హుండీ ఆదాయం 3.63 కోట్లు వచ్చిందని అధికారులు తెలిపారు. నిన్న శ్రీవారి లడ్డూ ప్రసాదం విక్రయాలు 3.94 లక్షల వరకూ జరిగాయని అధికారులు తెలిపారు.

PRINTED, PUBLISHED AND OWNED BY K.B.G.TILAK, PRINTED AT LAKSHMI OFFSET PRINTERS, CHUTTUGUNTA, VIJAYAWADA, AND PUBLISHED FROM VIJAYAWADA, D.NO.28-1-22, II FLOOR, SHAIK MOHIUDDEEN STREET, ARUNDELPET, VIJAYAWADA-520 002. EDITOR : K.B.G.TILAK. PH : 0866 - 6620870. R.N.I.NO.APTEL/1999/1614

అయ్యప్ప సొసైటీపై సర్వే చేయాలి: రేవంత్ సర్కారుకు కవిత నెల రోజుల డెడ్‌లైన్



హైదరాబాద్‌లోని ఖానామెట్ అయ్యప్ప సొసైటీలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై సమగ్ర సర్వే నిర్వహించాలని టీఆర్ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఇందుకోసం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి నెల రోజుల గడువు ఇస్తున్నామని, లేదంటే తమ పార్టీ కార్యకర్తలే అక్రమ కట్టడాలకు 'రెడ్ మార్క్' వేస్తారని హెచ్చరించారు. హైదరాబాద్ లో మీడియాతో మాట్లాడుతూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అయ్యప్ప సొసైటీలో సుమారు 750 అక్రమ నిర్మాణాలు జరిగాయని కవిత ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరులే దగ్గరుండి పర్మిషన్లు ఇప్పించి డబ్బులు దండుకుంటున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. భూములు, టీడీఆర్ అక్రమ దందాలు తప్ప సీఎం రేవంత్‌కు మరేమీ కనిపించడం లేదని ఆమె విమర్శించారు. ఈ వ్యవహారంలో సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు.అయ్యప్ప సొసైటీలో రిజిస్ట్రేషన్లు జరగవని, అక్కడ ఇళ్లు కొనుగోలు చేసి ప్రజలు నష్టపోవద్దని కవిత సూచించారు. గురుకుల ట్రస్ట్ భూములపై గతంలో తాము ఎన్నో ఉద్యమాలు చేశామని గుర్తుచేశారు. ఇదే సొసైటీలో నారాయణ, చైతన్య వంటి విద్యాసంస్థలు కూడా ఉన్నాయని ఆమె తెలిపారు. కేంద్ర మంత్రి అమిత్ షా హైదరాబాద్ పర్యటనపైనా కవిత స్పందిస్తూ, ఆయన కేవలం రాజకీయాలు మాట్లాడి వెళ్లారని, రాష్ట్రంలోని కరవు పరిస్థితులపై స్పందించలేదని విమర్శించారు.

బీసీసంఘాలకు రేవంత్‌సర్కార్ గుడ్ న్యూస్ ఆత్మగౌరవ భవనాలకు భారీగా నిధులు



వెనుకబడిన తరగతుల (బీసీ) సంక్షేమం దిశగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్‌లో 38 బీసీ కుల సంఘాల కోసం 'ఆత్మగౌరవ భవనాల' నిర్మాణానికి రూ. 88.50 కోట్లు మంజూరు చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వివిధ కుల సంఘాల ప్రతినిధులకు ప్రభుత్వ ఉత్తర్వుల (జీవో) పత్రాలను అందజేశారు. అన్ని కులాల సామాజిక, సాంస్కృతిక, విద్యాభివృద్ధి లక్ష్యంగా ఈ భవనాల నిర్మాణాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందని ఆయన తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు, ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క సూచనల మేరకు బీసీ ఆత్మగౌరవ భవనాల నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేస్తున్నట్లు వివరించారు. గతంలో భూములు కేటాయించినప్పటికీ, కొన్ని పరిపాలనా, సాంకేతిక కారణాల వల్ల నిర్మాణాలు ముందుకు సాగలేదని గుర్తుచేశారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) సహకారంతో ఇప్పుడు ఆ అడ్డంకులన్నీ తొలగిపోయాయని చెప్పారు. స్థలాలను 'రెడీ-టు-కన్‌స్ట్రక్ట్' పద్ధతిలో లేఅవుట్లతో అభివృద్ధి చేశామని, ప్రభుత్వం నిధులు కూడా మంజూరు చేసినందున కుల సంఘాలు తక్షణమే నిర్మాణ పనులు ప్రారంభించాలని సూచించారు.సంవత్సరంలోగా ఈ భవనాల నిర్మాణాలు పూర్తి చేసి బీసీ ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే తమ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. నిర్మాణాలకు అవసరమైన అన్ని అనుమతులను ఇంజనీరింగ్ విభాగం, హెచ్ఎండీఏ సమన్వయంతో 'సింగిల్ విండో' విధానంలో జాప్యం లేకుండా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. నిర్మాణాల పురోగతిపై బీసీ సంక్షేమ శాఖ ప్రతినెలా సమీక్ష నిర్వహిస్తుందని తెలిపారు.బీసీ కుల సంఘాలకు కేటాయించిన ప్లాట్లను ప్రభుత్వం వెనక్కి తీసుకుంటుందంటూ వస్తున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని పొన్నం ప్రభాకర్ తేల్చిచెప్పారు. ఈ భూములు బలహీన వర్గాల ఆస్తులని, వాటిని ఏ ప్రభుత్వం వెనక్కి తీసుకోదని భరోసా ఇచ్చారు. కేటాయించిన నిధులతో నిర్దిష్ట సమయంలోగా భవనాలను పూర్తి చేయాల్సిన బాధ్యత ఆయా సంఘాలపై ఉందని, జాప్యం జరిగితే సంఘాల ప్రతినిధులనే జవాబుదారీ చేస్తామని హెచ్చరించారు.అన్ని బీసీ కుల సంఘాలు సహవేశాలు, జయంతులు, ఇతర సామాజిక కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు వీలుగా హైదరాబాద్‌లో ఐదు ఎకరాల స్థలంలో ఒక సమగ్ర 'బీసీ భవన్' నిర్మించాలనే ప్రతిపాదనను కూడా మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రస్తావించారు.

'ఆర్ఆర్ ట్యాక్స్' నిజమే అయితే చర్యలేవి? మోదీ, షాలకు కేటీఆర్ ప్రశ్న



తెలంగాణ రాజకీయాల్లో 'ఆర్ఆర్ ట్యాక్స్' వ్యవహారాన్ని మరోసారి తెరపైకి తెచ్చారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. ఈ అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేపీ అగ్రనేతలు ఆరోపణలు చేస్తున్నారే తప్ప చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలను ప్రశ్నించారు. హైదరాబాద్‌కు వచ్చిన ప్రతిసారీ విమర్శలు చేయడం మినహా కేంద్రం చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు.తన ఎక్స్ పోస్టులో కేటీఆర్ ఈ అంశాన్ని ప్రస్తావించారు. హైదరాబాద్‌లో ఏ బిల్డర్‌ను, డెవలపర్‌ను అడిగినా 'ఆర్ఆర్ ట్యాక్స్' వసూళ్ల గురించి చెబుతారని పేర్కొన్నారు. చదరపు అడుగుకు రూ.200 చొప్పున వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు నిజం కాదా? అని ప్రశ్నించారు. రియల్ ఎస్టేట్ రంగంలో ఈ విషయం అందరికీ తెలిసినప్పుడు కేంద్రంలోని బీజేపీ పెద్దలకు తెలియదా అని నిలదీశారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాహుల్ గాంధీ కలిసి 'ఆర్ఆర్ ట్యాక్స్' పేరుతో కోట్ల రూపాయలు దోచుకుంటున్నారని ప్రధాని మోదీ, అమిత్ షా ఆరోపిస్తున్నారని కేటీఆర్ అన్నారు. అలాంటప్పుడు ఆ వసూళ్లను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. హైదరాబాద్‌కు తరచూ వస్తున్న మోదీ, అమిత్ షాలు ఈ అంశంపై బహిరంగంగా విమర్శలు చేయడం తప్ప, తదుపరి చర్యలు తీసుకోవడం లేదని వ్యాఖ్యానించారు.ఆర్ఆర్ ట్యాక్స్ వ్యవహారంలో బీజేపీ, కాంగ్రెస్ మధ్య అంతర్గత అవగాహన ఉందని కేటీఆర్ ఆరోపించారు. అందుకే కేంద్ర ప్రభుత్వం ఈ అంశంపై చర్యలకు ముందుకు రావడం లేదని విమర్శించారు. ఆరోపణలు చేయడం, రాజకీయంగా విమర్శలు గుప్పించడం తప్ప ఆ వసూళ్లపై విచారణ జరిపించేందుకు బీజేపీ నేతలు చొరవ చూపడం లేదని అన్నారు.'ఆర్ఆర్ ట్యాక్స్' అంశంపై ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన సభలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. ఈ ఆరోపణలను తెలంగాణ కాంగ్రెస్ నాయకత్వం ఖండించింది. దీంతో రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ మధ్య ఈ అంశం రాజకీయ విమర్శలకు కేంద్రంగా మారింది. అయితే చదరపు అడుగుకు రూ.200 వసూలు చేస్తున్నారన్న కేటీఆర్ ఆరోపణపై స్వతంత్రంగా నిర్ధారితమైన ఆధారాలు ఈ కథనంలో ప్రస్తావించలేదు.

కంట్రోల్ కష్టమైన టీపీసీసీ చీఫ్



తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీలో తీవ్ర అంతర్గత కలహాలు, క్రమశిక్షణా రాహిత్యం పరాకాష్టకు చేరాయి. ప్రభుత్వం ఏర్పాటై మూడేళ్లు గడుస్తున్నా, పార్టీ యంత్రాంగాన్ని ఏకతాటిపై నడిపించడంలో పీసీసీ (గ్రాజ) పూర్తిగా విఫలమవుతోంది. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఎవరికి వారే యజమానులుగా వ్యవహరిస్తూ, బహిరంగంగా ఒకరిపై ఒకరు విమర్శలు గుప్పించుకుంటున్నా అడిగే నాథుడే కరువయ్యాడు.

కాంగ్రెస్ అంటేనే ప్రజాస్వామ్యం.. ఇక్కడ స్వేచ్ఛ ఎక్కువ అంటూ ప్రతి సందర్భంలోనూ సమర్థించుకునే ప్రయత్నం చేస్తున్నప్పటికీ, అసలు కాంగ్రెస్‌లో క్రమశిక్షణ అనే పదానికి అర్థమే లేకుండా పోతోందని సొంత పార్టీ శ్రేణులే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి.

ఏమీ చేయలేకపోతున్న పీసీసీ చీఫ్ మహేష్

పార్టీలో ఒకరి తర్వాత ఒకరు క్రమశిక్షణా రాహిత్యానికి పాల్పడుతున్నా వారిని సరైన దారిలో పెట్టలేకపోవడానికి పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ చేతకానితనమే ప్రధాన కారణమని గాంధీ భవన్ వర్గాల్లో గట్టిగా వినిపిస్తోంది. స్వతహాగా బలమైన ప్రజాదరణ లేని నాయకుడిగా ముద్రపడిన మహేష్ గౌడ్, కనీసం తనకు దక్కిన పిసిసి అధ్యక్ష పదవి ద్వారా వచ్చే పవర్స్‌ను కూడా ఉపయోగించలేకపోతున్నారు.

సీనియర్ నేతలు నిబంధనలు ఉల్లంఘిస్తున్నా, పబ్లిక్ వేదికలపై పార్టీ ప్రతిష్టను దిగజారుస్తున్నా కేవలం నోటీసులతో కాలయాపన చేయడం తప్ప, కఠినమైన చర్యలు తీసుకునే నైతిక ధైర్యం ఆయనలో కనిపించడం లేదు.

మహేష్ తీరుపై మరో వర్గం వ్యతిరేకత

పిసిసి చీఫ్ కనబరుస్తున్న ఈ బలహీనమైన వైఖరిపై పార్టీలోని ఒక బలమైన వర్గం తీవ్ర ఆగ్రహంతో రగిలిపోతోంది. డిసిసి అధ్యక్షుల ఎంపిక నుంచి ప్రభుత్వం-పార్టీ సమన్వయం వరకు ప్రతి విషయంలోనూ మహేష్ గౌడ్ దిగువ స్థాయి ఒత్తిళ్లకు లొంగిపోతున్నారని, అధిష్టానంతో ఉన్న సాన్నిహిత్యాన్ని కూడా పార్టీ ప్రయోజనాల కోసం ఉపయోగించలేకపోతున్నారని విమర్శిస్తున్నారు. ఒకవైపు బిఆర్ఎస్, బిజెపిలు క్షేత్రస్థాయిలో దూకుడు పెంచుతుంటే, పీసీసీ అధ్యక్షుడు మాత్రం పార్టీలోని వ్యతిరేకత స్వరాలను అదుపు చేయలేక చేతులెత్తేయడం ప్రభుత్వ ఇమేజ్‌పై కూడా తీవ్ర ప్రభావం చూపుతోంది.

పార్టీ నేతలు బహిరంగంగా మాట్లాడకుండా కూడా చేయలేరా?

సొంత నియోజకవర్గాల్లో నేతల ఆధిపత్య పోరు, మంత్రివర్గ సభ్యులు-ఎమ్మెల్యేల మధ్య ఘర్షణలు నిత్యకృత్యంగా మారినా పీసీసీ స్పందించకపోవడం రాబోయే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పెద్ద దెబ్బగా మారే ప్రమాదముంది. క్రమశిక్షణ విధింపులో జవాబుదారీతనం లేకపోతే ప్రజాస్వామ్యం అనే ముసుగులో పార్టీ కట్టుబాట్లు హుర్తిగా కూలిపోతాయని సీనియర్లు హెచ్చరిస్తున్నారు. ఇకనైనా పీసీసీ చీఫ్ తన శైలిని మార్చుకుని ఉక్కుపాదం మోపకపోతే, తెలంగాణ కాంగ్రెస్‌లో ఈ ఆధిపత్య పోరు కాస్తా నియంత్రించలేని దావానలంగా మారుతుందన్న ఆసంతృప్తి కనిపిస్తోంది.

కాంగ్రెస్ నేతలు ఇక మారరా? మళ్లీ అధికారం కలేనా?



కాంగ్రెస్ పార్టీది అధికారంలో ఉన్నా, లేకపోయినా ఒకటే తీరు. అంతర్గత కుమ్ములాటలు పార్టీ ప్రతిష్టను మరింత దిగజారుస్తున్నాయి. అధికారంలో ఉన్నామన్న స్పృహ కూడా నేతల్లో లేకపోవడం విచారకరం. మంత్రుల నుంచి ఎమ్మెల్యేలు, ఎంపీలు ఎవరూ దీనికి మినహాయింపు కాదు.తెలంగాణలో అధికార కాంగ్రెస్ పార్టీలో అంతర్గత కుమ్ములాటలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీల మధ్య విభేదాలు బహిరంగంగా రగులుతున్నాయి. ఎన్ని సార్లు క్రమశిక్షణ కమిటీ ముందుకు వచ్చినప్పటికీ ఫలితం మాత్రం లేదు. ఇంకా కుమ్ములాటలు, కొట్లాటలు, విమర్శలు, ప్రతి విమర్శలతో తమకు తామే పార్టీని నాశనం చేస్తున్నారు. కార్యకర్తల మనోభావాలను దెబ్బతీస్తూ పదవులను పొందిన వారే ఈ పనులకు పాల్పడుతుంటంతో హస్తం పార్టీని ఎవరూ రక్షించలేరన్నది అర్థమయింది. ప్రజలకు చికాకు కలిగించేలా వీరి పోకడలు నేటికీ కొనసాగుతున్నాయి.

ఢిల్లీలో హోటల్‌లో వివాదం...

ఢిల్లీలో జరిగిన 'ఓట్ చోరీ' ర్యాలీ సమయంలో మంత్రి కి, ఎమ్మెల్యే కు మధ్య ఒక ఫైవ్ స్టార్ హోటల్‌లో తీవ్ర వాగ్వాదం జరిగింది. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు తదితర పదవుల నియామకాల విషయంలో వీరిద్దరి మధ్య ఘర్షణ చోటుచేసుకుందని చెబుతన్నారు. దీంతో మంత్రిపై టీపీసీసీ నాయకత్వానికి, ఏఐసీసీకి ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం పీసీసీ పరిధిలో విచారణ జరుపుతున్నారు. ఈ వివాదం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పార్టీ పరువు బజారున పడినట్లయింది. గాంధీ భవన్ లో నేత అంటే ఓర్పు, సంయమనం పాటించాల్సిన సమయంలో కాంగ్రెస్ నేతలు కొట్లాటలకు దిగడమేంటన్న ప్రశ్న తలెత్తుతుంది. ఇది పార్టీకి ఇబ్బందికరంగా మారనుంది. పార్టీలో క్రమశిక్షణ లోపానికి ఈ ఘటన అద్దం పడుతుందన్నది పార్టీ నేతలే అంటున్నారు.

పెండింగ్ బిల్లుల కోసం...


జడ్చర్ల ఎమ్మెల్యే జె. అనిరుధ్ రెడ్డి పెండింగ్‌లో ఉన్న సుమారు రూ. 40 కోట్ల అభివృద్ధి బిల్లులు విడుదల కాకపోతే 30 వేల మందితో నిరాహార దీక్షకు దిగుతానని హెచ్చరించారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డితో పాటు మరికొందరు ఎమ్మెల్యేలు కూడా నిధుల కేటాయింపులు, టెండర్ల తీరుపై అసంతృప్తి వెళ్లగక్కారు. పెద్దపల్లి ఎంపీ వంశీ కృష్ణ ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాల్లో తనకు ప్రోటోకాల్ ఇవ్వడం లేదని, తనను పక్కన పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంథని నియోజకవర్గంలో గిరిజన మహిళా నేత సస్పెన్షన్‌పై ఆయన అభ్యంతరం తెలిపారు. దీనిపై టీపీసీసీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్ స్పందించి, పార్టీలోని ప్రతి ఒక్కరితో మాట్లాడి విభేదాలను సరిదిద్దుతామని తెలిపారు. మరోవైపు ఈ అంతర్గత కుమ్ములాటల వల్ల పరిపాలన గాడి తప్పుతోందని ప్రతిపక్షాలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శిస్తున్నాయి

2020 తర్వాత ఇదే అతిపెద్ద పతనం.. కుప్పకూలిన అమెరికా మార్కెట్లు

అమెరికా స్టాక్ మార్కెట్లలో భారీ పతనం నమోదైంది. కృత్రిమ మేధ (ఏఐ) రంగంపై పెట్టుబడులు, వాటి నుంచి ఆశించిన లాభాలపై అందోళనలు మదుపర్లను కలవరపెట్టాయి. దీంతో టెక్నాలజీ కంపెనీల షేర్లు కుప్పకూలాయి. ముఖ్యంగా నాస్‌డాక్ సూచీ భారీగా పడిపోయింది. 2020లో కరోనా సంక్షోభం తర్వాత ఇంతటి పతనం ఇదే తొలిసారి. అమెరికాలో నెలకొన్న ప్రభావం ఆసియా మార్కెట్లకూ పాకింది.గురువారం ట్రేడింగ్‌లో నాస్‌డాక్-100 సూచీ 6 శాతానికి పైగా పతనమైంది

ఎస్‌అండ్‌పీ 500 సూచీ 4.4 శాతం నష్టపోయింది. చిప్ కంపెనీల షేర్లను ప్రతిబింబించే ఫిలడెల్ఫియా సెమీకండక్టర్ సూచీ ఏకంగా 12 శాతం పడిపోయింది. డోజోన్స్‌లోని మొత్తం 30 కంపెనీల షేర్లు నష్టాలతో ముగిశాయి.ప్రపంచంలోనే అత్యంత విలువైన కంపెనీగా ఉన్న ఎన్విడియా షేరు 9 శాతానికి పైగా పడిపోయింది. దీంతో ఈ ఏడాది ఇప్పటివరకు ఆ కంపెనీకి వచ్చిన లాభాలన్నీ ఆవిరయ్యాయి. ఏఐ రంగంలో భారీ పెట్టుబడులు పెడుతున్న టెక్నాలజీ సంస్థల భవిష్యత్తుపై మదుపర్లు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. డేటా సెంటర్ల నిర్మాణానికి వందల బిలియన్ డాలర్లు ఖర్చు చేస్తున్నా.. ఆశించిన స్థాయిలో ఆదాయం వస్తుందా అన్నది ప్రశ్నార్థకంగా మారింది.అమెరికా మధ్యంతర ఎన్నికల్లో డెమోక్రాట్ల విజయం కూడా మార్కెట్లపై ప్రభావం చూపింది. డేటా సెంటర్ల నిర్మాణం, విద్యుత్ వినియోగంపై కొత్త ప్రభుత్వం కఠిన నిబంధనలు తీసుకురావచ్చని మదుపర్లు భావిస్తున్నారు. దీంతో ఏఐ రంగంలో పెట్టుబడుల వేగం తగ్గే అవకాశం ఉందన్న అందోళనలు పెరిగాయి.అమెరికా మార్కెట్ల పతనం ఆసియానూ తాకింది. దక్షిణ కొరియా కోస్పి సూచీ భారీగా పడిపోవడంతో ట్రేడింగ్‌ను తాత్కాలికంగా నిలిపివేశారు. జపాన్ నిక్కీ కూడా గణనీయంగా నష్టపోయింది. మరోవైపు మదుపర్లు సురక్షిత పెట్టుబడిగా భావించే అమెరికా ప్రభుత్వ బాండ్ల వైపు మొగ్గుచూపారు.

చికిత్స పేరుతో పిలిపించి చితక్కొట్టారు .... యువ వైద్యుడిని ట్రాప్ చేసిన మలయాళ నటి



కేరళలో దారుణ ఘటన చోటుచేసుకుంది. ఓ యువ వైద్యుడిని ఫ్లాట్‌కు పిలిపించి, దాడి చేసి, దోపిడీకి పాల్పడిన కేసులో మలయాళ నటి అతుల్య చంద్రను పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. ఆమెతో పాటు మరో ఇద్దరిని కూడా అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో మొత్తం 12 మందిని నిందితులుగా చేర్చగా, పరారీలో ఉన్న మిగతా వారి కోసం గాలిస్తున్నారు.పోలీసుల కథనం ప్రకారం.. నటి అతుల్య, బాధితుడైన డాక్టర్ ముందునుంచే స్నేహితులు. ఈ పరిచయంతోనే నవంబర్ 2న అతుల్య ఆ డాక్టర్‌కు ఫోన్ చేసింది. తన పిన్నికి తీవ్ర అనారోగ్యంగా ఉందని, అత్యవసరంగా ఫ్లాట్‌కు వచ్చి చికిత్స అందించాలని కోరింది. స్నేహితురాలే కావడంతో ఆమె మాటలను నమ్మిన డాక్టర్, సాయంత్రం 6:30 గంటల సమయంలో ఆమె చెప్పిన అపార్ట్‌మెంట్‌కు వెళ్లారు.అయితే, ఫ్లాట్‌లోకి అడుగుపెట్టిన డాక్టర్‌కు షాక్ తగిలింది. అక్కడ రోగికి బదులుగా అతుల్యతో సహా ఓ మూకా ఎదురుచూస్తోంది. లోపలికి రాగానే అతడిని బయటకు వెళ్లకుండా అడ్డుకుని బెదిరించారు. నిందితుల్లో ఒకరైన బిబిన్ అనే వ్యక్తి డాక్టర్ ముఖంపై బలంగా కొట్టాడు. ఆ తర్వాత మిగతా వారు కూడా అతడిని కుర్చీలో కూర్చోబెట్టి విచక్షణారహితంగా దాడి చేశారు.దాడి అనంతరం, నిందితులు డాక్టర్ వద్ద ఉన్న రూ. 3 లక్షల విలువైన మొబైల్ ఫోన్లతో పాటు ఇతర వస్తువులను దోచుకున్నారు. వారి నుంచి తప్పించుకున్న బాధితుడు వెంటనే కడవంత్రా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించి అతుల్య చంద్ర సహా ముగ్గురిని అరెస్ట్ చేశారు. ఆర్థిక వివాదాలు లేదా వ్యక్తిగత కక్షలు కారణంగానే ఈ దాడి జరిగిందా అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు. పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపు ముమ్మరం చేశారు.

చెన్నైలో వైఎస్ అనిల్ కుమార్తె వివాహ వేడుక... ఒకే వేదికపై జగన్, సీఎం విజయ్, కేటీఆర్



వైసీపీ అధ్యక్షుడు జగన్, ఆయన అర్ధాంగి వైఎస్ భారతి చెన్నైలో జరిగిన ఓ వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ వేడుక పలువురు రాజకీయ, వ్యాపార, సినీ ప్రముఖుల కలయికతో ఓ అరుదైన ఘట్టానికి వేదికైంది.వివరాల్లోకి వెళితే, జగన్ బంధువు వైఎస్ అనిల్ రెడ్డి కుమార్తె శ్రేయ వివాహం ఉజ్వల్‌తో చెన్నైలోని లీలా ప్యాలెస్ హోటల్‌లో గురువారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన జగన్ దంపతులు, వేదికపైకి వెళ్లి నూతన జంట శ్రేయ-ఉజ్వల్‌కు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. వారి దాంపత్య జీవితం ఆనందమయంగా, సుఖసంతోషాలతో సాగాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.ఈ వివాహ వేడుక ఓ అరుదైన రాజకీయ కలయికకు కేంద్రంగా నిలిచింది. ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తో పాటు తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్, తెలంగాణ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా హాజరయ్యారు. ముగ్గురు కీలక నేతలు ఒకే వేదికపై కనిపించడం అక్కడున్న వారిని ఆకర్షించింది. జగన్ తల్లి వైఎస్ విజయమ్మ, ప్రముఖ పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ, మాజీ మంత్రి పెద్దిరెడ్డి, ఆయన తనయుడు ఎంపీ మిథున్ రెడ్డి తదితరులు ఈ వేడుకకు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. కాగా, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్, ప్రముఖ నటి త్రిషతో కలిసి ఈ వేడుకకు రావడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇరువురూ నూతన దంపతులను అభినందించారు. ఒకే వేదికపై రాజకీయ, వ్యాపార, సినీ రంగ ప్రముఖులు సందడి చేయడంతో ఈ వివాహ మహోత్సవానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ అవుతున్నాయి.

గ్లామరస్ లుక్స్‌తో మరోసారి హాట్ టాపిక్‌గా మారిన సమంత



సౌత్ ఇండియన్ లేడీ సూపర్‌స్టార్ సమంత రుత్ ప్రభు ఏది చేసినా అదొక సంచలనమే! తాజాగా ఆమె షేర్ చేసిన గ్లామరస్ ఫోటోషూట్ పిక్స్ తో పాటు 'సెలబ్రిటీ మాస్టర్‌చెఫ్ తమిళ' షోలో జరిగిన ఒక ఎమోషనల్ అండ్ స్వీట్ ఇన్సిడెంట్ ప్రస్తుతం ఇంటర్నెట్‌ను ఊపేస్తోంది. రెడ్ డ్రెప్డ్ ఔట్‌ఫిట్‌లో రాయల్ లుక్‌తో మెరిసిన సమంత ఫ్యాషన్ ఎంపికలు ఫ్యాన్స్‌ను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. ఆ విశేషాలు ఇలా వున్నాయి..

రాయల్ రెడ్ ఔట్‌ఫిట్‌లో ఎలిగెంట్ అవతార్:

తాజా ఫోటోషూట్‌లో సమంత 'నూరియా' బ్రాండ్‌కు చెందిన రెడ్ రంగు డ్రేప్డ్ ఇండో-వెస్టర్న్ గౌన్‌లో దేవకన్యలా మెరిసిపోయారు. పర్ఫెక్ట్ ఫిట్‌తో ఉన్న ఈ ఔట్‌ఫిట్‌కు 'అమామా జ్యువెలరీ' నుంచి తీసుకున్న గ్రీన్ స్టోన్ గోల్డ్ చోకర్, మ్యాచింగ్ ఇయర్ రింగ్స్ మరియు స్లీక్ బ్రాస్‌లెట్ జత చేశారు. పూజా, అమృత సింగ్ స్టైలింగ్‌లో, జుట్టును వెనక్కి ముడివేసి ఆమె ఇచ్చిన పోజులు ఫ్యాషన్ ప్రియులను అమితంగా ఆకట్టుకుంటున్నాయి.

రాజ్‌దీప్ రణావత్ సిల్క్ కఫ్తాన్ డ్రెస్:

మరో పిక్‌లో సమంత 'రాజ్‌దీప్ రణావత్' లగ్జరీ కలెక్షన్‌కు చెందిన 'ఇమామా' ప్రింటెడ్ 100% ప్యూర్ సిల్క్ కఫ్తాన్ కేప్ డ్రెస్‌లో కనిపించారు. వెయిస్ట్ దగ్గర బెల్టెడ్ టై, స్లీవ్ స్లిట్ డీటెయిలింగ్‌తో ఉన్న ఈ డ్రెస్ ఆమెకు ఎంతో కంఫర్ట్‌తో పాటు క్లాసీ లుక్‌ను అందించింది. ఇక సమంత ధరిస్తున్న ఈ తరహా కంఫర్టబుల్ అండ్ స్టైలిష్ అవుట్‌ఫిట్స్ ప్రగ్నెంట్ స్త్రీలకు కూడా ఫ్యాషన్ ప్రేరణగా నిలుస్తున్నాయని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు.

'మాస్టర్‌చెఫ్' సెట్‌లో ఎమోషనల్ మూమెంట్:

'సెలబ్రిటీ మాస్టర్‌చెఫ్ తమిళ' దివాళీ స్పెషల్ ఎపిసోడ్‌లో సమంత ప్రత్యేక అతిథిగా సందడి చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ షెఫ్ వెంకటేష్ భట్, సమంతకు ఎంతో ఇష్టమైన 'దుర్గా హోటల్ స్టైల్ తాయిర్ వడ' స్వీట్ పొంగల్‌ను స్వయంగా వండి తినిపించారు. "ఒక తండ్రిగా నా చిన్నారి ప్రిన్సెస్ కోసం వండాను" అని షెఫ్ భట్ చెప్పడంతో సమంత తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. ఆ వడలను 'ప్రసాదం'తో పోలుస్తూ, ఇంటికి కూడా ప్యాక్ చేసి ఇవ్వమని కోరడం విశేషం.

చందమామ..నీకు అంత కోపమా..!



తెలుగు ప్రేక్షకులకు ఎంతో ఇష్టమైన హీరోయిన్లలో కాజల్ అగర్వాల్ ఒకరు. చందమామ సినిమాతో తెలుగు ప్రేక్షకుల మదిలో నిజంగానే చందమామ అని పేరు తెచ్చుకున్న ఈ ముద్దుగుమ్మ, తన అందం, నటనతో ఎంతో మంది అభిమానులను సంపాదించుకుంది. స్టార్ హీరోయిన్‌గా వరుస సినిమాలు చేసిన కాజల్, కెరీర్ మంచి స్థాయిలో ఉన్న సమయంలో పెళ్లి చేసుకుని కొంతకాలం సినిమాలకు దూరంగా ఉంది. ఆ తర్వాత తల్లి అయినప్పటికీ, మళ్లీ సినిమాల్లోకి వచ్చి తన సత్తా చాటుతోంది. ప్రస్తుతం కాజల్ అగర్వాల్ రామాయణం సినిమాలో రావణుడి భార్య మండోదరి పాత్రలో కనిపించనుంది. ఈ సినిమా కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి ముంబైలో జరిగిన రామాయణ: రైజ్ ఆఫ్ ఏ లెజెండ్ స్పెషల్ స్క్రీనింగ్ కి కాజల్ హాజరైంది. ఈ కార్యక్రమానికి తన కొడుకుతో కలిసి వచ్చిన ఆమె, తన కొడుకుని ఎత్తుకుని ఫోటోలకు ఫోజులిచ్చింది. ఈ వేడుకలో రణబీర్ కపూర్, అలియా భట్, నీతూ కపూర్, నితేష్ తివారీ, వివేక్ ఒబెరాయ్, రకుల్ ప్రీత్ సింగ్, సన్నీ డియోల్, లారా దత్తా తదితరులు కూడా పాల్గొన్నారు. అయితే ఈ కార్యక్రమానికి సంబంధించిన ఒక వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఆ వీడియోలో కాజల్ ఫోన్ అడిగి తీసుకుని ఎవరో ఒకరితో మాట్లాడుతున్నట్లు కనిపించింది. ఆ సమయంలో ఆమె ముఖంలో చాలా సీరియస్ ఎక్స్‌ప్రెషన్ కనిపించడంతో అభిమానులు ఆశ్చర్యపోతున్నారు. బిడ్డను ఎత్తుకుని ఉన్న కాజల్ ఫోన్‌లో మాట్లాడుతున్న తీరు చూసి..ఆమె చాలా కోపంగా ఉన్నట్లు నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. సాధారణంగా నవ్వుతూ కనిపించే చందమామ ఇలా సీరియస్‌గా కనిపించడంతో ఈ వీడియోపై ఆసక్తి పెరిగింది. చందమామ నీకు అంత కోపమా?' అంటూ అభిమానులు సరదాగా కామెంట్లు చేస్తున్నారు. అయితే ఆమె ఎందుకు అలా మాట్లాడింది, ఎవరితో ఫోన్‌లో మాట్లాడింది అనే విషయం మాత్రం తెలియదు. మరోవైపు రామాయణం సినిమాలో మండోదరిగా కాజల్ ఎలా కనిపించనుందో చూడాలని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ సినిమా ఆమె కెరీర్‌లో మరో ప్రత్యేకమైన పాత్రగా నిలుస్తుందేమో చూడాలి.

ఇండియన్ టాలెంట్‌పై హైబ్ కన్ను



ప్రపంచవ్యాప్తంగా సంగీత ప్రియులను ఉర్రూతలూగిస్తున్న అంతర్జాతీయ గర్ల్ గ్రూప్ -క్యాట్సుయ్- రూపకల్పనలో కీలక పాత్ర పోషించిన గ్లోబల్ క్యాస్టింగ్ ఎగ్జిక్యూటివ్ మిచెల్ చోంగ్ దృష్టంతా భారత్ వైపు మళ్లించారు. కే-పాప్ తరహా శిక్షణ, గ్లోబల్ పాప్ అప్పీల్‌ను మిళితం చేసి భారతదేశం నుంచి మొట్టమొదటి గ్లోబల్ గర్ల్ గ్రూప్‌ను తయారు చేసేందుకు రంగంలోకి దిగారు. విదేశీ సంగీత పరిశ్రమలో సరికొత్త సంచలనాలు సృష్టించిన ఈ మాస్టర్ మైండ్ ఇప్పుడు భారతీయ యువతలోని టాలెంట్‌ను ప్రపంచ వేదికపైకి తీసుకురావడానికి సిద్ధమవుతున్నారు. ప్రఖ్యాత ఎంటర్‌టైన్‌మెంట్ దిగ్గజం -హైబ్- --గెఫెన్ రికార్డ్స్- ఆధ్వర్యంలో రూపుదిద్దుకున్న -క్యాట్సుయ్- గ్రూప్ అంతర్జాతీయ స్థాయిలో ఎలాంటి అద్భుతాలు సృష్టిస్తోందో చెప్పాల్సిన పనిలేదు. వివిధ దేశాలకు చెందిన యువ తులను ఏకతాటిపైకి తెచ్చి కఠినమైన శిక్షణతో గ్లోబల్ స్టార్లను తయారు చేయడంలో మిచెల్ చోంగ్ అనుభవం అనన్యసామన్యమైనది. ఇప్పుడు అదే విజయవంతమైన బ్లూప్రింట్‌ను భారతదేశంలో అమలు చేసేందుకు హైబ్ సంస్థ భారత్‌లో ప్రత్యేక ఆడిషన్స్‌కు శ్రీకారం చుట్టింది. ఈ భారీ ప్రాజెక్టులో మిచెల్ చోంగ్‌తో పాటు ప్రముఖ ముంబై క్యాస్టింగ్ డైరెక్టర్ పంచమి ఘావి కూడా భాగస్వామ్యం కావడం విశేషం. భారతీయ సంగీత సంస్కృతికి.. పాశ్చాత్య పాప్ సంప్రదాయానికి మధ్య చక్కని వారధిలా నిలవాలని ఈ బృందం భావిస్తోంది. మన దేశంలో అపారమైన గాత్ర, నృత్య ప్రతిభ ఉందని అయితే సరైన గ్లోబల్ ప్లాట్‌ఫాం దొరకని ఎంతో మంది యువ ప్రతిభావంతులు ఉన్నారని మిచెల్ అభిప్రాయపడ్డారు. సాంప్రదాయ గాయకులను మాత్రమే కాకుండా అంతర్జాతీయ స్థాయి పాప్ స్టార్‌లలో ఉండాల్సిన -ఇట్- ఫ్యాక్టర్, అడాప్టబిలిటీ, ప్రత్యేకమైన వ్యక్తిత్వాన్ని కలిగి ఉన్న యువతులను వేటికి పట్టుకోవడమే ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. భారతదేశం నుంచి వస్తున్న సరికొత్త మ్యూజిక్ ప్రాజెక్టు పట్ల దేశవ్యాప్తంగా సంగీత ప్రియుల నుంచి, యువత నుంచి ఊహించని స్థాయిలో స్పందన లభిస్తోంది. సోషల్ మీడియా సరిహద్దులను దాటి ప్రతిమూలకూ ఈ వార్త చేరడంతో వేలాది మంది యువతులు ఆడిషన్స్ కోసం పోటీపడుతున్నారు. హైబ్ సంస్థ భారతదేశాన్ని తదుపరి గ్లోబల్ గర్ల్ గ్రూప్ వేదికగా ఎంచుకోవడం భారతీయ మ్యూజిక్ ఇండస్ట్రీలో చారిత్రాత్మక మైలురాయిగా ట్రేడ్ నిపుణులు అభివర్ణిస్తున్నారు. భారతీయ మూలాలున్న గాత్రాలు.. విభిన్న నృత్యరీతులు అంతర్జాతీయ పాప్ వేదికలపై మెరిసే రోజులు దగ్గరలోనే ఉన్నాయని ఈ పరిణామాలు చెప్పకనే చెబుతున్నాయి. మిచెల్ చోంగ్ అనుభవం.. హైబ్ సంస్థ అనుసరించే కఠినమైన ట్రెయినింగ్ సిస్టమ్ కలగలిసి రాబోయే రోజుల్లో ప్రపంచాన్ని శాసించే మరో గొప్ప గ్లోబల్ మ్యూజికల్ ఐకాన్‌ను భారత్ నుంచి అందించడం ఖాయంగా కనిపిస్తోంది.

చిరంజీవి, బాలయ్య, వెంకటేష్, నాగార్జున కాంబోలో మూవీ రాబోతోందా?



గత 4 దశాబ్దాలుగా తెలుగు చలన చిత్ర పరిశ్రమలో తమకంటూ ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకొని, తరాలు మారుతున్న బాక్సాఫీస్ వద్ద తిరుగులేని స్టార్లుగా వెలుగొందుతున్న నలుగురు దిగ్గజాలు చిరంజీవి,బాలయ్య, వెంకటేష్, నాగార్జున. ఇతర భాషల నుంచి ఎదురయ్యే పోటీని తట్టుకుని తెలుగు సినిమా ఇండస్ట్రీని ముందుకు తీసుకెళ్లడంలో కీలక పాత్ర వహించారు. సీనియర్ హీరోలుగా గుర్తింపును సంపాదించుకున్న ఈ నలుగురు హీరోలు ఇండస్ట్రీలో ఉన్న స్టార్ హీరోలతో పోటీ పడుతున్నారు. ఇప్పటికీ వాళ్ల నుంచి వచ్చే సినిమాలు ఇండస్ట్రీ రికార్డులను బ్రేక్ చేయగలుగుతున్నాయి.

రైటర్లకి సవాలుగా మారిందా

గత కొన్ని సంవత్సరాల నుంచి వీళ్ళ నలుగురిని కలిపి సినిమా చేయడానికి చాలామంది దర్శకులు ప్రొడ్యూసర్లు ఆసక్తి చూపిస్తున్నప్పటికి అది కార్యరూపం దాల్చడం లేదు. కారణం ఏంటంటే ఈ నలుగురు ఇమేజ్ ను బ్యాలెన్స్ చేస్తూ ఒక కథని రాయడం అనేది అసాధ్యం. ఒకరి క్యారెక్టర్ కి ఇంపార్టెన్స్ పెరిగితే మరొకరి కి ప్రాధాన్యత తగ్గిపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. కాబట్టి ఆ కథను హ్యాండిల్ చేయడం చాలా కష్టంతో కూడుకున్న పని ఇప్పటికే చాలామంది రైటర్లు ప్రయత్నించి వదిలేసారు...

ఈ నలుగురిని కలిపే దర్శకులు ఉన్నారా

ప్రస్తుతం ఇండస్ట్రీలో ఈ నలుగురితో సపరేట్ గా సినిమాలను చేస్తున్న దర్శకులు ఉన్నారు. కానీ వీళ్ళను కలిపి సినిమాలను చేయగలిగే దర్శకులు ఎవరున్నారు అనే దోరణిలో కొన్ని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తెలుగు సినిమా ఇండస్ట్రీలో రాజమౌళికి ఈ నలుగురిని హ్యాండిల్ చేసే కెపాసిటీ ఉంది. కానీ ప్రస్తుతం ఆయన వరల్డ్ సినిమా స్థాయికి వెళ్తున్నాడు. కాబట్టి ఈ నలుగురితో సినిమా చేయడం కష్టమనే చెప్పాలి. ఇక తమిళ్ సినిమా ఇండస్ట్రీ విషయానికి వస్తే రీసెంట్ గా 'జైలర్ 2' సినిమాతో సూపర్ సక్సెస్ ని సాధించిన నెల్సన్ కి సైతం ఈ నలుగురి ఇమేజ్ ను హ్యాండిల్ చేస్తూ సక్సెస్ ని సాధించగలిగే కెపాసిటీ ఉంది. కానీ దానికి తగ్గట్టు కథ దొరకాలి. అలాంటి కథని కనుక రాసుకోగలిగితే మాత్రం నెల్సన్ ప్రతి ఒక్కరి ఇమేజ్ కి తగ్గట్టుగా వాళ్ళను డిఫరెంట్ స్టైల్ లో చూపించే ప్రయత్నం చేస్తాడు. జైలర్ 2 రజనీకాంత్ ను డిఫరెంట్ గా ప్రజెంట్ చేస్తూ, భారీ లెవెల్లో ఎలివేట్ చేస్తూ ప్రతి ఒక్కరిని మంత్రముగ్ధుల్ని చేశాడు...

పదేళ్ల వయసులోనే గొప్పగా ఊహించుకున్నా.. కానీ



ప్రముఖ మలయాళీ బ్యూటీ అనుపమ పరమేశ్వరన్ గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు. అందం, అభినయంతో.. అద్భుతమైన నటనతో ఆడియన్స్ ను ఆకట్టుకుంటూ విపరీతమైన ప్రజాధారణ సొంతం చేసుకుంది . మలయాళం ప్రేమమ్ సినిమాతో ఇటు తెలుగు ప్రేక్షకులను కూడా పలకరించిన ఈమె.. తొలిసారి త్రివిక్రమ్ దర్శకత్వంలో సమంత, నితిన్ కాంబినేషన్లో వచ్చిన 'అ ఆ' చిత్రంలో సెకండ్ హీరోయిన్ గా నటించి, తన అద్భుతమైన నటనతో ఆడియన్స్ లో అటెన్షన్ క్రియేట్ చేసింది. ఆ తర్వాత శర్వానంద్ హీరోగా నటించిన 'శతమానం భవతి' సినిమాతో మంచి విజయాన్ని సొంతం చేసుకుంది అనుపమ. ఆ తర్వాత పలు చిత్రాలు చేసినా ఈమెకు పెద్దగా సక్సెస్ రాకపోవడంతో కొంతకాలం ఇండస్ట్రీకి బ్రేక్ ఇచ్చి.. మళ్లీ రీ ఎంట్రీ ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే రీ ఎంట్రీలో భాగంగా గ్లామర్ తో ఆకట్టుకోవడమే కాకుండా బోల్డ్ పాత్రలు కూడా చేసి మెప్పించింది అనుపమ. అలాంటి ఈమె ఇటీవల కిష్కింధపురి, పరదా, బైసన్ వంటి చిత్రాలలో నటించింది. సాధారణంగా ఇన్ని రోజులు రూమర్స్ కి దూరంగా ఉన్న అనుపమ పరమేశ్వరన్.. బైసన్ సినిమా సమయంలోనే ఆ చిత్ర హీరో, ప్రముఖ హీరో కొడుకు, యంగ్ హీరోతో ప్రేమలో పడినట్లు, ఆ తర్వాత ఏమైందో తెలియదు కానీ ఇద్దరి మధ్య బ్రేకప్ అయినట్లు సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున వార్తలు వినిపించిన విషయం తెలిసిందే. కాజుజపతీఅంపఎవత్ అయితే ఆ రూమర్లపై అనుపమ పరమేశ్వరన్ స్పందించలేదు. కానీ తన సినిమా ప్రమోషన్స్ లో భాగంగా రెండేళ్ల పాటు తాను టాక్సిక్ రిలేషన్ లో ఉన్నాను అని చెప్పి అందరిని ఆశ్చర్యపరిచింది. ప్రేమ అంటే ఒకరి స్వతంత్రాన్ని లాగేసుకోవడం కాదు అని చెప్పిన అనుపమ.. రెండేళ్లపాటు తాను నరకం చూసానని చెప్పుకొచ్చింది. అంతేకాదు తాను ప్రేమలో పడకముందు పెళ్లి చేసుకొని,చాలామంది పిల్లలను కణాలని కలలు కన్నట్లు చెప్పుకొచ్చిన ఈమె.. అతడితో రిలేషన్ బ్రేకప్ తర్వాత అసలు ప్రేమ, పెళ్లి , పిల్లలు అంటేనే భయమేస్తోంది అంటూ ఆవేదన వ్యక్తం చేసింది. టాక్సిక్ రిలేషన్ నుండి బయటపడ్డానని చెప్పిన ఈమె.. ఇటీవలే క్రేజీ కల్యాణం సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే ఇప్పుడు మరోసారి శర్వానంద్ తో కలిసి భోగి సినిమాలో నటిస్తోంది. ఇదిలా ఉండగా.. అనుపమ సోషల్ మీడియాలో ఎంత యాక్టివ్ గా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ప్రస్తుతం తన సినిమా షూటింగ్ లతో బిజీగా ఉంటూనే .. ఇటు ఖాళీ సమయం దొరికితే చాలు పలు రీల్స్ చేస్తూ సందడి చేస్తోంది. ఈ క్రమంలోనే తాజాగా షేర్ చేసిన ఒక వీడియో సోషల్ మీడియాలో ఆకట్టుకుంటుంది. సూర్య, భూమిక కాంబినేషన్లో వచ్చిన నువ్వు నేను ప్రేమ సినిమాలోని "ప్రేమించే ప్రేమవా" అనే మ్యూజిక్ ను షేర్ చేస్తూ.. ఒక గేటు పట్టుకొని సరదాగా ఆ మ్యూజిక్ ని ఫీల్ అవుతున్నట్లు ఆ వీడియోని షేర్ చేసింది. పైగా ఈ వీడియోకి క్యాప్షన్ గా.."పదేళ్ల వయసులోనే నేను, సన్ మ్యూజిక్ కి అతుక్కుపోయి.. ఈ పాటను పదేపదే వింటూ ప్రేమ, శృంగారం ఎలా ఉంటాయో ఊహించుకొనే దాన్ని" అంటూ చెప్పుకొచ్చింది . మొత్తానికైతే ఈ క్యాప్షన్ కాస్త వైరల్ కావడంతో ఇది చూసిన నెటిజన్స్.. పదేళ్ల వయసులోనే ఎన్నో ఊహించుకున్న ఈమె.. ఇప్పుడు యుక్త వయసుకు వచ్చాక అతడి కారణంగా ప్రేమ అంటేనే భయపడే స్టేజ్ కి చేరుకుందా అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా అనుపమ షేర్ చేసిన ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.

యాంకర్ రష్మీ కి అవకాశాలు రానివ్వకుండా చేస్తున్న స్టార్ డైరెక్టర్ అతనేనా?

బుల్లితెర పై స్టార్ యాంకర్స్ లిస్ట్ తీస్తే మన అందరికీ గుర్తుకు వచ్చే రెండు మూడు పేర్లలో ఒకటి రష్మీ. 'జబర్దస్త్' షో తో ఈమెకు ఒక పక్క యూత్ ఆడియన్స్ లో , మరో పక్క ఫ్యామిలీ ఆడియన్స్ లో కూడా మంచి క్రేజ్ వచ్చింది. ఆ షో పెద్ద హిట్ అవ్వడం తో ఈటీవీ , జీ తెలుగు , స్టార్ మా ఇలా అన్ని చానెల్స్ లోనూ రష్మీ కి యాంకర్ గా అవకాశాలు వచ్చాయి. ముఖ్యంగా ఈటీవీ లో అయితే ప్రతీ పాపులర్ ఎంటర్టైన్మెంట్ షోలో రష్మీ యాంకర్ గా కనిపించేది. ఇలా యాంకర్ గా ఆమెకు వచ్చిన ఫేమ్ కారణంగా సినిమాల్లో హీరోయిన్ గా నటించే అవకాశాలు కూడా బాగానే వచ్చాయి. ఆమె హీరోయిన్ గా నటించిన 'గుంటూరు టాకీస్' చిత్రం ఎంత పెద్ద హిట్ అయ్యిందో అందరికీ తెలిసిందే. ఆ తర్వాత చాలా సినిమాల్లో హీరోయిన్ గా చేసింది కానీ , అవి పెద్దగా నక్సెస్ సాధించలేదు.సినిమాల్లో నక్సెస్ రేట్ పెద్దగా రాకపోయినా , యాంకర్ గా మాత్రం ఆమె కెరీర్ పీక్ రేంజ్ లోనే కొనసాగుతూ వచ్చింది. కానీ ఇప్పుడు ఆ యాంకరింగ్ అవకాశాలు కూడా బాగా తగ్గిపోయాయి. ఈటీవీ లో ఈమె రెగ్యులర్ గా 'శ్రీదేవి డ్రామా కంపెనీ', 'జబర్దస్త్' వంటి షోస్ చేస్తూ ఉండేది. కానీ ఇప్పుడు శ్రీదేవి డ్రామా కంపెనీ నుండి ఈమెని తీసేసి ప్రదీప్ ని పెట్టుకున్నారు. ఇది రష్మీ కి పెద్ద షాక్ అనే చెప్పాలి.



ఇప్పుడు కేవలం ఆమె 'జబర్దస్త్' షో కి మాత్రమే యాంకర్ గా కొనసాగుతుంది. ఈ షో ఎప్పుడైనా ఆగిపోవచ్చు. అదే కనుక జరిగితే రష్మీ ని ఇక మనం బుల్లితెర మీద చూడడం కష్టం. ఉదయభాను , ఝాన్సీ , శిల్పా రావు వంటి యాంకర్స్ ఎలా అయితే కనిపించకుండా పోయారో , రష్మీ కూడా అదృశ్యమయ్యే అవకాశాలు ఉన్నాయి.అయితే ఇంతటి క్రేజ్ ఉన్న రష్మీ కి అవకాశాలు తగ్గడానికి కారణం ఏంటి?, సుడిగాలి సుధీర్ , యాంకర్ ప్రదీప్ వంటి వారు ప్రస్తుతం ట్రెండింగ్ లో ఉండడం వల్లేనా?, లేదంటే ఆమెకు అవకాశాలు రానివ్వకుండా ఎవరైనా తొక్కేస్తున్నారా? అనే సందేహాలు అభిమానుల్లో వ్యక్తం అవుతున్నాయి. అందుతున్న విశ్వసనీయ సమాచారం ప్రకారం అయితే , టాలీవుడ్ కి చెందిన ఒక టాప్ డైరెక్టర్ రష్మీ కి అవకాశాలు రానివ్వకుండా చేస్తున్నారని టాక్. ఆ టాప్ డైరెక్టర్ కి కెరీర్ మొత్తం మీద హిట్స్ ఉన్నాయట , పలు టీవీ షోస్ కి ఆయన న్యాయ నిర్ణేతగా కూడా వ్యవహరించాడట?, మరి ఆ డైరెక్టర్ ఎవరు?, ఎందుకు రష్మీ మీద పగబట్టి ఆమెకు అవకాశాలు రానివ్వకుండా చేస్తున్నారు అనేది తెలియాల్సి ఉంది. మరి దీనిపై మీ అభిప్రాయం ఏంటో కామెంట్ చేయండి , మరిన్ని లేటెస్ట్ అప్డేట్స్ కోసం మా ఛానల్ ని సబ్ స్క్రైబ్ చేసుకోండి.

ట్రంప్ ఓటమి.. మస్క్‌కు భారీ షాక్.. ఫండింగ్ రూ.4,200 కోట్లు... సంపదకు రూ.5 లక్షల కోట్లు లాస్?



అమెరికా మధ్యంతర ఎన్నికలు ప్రపంచ రాజకీయాల్లోనే కాదు.. అంతర్జాతీయ వ్యాపార రంగంలోనూ ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఎదురుదెబ్బ తగలడం, కాంగ్రెస్‌పై డెమొక్రాట్లు పట్టు సాధించడం ఒక ఎత్తయితే.. ఈ ఎన్నికల్లో రిపబ్లికన్ల గెలుపు కోసం భారీగా ఖర్చు చేసిన టెక్ దిగ్గజం ఎలాన్ మస్క్‌కు ఎదురైన పరిణామాలు ఇప్పుడు మరో ఆసక్తికర చర్చకు తెరలేపాయి. రాజకీయంగా పెట్టిన పెట్టుబడి ఫలించకపోగా.. ఆయన సంపదపైనా భారీ ప్రభావం పడినట్లు వార్తలు వస్తున్నాయి.తెలుగు వార్తలు

రాజకీయాల్లోకి కార్పొరేట్ శక్తి.. మస్క్ భారీ పందెం

ఎలాన్ మస్క్ అంటే ఒకప్పుడు టెస్లా, స్పేస్‌ఎక్స్, టెక్నాలజీ రంగాల్లో విప్లవాత్మక మార్పులకు మారుపేరు. కానీ ఇటీవల అమెరికా రాజకీయాల్లోనూ ఆయన ప్రభావం గణనీయంగా పెరిగింది. ముఖ్యంగా డొనాల్డ్ ట్రంప్‌కు బలమైన మద్దతుదారుగా నిలిచిన మస్క్.. రిపబ్లికన్ పార్టీ ఎన్నికల ప్రచారానికి భారీగా నిధులు సమకూర్చినట్లు కథనాలు వెలువడ్డాయి. ఈ మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్ల తరఫున ఆయన సుమారు 446 మిలియన్ డాలర్లు ఖర్చు చేసినట్లు అంచనా. భారత కరెన్సీలో ఇది దాదాపు రూ. 4,200 కోట్లకు సమానం. ఎన్నికల ప్రచారంలో అత్యధికంగా నిధులు సమకూర్చిన వ్యక్తుల్లో మస్క్ ముందున్నారు. కాంగ్రెస్‌పై రిపబ్లికన్ల పట్టు కొనసాగాలన్న లక్ష్యంతో ఆయన చేసిన ఈ భారీ ఖర్చు ఇప్పుడు చర్చనీయాంశమైంది.

గెలుపు కోసం పెట్టిన వేల కోట్లు.. ఫలితం మాత్రం రివర్స్

ఎన్నికల ఫలితాలు మస్క్ ఆశించిన దిశలో రాలేదు. డెమొక్రాట్లు ప్రతినిధుల సభతో పాటు సెనేట్‌లోనూ ఆధిపత్యం సాధించినట్లు వెలువడిన ఫలితాలు రిపబ్లికన్లకు గట్టి ఎదురుదెబ్బగా మారాయి. దీంతో ట్రంప్ రాజకీయ ప్రాబల్యానికి మాత్రమే కాకుండా.. ఆయనకు అండగా నిలిచిన మస్క్ రాజకీయ వ్యూహానికి పరీక్ష ఎదురైంది.ముఖ్యంగా టెక్సాస్‌లో రిపబ్లికన్లకు ఎదురైన పరాజయం మస్క్ రాజకీయ పెట్టుబడిపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఎన్నికల ప్రచారంలో ఆయన అధికంగా దృష్టి పెట్టిన ప్రాంతాల్లో ఇదొకటి కావడం గమనార్హం.

ఒక్కరోజులోనే సంపదకు భారీ దెబ్బ?

ఎన్నికల ఫలితాల తర్వాత మార్కెట్లలో చోటుచేసుకున్న పరిణామాలు మస్క్ సంపదపై ప్రభావం చూపినట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. టెస్లా షేర్లు 5.7 శాతం పడిపోయినట్లు, స్పేస్‌ఎక్స్ విలువ కూడా తగ్గినట్లు కొన్ని మార్కెట్ నివేదికలు వెల్లడించాయి.ఈ పరిణామాల నేపథ్యంలో మస్క్ సంపదలో 60 బిలియన్ డాలర్లకు పైగా తగ్గుదల నమోదైనట్లు కథనాలు వస్తున్నాయి. భారత కరెన్సీలో ఇది దాదాపు రూ. 5 లక్షల కోట్లకు పైమాటే. అయితే ఈ తగ్గుదలను ఎన్నికల ఫలితాలకే పూర్తిగా ఆపాదించలేం. మార్కెట్ పరిస్థితులు, కంపెనీల విలువల్లో మార్పులు, పెట్టుబడిదారుల అంచనాలు కూడా ఇందుకు కారణమై ఉండవచ్చు.

మస్క్‌కు ఇదో రాజకీయ గుణపాఠమా?

వ్యాపార రంగంలో తన నిర్ణయాలతో ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచిన ఎలాన్ మస్క్.. రాజకీయాల్లోనూ అదే స్థాయిలో ప్రభావం చూపాలని ప్రయత్నించారు. కానీ ఎన్నికల ఫలితాలు మరో విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. ఎంతటి సంపద, ఎంతటి ప్రచార బలం ఉన్నా.. ఓటరు నిర్ణయాన్ని పూర్తిగా ప్రభావితం చేయడం అంత సులభం కాదు.కార్పొరేట్ దిగ్గజాలు రాజకీయాల్లో పెట్టే భారీ పెట్టుబడులు తమకు అనుకూలమైన ఫలితాలను హామీ ఇవ్వలేవనే చర్చ మరోసారి మొదలైంది. ట్రంప్‌కు మద్దతుగా మస్క్ పెట్టిన రాజకీయ పందెం ఆశించిన ఫలితాన్ని ఇవ్వకపోవడం ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఆసక్తికర అంశంగా మారింది.అమెరికా ఎన్నికల్లో డెమొక్రాట్ల విజయం రాజకీయ సమీకరణాలను మార్చడమే కాకుండా, ఎలాన్ మస్క్ వంటి బిలియనీర్ల రాజకీయ వ్యూహాలపైనా కొత్త ప్రశ్నలు లేవనెత్తుతోంది. డబ్బుతో రాజకీయ ప్రభావాన్ని కొనుగోలు చేయవచ్చా? లేక అంతిమ నిర్ణయం ఓటరు చేతుల్లోనే ఉంటుందా? అమెరికా ఎన్నికల ఫలితాలు మరోసారి ఈ ప్రశ్నను తెరపైకి తెచ్చాయి.

ఒబామా తర్వాత డెమోక్రాట్ల ఆశాకిరణం.. 2028 అధ్యక్ష రేసులో జాన్ ఒసాఫ్ పేరు



అమెరికా మధ్యంతర ఎన్నికల్లో డెమోక్రటిక్ పార్టీకి కీలక విజయాలు దక్కిన వేళ.. ఆ పార్టీ యువ నాయకుడు జాన్ ఒసాఫ్ పేరు ఒక్కసారిగా మార్మోగుతోంది. జార్జియా రాష్ట్రం నుంచి సెనేట్‌కు మరోసారి ఎన్నికైన ఆయన.. 2028 అధ్యక్ష ఎన్నికల్లో డెమోక్రాట్ల తరఫున బరిలోకి దిగవచ్చనే చర్చ మొదలైంది. మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామాతో పోలికలు రావడం ఈ ఆసక్తిని మరింత పెంచుతోంది.39 ఏళ్ల ఒసాఫ్ 2021లో తొలిసారి జార్జియా నుంచి సెనేటర్‌గా ఎన్నికయ్యారు. అప్పటికి ఆయన వయసు 33 ఏళ్లు మాత్రమే. స్వల్ప అధిక్యంతో గెలవడంతో రాజకీయ విశ్లేషకులు ఆయనను 'అనుకోకుండా సెనేటర్ అయిన వ్యక్తిగా అభివర్ణించారు. ఐదేళ్ల తర్వాత ఇప్పుడు అదే రాష్ట్రంలో తిరిగి విజయం సాధించారు. 2024 అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్‌కు మద్దతు లభించిన జార్జియాలో ఒసాఫ్ గెలవడం విశేషం. రిపబ్లికన్ అభ్యర్థి మైక్ కాలిన్స్‌ను ఓడించి తన స్థానాన్ని నిలబెట్టుకున్నారు.ఎన్నికల ప్రచారంలో ట్రంప్ పాలనపై ఒసాఫ్ తీవ్ర విమర్శలు చేశారు. అధ్యక్షుడు, ఆయన కుటుంబంపై అవినీతి ఆరోపణలు చేస్తూ.. ప్రభుత్వ విధానాలు ప్రజాస్వామ్యానికి ముప్పుగా మారాయని విమర్శించారు. ఎన్నికల ఫలితాల అనంతరం అట్లాంటాలో జరిగిన సభలోనూ ట్రంప్ పాలనపై ఘాటుగా స్పందించారు. అమెరికా ప్రజలు అవినీతి, అసమర్థతను తిరస్కరించారని వ్యాఖ్యానించారు.ఒసాఫ్ ప్రసంగ శైలి, ప్రజలను ఆకట్టుకునే తీరు, యువ నాయకుడిగా ఆయనకున్న ఇమేజ్ ఒబామాను గుర్తు చేస్తున్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఒబామా కూడా ఎన్నికలకు ముందు ఒసాఫ్‌కు మద్దతుగా ప్రచారం చేశారు. ఆయన తన రాజకీయ గురువు జాన్ లూయిస్ నుంచి ప్రజాసేవలోని విలువలు నేర్చుకున్నారని ప్రశంసించారు.అయితే, 2028లో అధ్యక్ష పదవికి పోటీ చేసే ఆలోచన లేదని ఒసాఫ్ గతంలో స్పష్టం చేశారు. సెనేట్ ఎన్నికల్లో గెలిస్తే పూర్తి ఆరేళ్ల పదవీకాలం కొనసాగిస్తానని కూడా చెప్పారు. అయినప్పటికీ తాజా విజయం తర్వాత ఆయన పేరుపై చర్చ ఊపందుకుంది. డెమోక్రాట్లలో భవిష్యత్తు నాయకుడిగా ఎదిగే అవకాశాలు ఉన్నాయని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. అయితే అధ్యక్ష అభ్యర్థిత్వంపై ఆయన నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

హత్య కేసు నిందితుడికి బెయిల్.. బైక్ ర్యాలీతో హీరోలా స్వాగతం



బాలుడి హత్య కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తి బెయిల్‌పై విడుదల కాగా, అనుచరులు అతడికి హీరోలా స్వాగతం పలికారు. పూలమాలలు వేసి, భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. కారు బానెట్‌పై కూర్చుని సిగరెట్ తాగుతూ నిందితుడు హల్‌చల్ చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఈ ఘటనపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మధ్యప్రదేశ్‌లోని సత్నా జిల్లాలో జరిగిందీ ఘటన.సత్నా జిల్లాకు చెందిన మాన్ సింగ్ అలియాస్ బేటు సింగ్రౌల్, 2025 సెప్టెంబర్ 4న జరిగిన ఓ గొడవలో 16 ఏళ్ల సత్యం శుక్లా అనే బాలుడిని ఛాతీపై కాల్చి చంపినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. కోల్‌గవాన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎఫ్‌సీఐ గోడౌన్ సమీపంలో ఈ ఘటన జరిగింది. ఈ కేసులో అరెస్టయిన మాన్ సింగ్ సుమారు 14 నెలలుగా జైలులో ఉన్నాడు.ఇటీవల అతడికి బెయిల్ మంజూరు కావడంతో జైలు నుంచి విడుదలయ్యాడు. జైలు బయట వేచి ఉన్న అనుచరులు అతడికి పూలమాలలు వేసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం జైలు నుంచి సిద్ధార్థ్ కాలనీ వరకు మోటార్‌సైకిళ్లు, ఇతర వాహనాలతో భారీ ఊరేగింపు నిర్వహించారు. ఈ ర్యాలీలో మాన్ సింగ్ ఓ బొలెరో వాహనం బానెట్‌పై కూర్చుని సిగరెట్ తాగుతూ కనిపించాడు. ఈ సమయంలో పాటలు కూడా పెట్టినట్లు సమాచారం.చట్ట ప్రకారం బెయిల్ పొందడం హక్కు అయినప్పటికీ, తీవ్రమైన హత్య కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తికి ఇలా బహిరంగంగా వేదుక చేయడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ ర్యాలీతో ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన, శాంతిభద్రతల సమస్యలు తలెత్తుతాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇరాన్‌తో యుద్ధం చేద్దామా? వద్దా?.. డైలమాలో ట్రంప్



అమెరికా మధ్యంతర ఎన్నికల ఫలితాలు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఇరాన్‌తో కొనసాగుతున్న వివాదం విషయంలో కొత్త సవాళ్లను విసురుతున్నాయి. ఈ ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ పరాజయం పాలవడం, కాంగ్రెస్‌పై డెమొక్రాట్లు పట్టు సాధించడంతో ఇరాన్‌పై సైనిక చర్యలు చేపట్టే విషయంలో ట్రంప్‌కు ఉన్న స్వేచ్ఛకు కళ్లెం పడినట్లయింది. యుద్ధం కారణంగా జీవన వ్యయం పెరిగిందన్న అమెరికన్ ఓటర్ల అభిప్రాయం కూడా ఈ ఒత్తిడిని మరింత పెంచుతోంది.ఈ ఏడాది మొదట్లో అమెరికా–ఇజ్రాయెల్ సంయుక్తంగా దాడులు ప్రారంభించడంతో ఇరాన్‌తో వివాదం మొదలైంది. ఈ దాడులతో ఇరాన్ సైనిక సామర్థ్యానికి కొంత నష్టం వాటిల్లినా, దాని అణు కార్యక్రమం, హర్ముజ్ జలసంధిలో నౌకాయాన భద్రత వంటి కీలక అంశాలు మాత్రం పరిష్కారం కాలేదు. ప్రస్తుత పరిస్థితుల్లో అమెరికా యుద్ధాన్ని మరింత విస్తృతం చేయడం కంటే చర్చల ద్వారా ఒక ముగింపునకు రావాలని ప్రయత్నిస్తుందని గల్ఫ్ దేశాల అధికారులు, విశ్లేషకులు భావిస్తున్నారు.గల్ఫ్ ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం, ఇరాన్‌పై పూర్తిస్థాయి దాడి జరిగే అవకాశాలు తక్కువ. అణు కేంద్రాలపై పరిమిత దాడులు చేసి, నిర్దేశిత లక్ష్యాలను చేరుకున్నామని ప్రకటించి, యుద్ధాన్ని ముగించడం ఒక మార్గంగా కనిపిస్తోంది. చైనా మధ్యవర్తిత్వ ప్రయత్నాలు కూడా ఈ దిశగానే సాగుతున్నాయి. మరోవైపు, ప్రస్తుత నౌకా దిగ్బంధనం, ఆర్థిక ఆంక్షలను కొనసాగిస్తూనే చర్చలకు ఇరాన్ సుముఖతను పరీక్షించడం మరో వ్యూహం.అయితే, ఇరుపక్షాలు పరిస్థితిని తప్పుగా అంచనా వేసే ప్రమాదం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ఎన్నికల ఒత్తిళ్లు లేకపోవడంతో, ఇరాన్ విజయం సాధించిందన్న భావనను నివారించేందుకు ట్రంప్ మళ్లీ దూకుడుగా వ్యవహరించే అవకాశం లేకపోలేదని కొందరు వాదిస్తున్నారు. మరోవైపు, అమెరికాకు లొంగిపోయే ప్రసక్తే లేదని ఇరాన్ స్పష్టం చేస్తోంది. అమెరికా ఎన్నికల ఫలితాలను తమ దేశ ప్రజలు యుద్ధాన్ని తిరస్కరించడంగా టెహ్రాన్ అభివర్ణిస్తోంది. ఇదే సమయంలో ఇజ్రాయెల్‌లో ప్రధాని బెంజమిన్ నెతన్యాహు సంకీర్ణ ప్రభుత్వం కూడా రాజకీయంగా బలహీనపడటం ఈ సమీకరణాలను మరింత సంక్లిష్టం చేస్తోంది. వాషింగ్టన్ వైఖరిని టెహ్రాన్ ఎలా అర్థం చేసుకుంటుందన్న దానిపైనే దౌత్యమార్గం ముందుకు వెళ్తుందా? లేక ఉద్రిక్తతలు పెరుగుతాయా? అనేది ఆధారపడి ఉంది.

ట్రంప్‌కు మధ్యంతర షాక్.. 2028 అధ్యక్ష ఎన్నికలపై జేడీ వాన్స్ కన్ను?



అమెరికా మధ్యంతర ఎన్నికల్లో ఎదురైన పరాభవం అధ్యక్షుడు ట్రంప్‌ను ఇరకాటంలో పడేయడంతో ఇదే అదునుగా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ 2028 అధ్యక్ష ఎన్నికల కోసం పావులు కదుపుతున్నారనే ఊహాగానాలు జోరందుకున్నాయి. కాంగ్రెస్‌లోని ఉభయ సభల్లో డెమోక్రాట్లు అధిక్యం సాధించిన నేపథ్యంలో, పార్టీ ఓటమికి గల కారణాలను విశ్లేషిస్తూ వాన్స్ చేసిన సుదీర్ఘ సోషల్ మీడియా పోస్ట్ ఈ చర్చకు మరింత ఆజ్యం పోసింది.ఇరాన్ యుద్ధం, పెరిగిన జీవన వ్యయం, ద్రవ్యోల్బణం వంటి అంశాలే రిపబ్లికన్ల ఓటమికి ప్రధాన కారణాలని వాన్స్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. 2024లో ట్రంప్–వాన్స్ కూటమికి ఓటు వేసిన చాలామంది ఓటర్లు ఈసారి డెమోక్రాట్ల వైపు మొగ్గు చూపారని, పోల్స్‌ను ఉటంకిస్తూ ఆయన వివరించారు. "మన ఓటమికి ప్రధాన కారణం యుద్ధమే. ఈ విషయాన్ని స్వయంగా అధ్యక్షులే చెప్పారు" అని వాన్స్ రాశారు. యుద్ధాన్ని ముగించడం, ఆర్థిక అంశాలపై దృష్టి పెట్టడం, అమెరికా ఫస్ట్ విధానాన్ని అనుసరించడం, ఇజ్రాయెల్‌తో సంబంధాలను మార్చుకోవడం వంటి కారణాలతో ఓటర్లు పార్టీకి దూరమయ్యారని తెలిపారు.ఈ సంక్షోభ సమయంలో అంతర్గత విమర్శలకు బదులు, ఓటమికి గల కారణాలపై నిజాయతీగా సమీక్షించుకోవాలని వాన్స్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఇరాన్ వివాదానికి దౌత్యపరమైన పరిష్కారం కుదుర్చుకోవాలని, వలస విధానంలో మార్పులు తీసుకురావాలని ఆయన సూచించారు.మరోవైపు, వైట్ హౌస్‌లో మీడియాతో మాట్లాడిన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. వాన్స్ ప్రకటన "మంచిదే" అని వ్యాఖ్యానించారు. అయితే, 2028లో వాన్స్ అధ్యక్ష పదవికి పోటీ చేస్తారా? అనే ప్రశ్నకు ఆయన స్పష్టమైన సమాధానం ఇవ్వలేదు. "ఏం జరుగుతుందో చూద్దాం. ఎవరు పోటీ చేస్తారో? ఇప్పుడే చెప్పలేం. బహుశా ఆయన పోటీ చేయకపోవచ్చు" అంటూ దాటవేశారు. ఇంధన ధరల పెరుగుదలకు, ఎన్నికల ఓటమికి యుద్ధం ఒక కారణమని ట్రంప్ అంగీకరించినప్పటికీ, తన నిర్ణయాన్ని సమర్థించుకున్నారు.ఫ్లోరిడా గవర్నర్ రాన్ డిశాంటిస్ కూడా ఈ చర్చలో గొంతు కలిపారు. కొన్ని ప్రాంతాల్లో పార్టీకి ఇది "వినాశకరమైన పరిణామం" లాంటిదని, తిరిగి మద్దతు కూడగట్టుకోవాలంటే మెరుగైన పాలన అందించాలని నొక్కిచెప్పారు. మాజీ గవర్నర్ నిక్కీ హేలీ సైతం, రిపబ్లికన్లు బాధ్యత వహించి ఓటర్ల ఆర్థిక సమస్యలను పరిష్కరించాలని కోరారు.ఈ ఫలితాల తర్వాత, 2028 ప్రెసిడెన్షియల్ నామినేషన్ కోసం జేడీ వాన్స్ అవకాశాలు తగ్గుముఖం పడుతున్నాయని, రాన్ డిశాంటిస్ వంటి నేతల గ్రాఫ్ పెరుగుతోందని పొలిటికల్ మార్కెట్లు అంచనా వేస్తున్నాయి. ట్రంప్ పదవీకాలం ముగిసే వరకు కాంగ్రెస్‌పై డెమోక్రాట్ల నియంత్రణ ఉండనున్న నేపథ్యంలో, రిపబ్లికన్ పార్టీలో నాయకత్వం, భవిష్యత్ వ్యూహాలపై ఈ చర్చ మరింత ముదిరే అవకాశం కనిపిస్తోంది.

పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ లో పాక్ సైన్యం అరాచకం.. పౌరులపై డ్రోన్ దాడులు .. ఏడుగురు మృతి



పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ లో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గత కొన్ని నెలలుగా కొనసాగుతున్న నిరసనలను అణచివేసేందుకు పాకిస్తాన్ భద్రతా బలగాలు భారీ చర్యలకు దిగినట్లు తాజా నివేదికలు వెల్లడిస్తున్నాయి. ముఖ్యంగా రావల్కోట్ ప్రాంతంలో నిరసనకారులు, భద్రతా బలగాల మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నట్లు సమాచారం.పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ లో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గత కొన్ని నెలలుగా కొనసాగుతున్న నిరసనలను అణచివేసేందుకు పాకిస్తాన్ భద్రతా బలగాలు భారీ చర్యలకు దిగినట్లు తాజా నివేదికలు వెల్లడిస్తున్నాయి. ముఖ్యంగా రావల్కోట్ ప్రాంతంలో నిరసనకారులు, భద్రతా బలగాల మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నట్లు సమాచారం.గురువారం (నవంబర్ 05) ఉదయం రావల్‌కోట్ బస్ టెర్మినల్ పరిసరాల్లో నిరసనకారులను చెదరగొట్టేందుకు రేంజర్స్, ఫ్రాంటియర్ కార్ప్స్ బలగాలు చర్యలు ప్రారంభించినట్లు స్థానిక కథనాలు పేర్కొన్నాయి. ఈ సందర్భంగా కాల్పులు జరిగాయని, డ్రోన్ల ద్వారా పేలుడు పదార్థాలను ప్రయోగించినట్లు నిరసనకారులు ఆరోపిస్తున్నారు. నిరసన ఉద్యమంలో కీలకంగా వ్యవహరిస్తున్న సర్దార్ ఉమర్ నజీర్, ఉమర్ ఫరూఖ్ చౌక్ వద్ద పేలుడు పదార్థాలకు సంబంధించిన శకలాలను ప్రదర్శించారు. పౌరుల ఇళ్లు, నిరసన ప్రదేశాలపై దాడులు జరిగాయంటూ ఆయన అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థలు స్పందించాలని విజ్ఞప్తి చేశారు.అంతేకాకుండా, నిరసనకారులు పాకిస్తాన్ సైన్యం ఉపయోగించినట్లు ఆరోపిస్తున్న ఆర్‌పిజి7 రాకెట్‌కు సంబంధించిన తోక భాగాన్ని స్వాధీనం చేసుకున్నారు. దీంతో నిరసనకారులపై కేవలం తుపాకీ కాల్పులే కాకుండా భారీ ఆయుధాలు కూడా ఉపయోగించారనే ఆరోపణలు తెరపైకి వచ్చాయి. ఈ ఘటనలో ఏడుగురు నిరసనకారులు మరణించగా, 23 మంది తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ స్థితిలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. మరోవైపు, పోలీసులు నిరసనకారులే తొలుత దాడులకు పాల్పడ్డారని ఆరోపిస్తూ, భద్రతా బలగాల చర్యలను సమర్థించుకుంటున్నారు.పోలీసుల ప్రకటనలో డ్రోన్ దాడులు, ఆర్‌పిజి7 రాకెట్ల ప్రయోగంపై స్పష్టమైన వివరణ లేదని నిరసన వర్గాలు విమర్శిస్తున్నాయి. దీంతో ఉమర్ ఫరూఖ్ చౌక్ వద్ద నిరసనలు మరింత ఉద్ధృతమయ్యాయి. పాకిస్తాన్ సైన్యం, రేంజర్స్, ఎఫ్‌సీ బలగాలకు వ్యతిరేకంగా నిరసనకారులు నినాదాలు చేశారు. మరోవైపు, గతంలో కూడా రావల్‌కోట్‌లో జరిగిన ఘర్షణలపై ఇరువర్గాలు పరస్పర విరుద్ధ ఆరోపణలు చేశాయి. ఈ నేపథ్యంలో తాజా ఘటనపై స్వతంత్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని మానవ హక్కుల పరిరక్షణ వర్గాలు కోరుతున్నాయి.

కోట్ల డాలర్లు కుమ్మరించినా తప్పని ఓటమి.. అగ్రరాజ్యంలో బిలియనీర్లకు బిగ్ షాక్



అమెరికా రాజకీయ చరిత్రలోనే అత్యంత ఖరీదైన ఎన్నికలుగా నిలిచిన 2026 మధ్యంతర ఎన్నికల్లో షాకింగ్ ఫలితాలు వెలువడ్డాయి. బిలియనీర్ల అపరిమిత ఆర్థిక అండదండలు, భారీ విరాళాలు, ఇజ్రాయెల్ అనుకూల లాబీయింగ్ గ్రూపుల కోట్లాది డాలర్ల ప్రకటనల ప్రచారం ఉన్నప్పటికీ.. రిపబ్లికన్ పార్టీ ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. అమెరికా చట్టసభలైన హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్, సెనేట్ రెండింటిలోనూ రిపబ్లికన్లు తమ ఆధిపత్యాన్ని కోల్పోయి డెమోక్రాట్లకు మెజారిటీని అప్పగించాల్సి వచ్చింది.

చరిత్రలోనే అతిపెద్ద పొలిటికల్ ఫండింగ్

రాజకీయ నిధుల సమీకరణను పర్యవేక్షించే 'ఓపెన్ సీక్రెట్స్' నివేదిక ప్రకారం.. ఈ మధ్యంతర ఎన్నికల వ్యయం ఊహించని స్థాయిలో దాదాపు 11.9 బిలియన్ డాలర్లకు(భారత కరెన్సీలో దాదాపు రూ.98,000 కోట్లు) చేరింది. అత్యధికంగా విరాళాలు ఇచ్చిన మొదటి 50 సంస్థలు, దాతల లెక్కలను పరిశీలిస్తే రిపబ్లికన్ వర్గానికి చెందిన కోటీశ్వరులు ఏకంగా 1.67 బిలియన్ల డాలర్లు గుమ్మరించగా.. డెమోక్రటిక్ మద్దతుదారుల దాతలు మాత్రం 832 మిలియన్ డాలర్లు మాత్రమే ఖర్చు చేశారు. రిపబ్లికన్లకు మద్దతుగా నిలిచిన బిలియనీర్లలో టెస్లా అధినేత ఎలాన్ మస్క్ అగ్రస్థానంలో నిలిచారు. ఆయన ఒక్కరే ఈ ఎన్నికల చక్రంలో దాదాపు 446 మిలియన్ డాలర్ల భారీ నిధులను అందించారు. వీరితో పాటు రిచర్డ్-ఎలిజబెత్ 150 మిలియన్ డాలర్లు, జెఫ్-జెనిన్ యూస్ 110 మిలియన్ డాలర్లు, మిరియమ్ అడెల్సన్ 67 మిలియన్ డాలర్లు వెచ్చించి రిపబ్లికన్ల విజయానికి కోట్ల డాలర్లను నీళ్లలా ఖర్చు చేశారు.

ఇజ్రాయెల్ లాబీయింగ్ గ్రూపుల హవా.. ఫలితాల్లో భంగపాటు

ఈ ఎన్నికల ప్రచారంలో ఇజ్రాయెల్ మద్దతుగల పొలిటికల్ యాక్షన్ కమిటీలు వెచ్చించిన నిధులు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. అమెరికా-ఇజ్రాయెల్ ద్వైపాక్షిక సంబంధాల కోసం పనిచేసే ప్రముఖ లాబీయింగ్ సంస్థ 'ఏఐపాక్', దాని అనుబంధ సూపర్‌పాక్ 'యునైటెడ్ డెమోక్రసీ ప్రాజెక్ట్' డెమోక్రటిక్ పురోగతిని అడ్డుకునేందుకు భారీగా నిధులను రంగంలోకి దించాయి. 'ఏఐపాక్' దాదాపు 30 మిలియన్ డాలర్లు ఇవ్వగా.. దాని సూపర్‌పాక్ 53.6 మిలియన్ డాలర్ల ఖర్చు చేసింది. మొత్తం ఇజ్రాయెల్ అనుకూల సంస్థలు చేసిన ప్రచార వ్యయం 70.8 మిలియన్ డాలర్లుగా నమోదైంది. అయితే ఈ నిధులన్నీ ఇజ్రాయెల్ ప్రభుత్వం నుంచి నేరుగా వచ్చినవి కావు. అమెరికా చట్టాల ప్రకారం విదేశీ ప్రభుత్వాలు లేదా పౌరులు అమెరికా ఎన్నికలకు ఆర్థిక నిధులు సమకూర్చడం నిషేధం.

కోట్లు ఖర్చు చేసి ప్రచారం చేసినా దాటి విజయం సాధించారు..

కోట్లాది డాలర్లు వెచ్చించి ఓడించాలని చూసినప్పటికీ.. పలువురు డెమోక్రాట్ అభ్యర్థులు ఓటర్ల ఆదరణతో ఘన విజయం సాధించి విశ్లేషకులను కూడా ఆశ్చర్యపరిచారు. మిచిగాన్ రాష్ట్ర సెనేట్ రేసులో పోటీ చేసిన అబ్దుల్ ఎల్-సయ్యద్‌ను ఓడించేందుకు ప్రో-ఇజ్రాయెల్ సంస్థలు ఏకంగా 22.3 మిలియన్ డాలర్లు(దాదాపు రూ.185 కోట్లు) ఖర్చు చేసి తీవ్ర ప్రతికూల ప్రకటనల ప్రచారం నిర్వహించాయి. అయినప్పటికీ అబ్దుల్ ఎల్-సయ్యద్ తన సమీప రిపబ్లికన్ ప్రత్యర్థి మైక్ రోజర్స్‌పై ఘన విజయం సాధించారు.

ఓటర్ల నిర్ణయానని మార్చిన ప్రధానాంశాలు

అత్యధిక ధనబలం ఉన్నప్పటికీ రిపబ్లికన్లు ఓడిపోవడానికి అమెరికాలోని ప్రస్తుత రాజకీయ, ఆర్థిక పరిస్థితులే ప్రధాన కారణమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. విపరీతంగా పెరిగిన జీవన వ్యయం, నిత్యావసరాల ధరలు ఓటర్లలో తీవ్ర అసంతృప్తిని నింపాయి. డొనాల్డ్ ట్రంప్ పరిపాలనా శైలి, వివాదాస్పద ఇమ్మిగ్రేషన్ విధానాలపై సాధారణ పౌరుల్లో వ్యతిరేకత వ్యక్తమైంది. ట్రంప్ సర్కారు ఇరాన్ దేశంపై ప్రారంభించిన యుద్ధం సృష్టించిన ఆర్థిక భారం, ప్రాణనష్టం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ధనబలం, భారీ రాజకీయ విరాళాలు, నెగెటివ్ ప్రచారాలు మాత్రమే ఎన్నికల విజయాలను ఖరారు చేయలేవని 2026 మధ్యంతర ఎన్నికలు స్పష్టం చేశాయి.

మళ్లీ అదే సీన్..మున్సిపల్ఎన్నికల తరహాలోనే పరిషత్ ఎన్నికలు



పరిస్థితిలో ఏ మాత్రం మార్పులేదు. పోలీసులు మారలేదు. టీడీపీ స్థానిక నేతల తీరు కూడా అదే రకం. మున్సిపల్ ఎన్నికల్లో పోలింగ్ ఏజెంట్లను అడ్డుకున్నట్లుగానే పరిషత్ ఎన్నికల్లోనూ అదే సీన్ రిపీట్ అవుతుంది. టీడీపీ నేతలు వైసీపీకి చెందిన ఏజెంట్లను పోలింగ్ కేంద్రాల్లోకి వెళ్లకుండా అడ్డుకుంటున్నా పోలీసులు చోద్యం చూస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కడప జిల్లాలోనే ఈ రకమైన పరిస్థితి కనిపిస్తోంది. కడప, అనంతపురం, తిరుపతి, చిత్తూరు అంటే రాయలసీమ జిల్లాల్లో పోలింగ్ ఏజెంట్లను అడ్డుకుంటున్నారు. నంద్యాల పోలింగ్ కేంద్ర వద్ద కూడా ఉద్రిక్తత నెలకొంది. కడప జిల్లా ఎర్రకుంట్ల వద్ద పెట్రోలు బాంబులు దాడులతో బీభత్సం సృష్టించారు

వైసీపీ ఏజెంట్లను..

పోలీసులే వైసీపీ ఏజెంట్లను బలవంతంగా బయటకు పంపడంతో వైసీపీకి చెందిన ఏజెంట్లు బయట కూర్చుని ఆందోళన చెందుతున్నారు. మున్సిపల్ ఎన్నికల్లో ఇలా జరిగినా పోలీసుల అధికారుల తీరు మారలేదు. గెలుపు లక్ష్యం అధికార పార్టీలో కనిపిస్తుంది. ప్రతిపక్ష పార్టీ నేతకు చెందిన సొంత జిల్లా అయిన కడపలోని జమ్మల మడుగు, పులివెందుల వంటి చోట్ల తిరిగి ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఇలా చేయడం బదులు ఎన్నికలు నిర్వహించకుండా తమ వారిని నామినేట్ చేసుకుంటే మంచిది కదా? అని వైసీపీ నేతలు ప్రశ్నిస్తున్నారు. రాయలసీమలోని పలు ప్రాంతాల్లో వైసీపీ నేతలను ముందస్తు అరెస్ట్ లు చేస్తున్నారు.

పోలీసుల సహకారంతో...

పోలీసులు అధికార పార్టీకి సహకారం అందిస్తూ తమను బయటకు పంపుతున్నారని వైసీపీ పోలింగ్ ఏజెంట్లు చెబుతున్నారు. పల్నాడు ప్రాంతంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. రాయలసీమలోని నాలుగు జిల్లాలు, పల్నాడు మినహా మిగిలిన అన్ని చోట్ల పోలింగ్ ప్రశాంతంగా జరుగుతుంది. నామినేషన్ల నుంచి మొదలయిన రగడ పోలింగ్ వరకూ కొనసాగుతూనే ఉండటం శాంతిభద్రతల సమస్యకు అద్దం పడుతుంది. ఎవరు ఎంత సమర్థించుకున్నప్పటికీ జరుగుతున్న వాస్తవాలను ప్రజలు గమనిస్తున్నారన్న విషయాన్ని గుర్తిస్తే అధికార, ప్రతిపక్ష పార్టీలకు మంచిది. ప్రజాస్వామ్య యుతంగా ఎన్నికలు జరిపి గెలిచినా, ఓడినా తప్పులను సరిదిద్దుకోవడానికి ఇరువురికీ ఉపయోగపడాల్సిన ఈ ఎన్నికలు వన్ సైడ్ గా మారడం చివరకు ఎవరి పతనానికి దారితీస్తుందన్నది కాలమే సమాధానం చెబుతుంది.

గుమ్మడికి బూమ్ రాంగ్ అయిందా? రెబెల్స్ ఓడి సీన్ ఏందో తెలిసిందిగా?



మంత్రిగా ఉండి కూటమి ఆదేశాలను ధిక్కరించడం ఈ ఎన్నికల్లో హైలెట్ అనే చెప్పాలి. కూటమి నిర్ణయించిన అభ్యర్థులను కాకుండా తన సొంత అనుచరులకు పదవులను కట్టబెట్టాలన్న మంత్రిగారి తపన కూటమిలోని ప్రధాన పార్టీ అయిన టీడీపీకి తలనొప్పిగా మారింది. గుమ్మడి సంధ్యారాణి వ్యవహారం ఇప్పుడు చర్చనీయాంశమైంది. కూటమి పొత్తును ధిక్కరించడంతో పాటు తమ అనుచరులను రెబల్ గా దించి ఏదో సాధిద్దామని భావించి చతికిలకపడుతున్నారు.ఇక విషయానికి వస్తే కూటమి పొత్తుని దిక్కరించి, రాష్ట్ర స్తాయి సర్దుబాటులో జనసేనకి ఇచ్చిన సాలూరు మున్సిపాలిటీని జనసేనకి వదలకుండా టీడీపి నుండి రెబల్ ని దింపి, ప్రచారం కూడా చేసారు. ఎక్కడా పొత్తు ధర్మాన్ని పాటించకుండా వార్డుల్లో కూడా జనసేన మీద పోటీ పెట్టారు. ఇది గుమ్మడి సంధ్యారాణికి అవమానంగానే చూడాలి. తొలిసారి ఎమ్మెల్యే అయి, తొలిసారి మంత్రి పదవి లక్ష్యంతో పొంది పార్టీ నాయకత్వం ఆదేశాలను ధిక్కరించడాన్ని పలువురు మిత్ర పక్ష పార్టీ నేతలు తప్పుపడుతున్నారు.

తొలిసారి గెలిచి...

సాలూరు నియోజకవర్గానికి గుమ్మడి సంధ్యారాణి తొలిసారి గెలిచారు. ఒకరకంగా చెప్పాలంటే సాలూరు నియోజకవర్గంలో టీడీపీకి పట్టులేదు. కూటమి హవాలో గెలిచారు. గతంలో రెండుసార్లు పోటీ చేసి ఓటమి పాలయిన గుమ్మడి సంధ్యారాణి గాలి వాటంలో గెలిచారు. తనకున్న సామాజికవర్గం కారణంగా ఎమ్మెల్సీ పదవిని అంతకు ముందు పొందారు. టీడీపీకి నమ్మకమైన నేతగా నిలిచినప్పటికీ గుమ్మడి సంధ్యారాణి మున్సిపల్ ఎన్నికల్లో సాలూరు మున్సిపాలిటీలో రెబల్ ను బరిలోకి దించి తమ పార్టీ నేతలకే సవాల్ విసిరారు. కానీ మంత్రి గారి చర్యలను కూటమి పార్టీల కార్యకర్తలు సమర్థించలేదు. కూటమిలో పొత్తులో భాగంగా అది జనసేనకు కేటాయించారు. కానీ తన అనుచరుడి కోసం రెబల్ గా దించి తప్పు చేశారంటూ సొంత పార్టీ నేతలే మంత్రిగారి మీద కారాలు, మిర్రియలు నూరుతున్నారు. మరొకవైపు జనసేన నేతలు కూడా ఇప్పటికే మంత్రి గుమ్మడి సంధ్యారాణిపై తమ పార్టీ నాయకత్వానికి ఫిర్యాదు చేశారు.

సీన్ తెలిసిపోయిందిగా...

అయితే జనసేన అభ్యర్థి గెలవడంతో ఇక గుమ్మడి సంధ్యారాణి సీన్ చెప్పకనే తెలిసిపోయిందంటున్నారు. ఇక మున్సిపల్ ఎన్నికలతో ఊరుకోని గుమ్మడి సంధ్యారాణి ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లోనూ తన మద్దతుదారులను రెబల్ గా బరిలోకి దింపారు. జనసేన కు దక్కాల్సిన వాటాను తాము దక్కించుకుని క్రెడిట్ కొట్టేయాలనుకున్న మంత్రి గారి ఆలోచన రివర్స్ అయిందనే అనుకోవాలి. కూటమిలోని టీడీపీ నాయకత్వం కూడా గుమ్మడి సంధ్యారాణిపై చర్యలు తీసుకోకపోవడం ఒకింత జనసైనికులకు ఆగ్రహాన్ని తెప్పించింది. సాలూరులో వరుసగా కాంగ్రెస్, వైసీపీలు మూడు ఎన్నికల్లో గెలిచాయి. కానీ మొన్న గాలివాటాన గెలిచిన గుమ్మడి సంధ్యారాణి మాత్రం తాను ఏదో పెద్ద లీడర్ అని పోజులివ్వడం మాత్రం సొంత పార్టీ నేతలకే నచ్చడం లేదు. ఇప్పటికైనా తీరు మార్చుకోకపోతే గుమ్మడికి మంత్రి పదవి ఊడటం ఖాయమన్న కామెంట్స్ కూటమి పార్టీల నేతల నుంచి వినిపిస్తుంది.

దగ్గుబాటి మరింత దూరమయ్యారా... వచ్చే ఎన్నికల్లో సీటు హుళక్కేనా?

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ లో జరిగిన ఓటమికి ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్ బాధ్యతపై చర్చ జరుగుతోంది. దగ్గుబాటి ప్రసాద్ పై అసలే వ్యతిరేకత ఉంది. అనేక వివాదాలు గతంలో చుట్టుముట్టాయి. సొంత పార్టీ నేతలే ఎమ్మెల్యేకు వ్యతిరేకమయ్యారు. ప్రధానంగా మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరికి, ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్ లకు మధ్య గత కొంతకాలంగా పంచాయతీ నడుస్తుంది. టీడీపీ నాయకత్వం అనేక సార్లు ఇద్దరినీ పిలిచి వార్నింగ్ ఇచ్చింది. కానీ మున్సిపల్ కకార్పొరేషన్ ఎన్నికల్లో కూటమి మిత్రపక్షమైన బీజేపీ అభ్యర్థి ఓటమి పాలవ్వడం, వైసీపీ గెలవడంతో ఆ అపప్రధను మూటగట్టుకున్నారు. ఓటమికి ఓట్ల బదిలీ జరగకపోవడమే ప్రధాన కారణమన్న ఆరోపణలున్నాయి. దీనిపై స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత దీనిపై పార్టీ హైకమాండ్ ఆపరేషన్ నిర్వహించే అవకాశముంది. అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో మేయర్ స్థానాన్ని మైనార్టీ కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవడం, కూటమి అభ్యర్థి ఓడిపోవడం వెనుక స్థానిక టీడీపీ ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ నాయకత్వం, పార్టీ అంతర్గత విభేదాలు ఒక ముఖ్య కారణమనే విశ్లేషణలు రాజకీయ వర్గాల్లో విస్తృతంగా సాగుతున్నాయి.ఎ

వార్డులు గెలిచినా...

కార్పొరేషన్ పరిధిలోని 62 డివిజన్లలో కూటమి పార్టీలలో టీడీపీ 30, జనసేన 6, బీజేపీ ఒకస్థానంలో కలిపి 37 స్థానాలను గెలుచుకున్నప్పటికీ, నేరుగా జరిగిన మేయర్ ఎన్నికలో మాత్రం బీజేపీ అభ్యర్థి అజేష్ బాబు వైసీపీ అభ్యర్థి రమేష్ గౌడ్ చేతిలో 5,981 ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఈ ఓటమిలో ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్ పాత్రఉందని బీజేపీ స్థానిక నేతలు ఆరోపిస్తున్నారు.

తమకు దక్కకుండా బీజేపీకి ఆ సీటు కేటాయించడంపై తెలుగు తమ్ముళ్లు అసంతృప్తిగా ఉండటంతో కొంత టీడీపీ ఓట్లు వైసీపీకి పడిసట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే ఇక్కడ గెలిస్తే దగ్గుబాటి ప్రసాద్ ఇంకా రెచ్చిపోతారని భావించి పార్టీలోని ఆయన ప్రత్యర్థులే వెన్నుపోటు పొడిచారన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి.

గతంలో అనేక వివాదాలకు ఆయన కారణం. జూనియర్ ఎన్టీఆర్ అభిమానులను కూడా దగ్గుబాటి ప్రసాద్ దూరం చేసుకున్నారు. ఈ నేపథ్యంలోనే అనంతపురంలో కూటమికి ఓటమి ఎదురయిందంటున్నారు.

ఓట్లు బదిలీ కాకపోవడంతోనే...

కార్పొరేటర్ అభ్యర్థులకు ఓటు వేసిన కూటమి ఓటర్లు, మేయర్ స్థానానికి వచ్చేసరికి వైసీపీ వైపు మొగ్గు చూపారు. నియోజకవర్గ ఇన్-ఛార్జ్ మరియు ఎమ్మెల్యేగా ఉన్న దగ్గుబాటి ప్రసాద్ తన ఓటర్లను, ముఖ్యంగా టీడీపీ క్యాడర్‌ను కూటమి



భాగస్వామి అయిన బీజేపీ అభ్యర్థి వైపు సంపూర్ణంగా మళ్లించడంలో విఫలమయ్యారనే విమర్శలు వ్యతిరేక వర్గాల నుండి వస్తున్నాయి.అనంతపురం మేయర్ స్థానాన్ని దక్కించుకోవాలని స్థానిక టీడీపీ నాయకత్వం మొదటి నుంచి ఆశించింది. అయితే, కూటమి సీట్ల సర్దుబాటులో భాగంగా ఈ సీటు బీజేపీకి వెళ్లడంపై స్థానిక టీడీపీ నాయకుల్లో అసంతృప్తి నెలకొంది. మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి వర్గానికి, ప్రస్తుత ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్ వర్గానికి మధ్య ఉన్న అంతర్గత విభేదాలు, సమన్వయ లోపం కూడా కూటమి అభ్యర్థి ఓటమికి దారితీశాయని స్థానిక విశ్లేషణలు చెప్తున్నాయి.క్షేత్రస్థాయిలో బీజేపీ అభ్యర్థితో కలిసి టీడీపీ శ్రేణులను పూర్తిగా రంగంలోకి దించడంలో ఎమ్మెల్యే విఫలమయ్యారనే చర్చ నడుస్తోంది. కూటమి భాగస్వామ్య పక్షాల మధ్య సరైన సమన్వయ కమిటీలు లేకపోవడం ఎమ్మెల్యే వైఫల్యంగా విమర్శకులు చూపిస్తున్నారు.

బీజేపీ కూడా...

ఎన్నికల సమయంలో పోలింగ్ కేంద్రాల్లో అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారంటూ వైరి పక్షాల నుంచి ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్‌పై ఆరోపణలు వచ్చాయి. ఇటువంటి వివాదాలు కూడా పోలింగ్ రోజున తటస్థ ఓటర్లపై ప్రతికూల ప్రభావం చూపించి ఉండవచ్చని భావిస్తున్నారు.అయితే ఈ ఓటమికి కేవలం ఎమ్మెల్యే బాధ్యత మాత్రమే కాకుండా, బీజేపీ అభ్యర్థి ఎంపికపై ఆ పార్టీలోనే ఉన్న అసంతృప్తి, సీనియర్లను పక్కనపెట్టి టికెట్ ఇవ్వడం, మైనారిటీ ఓట్లను ఆకట్టుకోలేకపోవడం మరియు వైసీపీ అనుసరించిన వ్యూహాత్మక ప్రచారం వంటి ఇతర బలమైన కారణాలు కూడా ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు.

గొడవలతో నష్టపోయేది కార్యకర్తలే.. మేం బాగానే వుంటాం: జేసీ ప్రభాకర్‌రెడ్డి



రాజకీయ గొడవల్లో నష్టపోయేది కింది స్థాయి కార్యకర్తలేనని, తమ లాంటి నాయకులు ఎప్పుడూ బాగానే ఉంటారని టీడీపీ మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. అనవసర వివాదాలతో కార్యకర్తలే నష్టపోతారని, ఈ విషయం గుర్తించి గొడవల జోలికి వెళ్లవద్దని ఆయన హితవు పలికారు. తాడిపత్రిలో తన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.గత వారంలో యల్లనూరు, పుట్లూరు, యాడికి మండలాల్లో జరిగిన సంఘటనలను ఆయన ప్రస్తావించారు. ఈ ఘర్షణల వల్ల నష్టపోయింది కార్యకర్తలేనని గ్రహించాలని, ఇకపై ఇలాంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. ఇటీవల జరిగిన గొడవల్లో నష్టపోయిన వారికి ఎన్నికలు ముగిసిన తర్వాత తన వంతుగా చేతనైన సాయం చేస్తానని హామీ ఇచ్చారు.ముఖ్యంగా యల్లనూరు, పుట్లూరు మండలాల్లో జరిగిన ఘటనల్లో నష్టపోయిన వారికి ప్రభాకర్‌రెడ్డి క్షమాపణలు తెలిపారు. ఆ రెండు మండలాల్లో ఫ్యాక్షనిజం పూర్తిగా నశించి, అభివృద్ధి పథంలో పయనించాలని తాను మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు.

బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి హౌస్ అరెస్ట్.. శబరిని ఎందుకు వదిలేశారంటూ వైసీపీ ప్రశ్న



నంద్యాల జిల్లాలో రాజకీయ ఉద్రిక్తత చోటుచేసుకుంది. పరిషత్ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు తన సొంత గ్రామమైన పగిడ్యాల మండలం పాత ముచ్చుమర్రికి వెళ్లిన వైసీపీ నేత బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డిని పోలీసులు గృహనిర్బంధం చేశారు. ఈ పరిణామంపై వైసీపీ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.ఈ నేపథ్యంలో నందికొట్కూరు వైసీపీ కార్యాలయంలో పార్టీ సమన్వయకర్త డాక్టర్ దారా సుధీర్ విలేకరుల సమావేశం నిర్వహించారు. కేవలం ఓటు వేయడానికి వెళ్లిన తమ నాయకుడిని హౌస్ అరెస్ట్ చేయడం దుర్మార్గమని, ఇది ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని ఆయన మండిపడ్డారు. కూటమి నాయకులు యథేచ్ఛగా రిగ్గింగ్ చేసుకోవాలనే దురుద్దేశంతోనే ప్రతి మండలంలో 5 నుంచి 10 మంది వైసీపీ ముఖ్య నాయకులను అరెస్ట్ చేస్తున్నారని ఆరోపించారు.అక్రమంగా అరెస్ట్ చేసిన నాయకులను తక్షణమే విడుదల చేసి, వారి గ్రామాలకు పంపకపోతే జిల్లా కలెక్టర్, ఎస్పీతో పాటు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని సుధీర్ హెచ్చరించారు. ముచ్చుమర్రిలో సిద్ధార్థ్ రెడ్డిని అరెస్ట్ చేసిన పోలీసులు, అక్కడే ఉన్న నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరిని ఎందుకు వదిలేశారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ అప్రజాస్వామిక చర్యలకు కూటమి ప్రభుత్వం వడ్డీతో మూల్యం చెల్లించుకోక తప్పదని ఆయన హెచ్చరించారు.

పులివెందుల ఎర్రిపల్లెలో పెట్రోల్ బాంబులతో దాడులు.. తీవ్ర ఉద్రిక్తత



కడప జిల్లాలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ తీవ్ర ఉద్రిక్తతల మధ్య సాగుతోంది. పులివెందుల నియోజకవర్గంలో హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. పులివెందుల మండలం ఎర్రిపల్లెలోని పోలింగ్ బూత్ వద్ద పరిస్థితి అదుపుతప్పి, పెట్రోల్ బాంబుల దాడుల వరకు వెళ్లింది.వివరాల్లోకి వెళ్తే, ఎర్రిపల్లెలోని పోలింగ్ కేంద్రం వద్దకు పెద్ద సంఖ్యలో వైసీపీ కార్యకర్తలు చేరుకున్నారు. వారు పోలింగ్ బూత్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించగా, విధుల్లో ఉన్న పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఇదే సమయంలో అక్కడున్న టీడీపీ శ్రేణులకు, వైసీపీ కార్యకర్తలకు మధ్య తీవ్ర వాగ్వాదం మొదలైంది.చూస్తుండగానే మాటల యుద్ధం ముదిరి, ఇరు వర్గాలు ఒకరిపై ఒకరు దాడులకు దిగాయి. పెట్రోల్ బాంబులు, రాళ్లు విసురుకోవడంతో అక్కడ భయానక వాతావరణం నెలకొంది. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు ఇరు వర్గాలను చెదరగొట్టారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు పునరావృతం కాకుండా పోలింగ్ కేంద్రం వద్ద భారీగా బలగాలను మోహరించి, కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. ఈ ఘటనతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న పోలింగ్‌పై ఆందోళన నెలకొంది.

మైలవరంలో ఎన్నికలను బహిష్కరించిన వైసీపీ అభ్యర్థి



ఆంధ్రప్రదేశ్‌లో పరిషత్ ఎన్నికల పోలింగ్ జరుగుతున్న వేళ, ఎన్టీఆర్ జిల్లాలో అధికార వైసీపీకి ఊహించని షాక్ తగిలింది. మైలవరం నియోజకవర్గంలోని నాగలూరులో వైసీపీ అభ్యర్థి ఏకంగా ఎన్నికలనే బహిష్కరిస్తున్నట్లు ప్రకటించడం స్థానికంగా కలకలం రేపింది. మంత్రి జోగి రమేష్, మండల స్థాయి నాయకుల నుంచి తనకు ఎలాంటి సహకారం అందడం లేదని ఆరోపిస్తూ ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు.వివరాల్లోకి వెళితే, రాష్ట్రవ్యాప్తంగా జిల్లా పరిషత్, మండల పరిషత్ స్థానాలకు గురువారం ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ ప్రారంభమైంది. ఈ క్రమంలో నాగలూరు వైసీపీ అభ్యర్థి, తన గ్రామ పార్టీ వాట్సాప్ గ్రూపులో ఎన్నికలను బహిష్కరిస్తున్నట్లు ఓ సందేశం పెట్టారు. స్థానిక నేతల నుంచి మద్దతు కొరవడటంతోనే తాను బరి నుంచి తప్పుకుంటున్నట్లు స్పష్టం చేశారు. ఈ పరిణామం నియోజకవర్గ వైసీపీ శ్రేణుల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కీలకమైన ఎన్నికల సమయంలో సొంత పార్టీ అభ్యర్థే బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేయడం వైసీపీకి ఇబ్బందికరంగా మారింది.మరోవైపు, రాష్ట్రవ్యాప్తంగా జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు జరుగుతున్న ఈ ఎన్నికల పోలింగ్ సాయంత్రం 5 గంటల వరకు కొనసాగనుంది. గ్రామీణ ప్రాంతాల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు.

కూటమి బలాన్ని తట్టుకుని పోరాడాం: జీవీఎంసీ ఓటమిపై వరుదు కల్యాణి



విశాఖ మేయర్ ఎన్నికల్లో కూటమి విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఈ ఓటమి అనంతరం వైసీపీ అభ్యర్థి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి స్పందించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు తమకు ఓటు వేసిన ప్రజలకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. అదే సమయంలో, నూతన మేయర్‌గా ఎన్నికైన కూటమి అభ్యర్థి ముక్కా శ్రావణికి అభినందనలు తెలియజేశారు.అధికారం, డబ్బు, మూడు పార్టీల కూటమి బలాన్ని తట్టుకుని వైసీపీ శ్రేణులు వీరోచితంగా పోరాడాయని కొనియాడారు. ఎన్నికల్లో విజయం సాధించలేకపోయినా, విశాఖ ప్రజల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నామని పేర్కొన్నారు. తమపై నమ్మకంతో ఓటేసిన సుమారు 3.40 లక్షల మంది ప్రజలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.నూతన పాలకవర్గానికి ఆమె కీలక సూచన చేశారు. విశాఖ ప్రజల కష్టార్జితమైన రూ. 1,700 కోట్ల జీవీఎంసీ నిధులను దారి మళ్లించారని, కొత్త పాలకవర్గం తమ అధికారాన్ని ఉపయోగించి ఆ నిధులను తిరిగి జీవీఎంసీకి రప్పించాలని కోరారు. ఆ నిధులతో నగరంలో మౌలిక వసతులు కల్పించాలని సూచించారు.గెలుపోటములతో సంబంధం లేకుండా నిరంతరం ప్రజాక్షేత్రంలోనే ఉంటానని వరుదు కల్యాణి స్పష్టం చేశారు. ఎమ్మెల్సీగా, పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలిగా ప్రజల హక్కుల కోసం, ముఖ్యంగా మహిళలపై జరిగే అరాచకాలపై ప్రభుత్వాన్ని నిలదీస్తానని తెలిపారు. 2029 ఎన్నికల్లో విశాఖలో వైసీపీ జెండా ఎగరేయడమే లక్ష్యంగా ఇప్పటి నుంచే అందరం కలిసికట్టుగా పనిచేయాలని పార్టీ శ్రేణులకు ఆమె పిలుపునిచ్చారు.

చెన్నైలో వివాహ వేడుకకు హాజరైన వైయస్ జగన్ దంపతులు

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి, ఆయన సతీమణి వైయస్ భారతి చెన్నైలోని లీలా ప్యాలెస్ హోటల్‌లో జరిగిన వైయస్ అనిల్ రెడ్డి కుమార్తె శ్రేయ వివాహ వేడుకకు హాజరయ్యారు.ఈ సందర్భంగా నూతన వధూవరులు శ్రేయ--ఉజ్వల్‌లను వైయస్ జగన్ దంపతులు ఆశీర్వదించి, హృదయపూర్వక వివాహ శుభాకాంక్షలు తెలిపారు. నూతన దంపతులు సుఖసంతోషాలతో, ఆనందమయమైన దాంపత్య జీవితాన్ని గడపాలని ఆకాంక్షించారు.ఈ వివాహ వేడుకలో తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్, ప్రముఖ పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, శ్రీమతి వైయస్ విజయమ్మతో పాటు పలువురు రాజకీయ, వ్యాపార రంగ ప్రముఖులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



కాక్రోచ్ నేతలకు అమెరికా నిధులు, పాకిస్తాన్ సంబంధాలు- కేంద్రం సంచలన ఆరోపణలు

భారత్ లో నీట్ అక్రమాలపై, ఆ తర్వాత ఎన్నికల కమిషన్ అక్రమాలపై పలు ఉద్యమాలు చేసిన కాక్రోచ్ జనతా పార్టీ నేతలపై ఇవాళ కేంద్రం సంచలన ఆరోపణలు చేసింది. సీజేపీ జాతీయ కన్వీనర్ అభిజీత్ దిప్కేతో పాటు మరో నేత అశుతోష్ రాంకాను టార్గెట్ చేసుకుని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ ఈ ఆరోపణలు చేశారు. వీరిలో అభిజీత్ దిప్కేకు అమెరికా నుంచి నిధులు అందుతున్నాయని, అశుతోష్ రాంకాకు పాకిస్తాన్ తో సంబంధాలు ఉన్నాయని ఆరోపించారు. అనధికారిక వనరుల నుండి, దేశంలోని, దేశం వెలుపల ఉన్న భారత్ వ్యతిరేక ఎన్జీవోలు, భారత్ వ్యతిరేక సంస్థల నుండి వారికి నిధులు అందుతున్నాయని చూపించడానికి తగినన్ని సాక్ష్యాలు ఉన్నాయని జితేంద్ర సింగ్ ఆరోపించారు. విదేశీ నిధులతో నడిచే ఎన్జీవోలు, డీప్ స్టేట్ ఆపరేటివ్‌లు, భారత్ వ్యతిరేక శక్తులు వీళ్లను నడిపిస్తున్నాయని ఆయన తెలిపారు. అభిజీత్ దిప్కేకు అమెరికాలో ఉన్న దాతల నుండి నిధులు అందుతున్నాయని ఆయన ఆరోపించారు. అలాగే అశుతోష్ రాంకాకు పాకిస్థానీ రాజకీయ నాయకుల నుండి డబ్బులు అందాయని పేర్కొన్నారు. కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ వ్యాఖ్యలపై సీజేపీ తీవ్రంగా స్పందించింది. ఆయన ఆరోపణలను తిరస్కరించడమే కాకుండా, ఉన్నత రాజ్యాంగ, రాజకీయ పదవులలో ఉన్నవారు చేసే ప్రకటనల విశ్వసనీయతను కూడా ప్రశ్నించింది. ఇదే సిగ్గుచేటైన వాస్తవమని ట్వీట్ చేసింది. ఒక కేంద్ర మంత్రి ఏమైనా మాట్లాడవచ్చు, ఎటువంటి పరిణామాలు లేకుండా తప్పించుకోగలడని తెలిపింది.అందుకే, అత్యున్నత పదవుల్లో ఉన్న వ్యక్తులు పలికే మాటలకు కూడా ఇవాళ ఏమాత్రం విలువ లేదని సీజేపీ వ్యాఖ్యానించింది. తనకు పాకిస్తాన్ రాజకీయ నేతల నుంచి నిధులు అందుతున్నట్లు కేంద్రమంత్రి చేసిన ఆరోపణలపై అశుతోష్ రాంకా వ్యంగంగా స్పందించారు. పేపర్ లీక్ చేసింది, సూక్ష్మ నాశనం చేసింది, ఓట్ల చోరీ చేసిందీ, నిరుద్యోగుల్ని తయారు చేసిందీ పాకిస్తానే అంటూ ట్వీట్ చేశారు.



సీజేపీకి విదేశీ నిధులు.. దేశంలో అశాంతికి కుట్ర: కేంద్రం సంచలన ఆరోపణలు

దేశంలో అశాంతిని రెచ్చగొట్టేందుకు 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ), దాని కీలక సభ్యులు విదేశీ లాభాపేక్ష లేని సంస్థలు, శత్రు నెట్‌వర్క్‌ల నుంచి అక్రమంగా నిధులు పొందుతున్నారని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ సంచలన ఆరోపణలు చేశారు. ఈ ఆరోపణలతో దేశ రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది.బెంగళూరులో విలేకరులతో మాట్లాడిన జితేంద్ర సింగ్, సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే, వ్యూహకర్త అశుతోష్ రాంకాలకు విదేశీ నిధులు అందించే సంస్థలతో సంబంధాలున్నాయని చెప్పడానికి తమ వద్ద పక్కా ఆధారాలున్నాయని స్పష్టం చేశారు. "వారికి అనధికారిక మార్గాల ద్వారా, దేశ వ్యతిరేక ఎన్జీఓల నుంచి, దేశంలో, విదేశాల్లో ఉన్న భారత వ్యతిరేక సంస్థల నుంచి నిధులు అందుతున్నాయని చెప్పడానికి తగిన ఆధారాలున్నాయి.

అభిజీత్ దీప్కేకు అమెరికాకు చెందిన దాతల నుంచి, అశుతోష్ రాంకాకు పాకిస్తానీ రాజకీయ నాయకుల నుంచి డబ్బు అందుతోంది" అని సింగ్ వివరించారు.ఈ ఆరోపణలకు బలం చేకూరుస్తూ బీజేపీ అధికార ప్రతినిధి తుహిన్ ఎ సిన్హా కూడా సీజేపీపై తీవ్ర విమర్శలు చేశారు. పందుగల సీజన్‌లో దేశ రాజధానిలో గందరగోళం సృష్టించేందుకే సీజేపీ ఇటీవలి నిరసనలను చేపట్టిందని ఆయన ఆరోపించారు. 'ఎన్డీటీవీ'తో మాట్లాడుతూ.. "గత నెల రోజులుగా సీజేపీ ఎత్తుగడలన్నీ తిరుగుబాటును సృష్టించడానికే. పండుగ సమయంలో దేశ రాజధానిలో అరాచకాన్ని సృష్టించడమే వారి దురుద్దేశం" అని అన్నారు. సీజేపీ, కాంగ్రెస్ పార్టీ రెండూ న్యాయవ్యవస్థను లక్ష్యంగా చేసుకున్నాయని, రాహుల్ గాంధీ సుప్రీంకోర్టుకు వెళ్లడం వంటి చర్యలు దీనికి నిదర్శనమని సిన్హా పేర్కొన్నారు.ఈ రాజకీయ ఆరోపణల నేపథ్యంలో ఢిల్లీ పోలీసుల క్రైమ్ బ్రాంచ్.. సీజేపీ ప్రతినిధులు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలను ఈరోజు విచారణకు హాజరు కావాలని సమన్లు జారీ చేసింది. నిషేధాజ్ఞలను ఉల్లంఘించడం, అనుమతి లేకుండా జంతర్ మంతర్‌లోకి ప్రవేశించడం, ఇతరుల ఆస్తిలోకి అతిక్రమించి వెళ్లడం వంటి ఆరోపణలపై వారిని ప్రశ్నించనున్నారు.అక్టోబర్ 10న సౌరవ్ దాస్, రాంకాలను ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఏడాది పాటు శాంతికి భంగం కలిగించబోమని రూ. 50,000 శాంతి బాండ్‌పై సంతకం చేశాక వారిని విడుదల చేశారు. అయితే, కేవలం 72 గంటల్లోనే, అక్టోబర్ 13న వారు పోలీసు బారికేడ్లను దాటి జంతర్ మంతర్‌లోకి ప్రవేశించి, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని నినాదాలు చేశారు.మరోవైపు, ప్రతిపక్షాలు కేంద్రం చేస్తున్న 'విదేశీ హస్తం' ఆరోపణలను తీవ్రంగా ఖండించాయి. కర్ణాటక హోం మంత్రి ప్రియాంక్ ఖర్గే మాట్లాడుతూ.. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, విదేశాంగ మంత్రి జైశంకర్, ఐబీ, రా వంటి సంస్థలు ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం వారి అసమర్థతను చూపిస్తోందని ఎద్దేవా చేశారు. "కాంగ్రెస్‌కు విదేశీ సంస్థల నుంచి నిధులు వస్తున్నాయని బీజేపీ చెబుతోంది, కానీ ఒక్క ఆధారం కూడా చూపలేకపోతోంది. ఐబీ, రా ఏం చేస్తున్నాయి? ఏ ప్రాతిపదికన ఈ వ్యాఖ్యలు చేస్తున్నారు?" అని ఆయన ప్రశ్నించారు. ప్రధాని మోదీతో బహిరంగ చర్చకు రాహుల్ గాంధీ విసిరిన సవాల్‌కు మద్దతు తెలిపిన ఖర్గే, కాంగ్రెస్, బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ల నిధులపై ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ఆధ్వర్యంలో చర్చ జరగాలని సూచించారు.

"ఒక్క ఎమ్మెల్యేకు రూ.70 కోట్లు ఇస్తామంటున్నారు"

డీఎంకే, ఏఐఏడీఎంకేలపై టీవీకే మంత్రి సంచలన ఆరోపణలు

తమిళనాడు రాష్ట్రంలో తీవ్ర రాజకీయ ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. ద్రవిడ రాజకీయ ఆధిపత్యానికి తెరదించుతూ అధికారంలోకి వచ్చిన తమిళనాడు వెట్రి కజగం (టీవీకే) ప్రభుత్వాన్ని కూల్చేందుకు ప్రత్యర్థి పార్టీలు తెరవెనుక భారీ కుట్రలు పన్నుతున్నాయనే ఆరోపణలు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. టీవీకే ప్రభుత్వానికి చెందిన శాసన సభ్యులను ప్రలోభపెట్టి, పార్టీ ఫిరాయించేలా చేసేందుకు డీఎంకే,ఏఐఏడీఎంకే వర్గాలు ప్రయత్నిస్తున్నాయని రాష్ట్ర మంత్రి నిర్మల్ కుమార్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఒక్క ఎమ్మెల్యేకు రూ.60 కోట్ల నుంచి రూ.70 కోట్లు ఇస్తామంటున్నారని చెప్పారు. ఈ అక్రమ ప్రయత్నాలలో భాగంగానే కొద్ది రోజుల క్రితం కరూర్ ప్రాంతానికి చెందిన కొందరు కీలక వ్యక్తులతో పాటు మరికొందరిని పోలీసులు అరెస్టు చేశారని ఆయన గుర్తు చేశారు.ప్రధాన ప్రతిపక్షాలు ఒక్కో ఎమ్మెల్యేకు రూ. 60 నుంచి రూ. 70 కోట్ల వరకు భారీ మొత్తంలో నగదును ఆఫర్ చేస్తున్నాయని మంత్రి ఆరోపించారు. అయితే ప్రతిపక్షాల ఎన్ని కుట్రలు పన్నినా, ఎలాంటి ప్రలోభాలకు గురిచేసినా టీవీకే శాసనసభ్యులు ఎవరూ పార్టీ మారే ప్రసక్తే లేదని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గతంలో కూడా ఓ అవిశ్వాస తీర్మానం సమయంలో ఒక టీవీకే ఎమ్మెల్యేకు రూ. 35 కోట్లు ఆఫర్ చేసిన కేసులో పోల్ స్ట్రెస్టర్‌తో పాటు ఎనిమిది మందిని పోలీసులు అరెస్టు చేసిన ఉదంతాన్ని ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఆ కేసులో ఒక మాజీ మంత్రి బంధువు ప్రమేయం ఉండటం తమిళనాడు రాజకీయాల్లో ఎంతటి కలకలం రేపిందో తెలిసిందే.మరోవైపు అధికార పార్టీ చేసిన ఈ సంచలన ఆరోపణలను డీఎంకే, ఏఐఏడీఎంకే, బీజేపీ పార్టీలు



పూర్తిగా ఖండించాయి. డీఎంకే అధికార ప్రతినిధి స్పందిస్తూ.. టీవీకే శాసనసభ్యులను కొనుగోలు చేయాల్సిన అవసరం తమకు ఏమాత్రం లేదని తోసిపుచ్చారు. పైగా ఎన్నికల ఫలితాల తర్వాత వేర్వేరు పార్టీల నుంచి వలసలను ప్రోత్సహిస్తూ అధ్వగోలు రాజకీయాలు చేస్తోంది అధికార పక్షమేనని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల అనంతరం ఏడుగురు ఏఐఏడీఎంకే ఎమ్మెల్యేలు తమ పదవులకు రాజీనామా చేసి టీవీకేలో చేరడాన్ని డీఎంకే ఈ సందర్భంగా గుర్తుచేసింది. ఇలాంటి రాజకీయ ఒడుపుల వల్లే మైనారిటీ ప్రభుత్వం నెట్టుకొస్తోందని విమర్శలు గుప్పించింది.ప్రస్తుత రాజకీయ పరిణామాల నేపథ్యంలో రాబోయే నవంబర్ 13వ తేదీ రాష్ట్ర రాజకీయాల్లో కీలకంగా మారింది. సరిగ్గా ఆరోజకు టీవీకే ప్రభుత్వం అసెంబ్లీలో మెజారిటీ నిరూపించుకుని ఆరు నెలలు పూర్తవుతాయి. దీనివల్ల మళ్లీ మరోసారి బలపరీక్ష లేదా విశ్వాస తీర్మానం ప్రవేశపెట్టే అవకాశాలు ఉండటంతో రాజకీయ పక్షాల మధ్య పోరు తారస్థాయికి చేరింది. మొత్తం 234 స్థానాలు ఉన్న తమిళనాడు శాసనసభలో సాధారణ బహుమతికి అవసరమైన 128 స్థానాల మ్యాజిక్ ఫిగర్ కంటే టీవీకే ప్రస్తుతం 109 సీట్లతో కాస్త వెనుకబడి ఉంది. అయితే, కాంగ్రెస్, వీసీకే, ఐయూఎంఎల్ పార్టీల మద్దతుతో పాటు సీపీఐ, సీపీఎం పార్టీల బయటి మద్దతుతో ప్రభుత్వాన్ని కొనసాగిస్తోంది.దశాబ్దాలుగా రాష్ట్రంలో చక్రం తిప్పిన డీఎంకే, ఏఐఏడీఎంకేలు అధికారానికి దూరమవడం, కాంగ్రెస్ పార్టీ సైతం టీవీకే కూటమి వైపు మొగ్గు చూపడం తమిళనాడు రాజకీయ సమీకరణాలను పూర్తిగా మార్చేశాయి. రాబోయే కాలంలో ఈ కొత్త కూటమి తమ రాజకీయ భవిష్యత్తుకు పెద్ద ముప్పుగా మారుతుందని జాతీయ పార్టీలు సైతం ఆందోళన చెందుతున్నాయి. ఏదేమైనప్పటికీ, కోట్ల రూపాయల ఆఫర్లు, ఫిరాయింపుల ఆరోపణల నడుమ తమిళనాడు రాజకీయం వేడెక్కడం గమనించదగ్గ పరిణామం.

"కాంగ్రెస్ ఎంపీల సంఖ్య పెరగాలంటే ఇలా చేయాలి".. రాహుల్‌కు కేంద్రమంత్రి 7 సలహాలు



లోక్‌సభలో ప్రధాని నరేంద్ర మోదీతో బహిరంగ చర్చకు సిద్ధమంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ సవాల్ విసురుతుంటే.. కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు తనదైన శైలిలో స్పందించారు. కాంగ్రెస్‌కు పార్లమెంటులో మరిన్ని స్థానాలు కావాలంటే రాహుల్‌గాంధీ ఏడు విషయాల్లో మార్పులు చేసుకోవాలని సూచించారు. తరచూ రహస్యంగా విదేశీ పర్యటనలకు వెళ్లడం మానుకోవాలని, సీనియర్లను గౌరవించాలని హితవు పలికారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు పెట్టారు.రాహుల్‌గాంధీ తరచూ విదేశీ పర్యటనలకు వెళ్లకుండా భారత్‌లో ఎక్కువ సమయం గడపాలని రిజిజు సూచించారు. సీనియర్ నేతలను గౌరవిస్తూ వారి అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకోవాలన్నారు. భారత్‌కు వ్యతిరేకంగా వ్యవహరించే వ్యక్తులను కలవకూడదని, వారి ఎజెండాను ప్రోత్సహించకూడదని పేర్కొన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్, ప్రధాని మోదీపై వ్యతిరేకత తగ్గించుకోవాలని సూచించారు. బీజేపీని రాజకీయ ప్రత్యర్థిగా చూడాలే తప్ప శత్రువుగా భావించకూడదన్నారు.పార్లమెంటు కార్యకలాపాలను మరింత సీరియస్‌గా తీసుకోవాలని, కాంగ్రెస్ ఎంపీలకు చర్చల్లో పాల్గొనే అవకాశం కల్పించాలని పేర్కొన్నారు. భారత రాజ్యాంగాన్ని, రాజ్యాంగబద్ధ సంస్థలను గౌరవించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రజాస్వామ్యబద్ధంగా పనిచేయాలని, కుటుంబ రాజకీయాలకు ముగింపు పలకాలని ఏడో సూచనగా పేర్కొన్నారు.అంతకుముందు పార్లమెంటులో విపక్ష సభ్యులు వాకౌట్ చేసిన పాత వీడియోను రిజిజు ఎక్స్‌లో పంచుకున్నారు. చర్చలు, వాదోపవాదాల కోసమే పార్లమెంటు ఉందని పేర్కొన్నారు. చర్చల్లో పాల్గొనడానికి ఇష్టపడనివారే ఇప్పుడు బహిరంగ చర్చ గురించి మాట్లాడుతున్నారని విమర్శించారు.ప్రధాని మోదీతో బహిరంగ చర్చకు సిద్ధమంటూ రాహుల్‌గాంధీ బుధవారం మరోసారి సవాల్ విసిరారు. ఐదు నిమిషాల్లోనే ప్రధాని దేశద్రోహి అని నిరూపిస్తానంటూ వ్యాఖ్యానించారు. దీనిపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తీవ్రంగా స్పందించారు. అంతకుముందు కూడా ప్రతిపక్షాన్ని దేశ వ్యతిరేక శక్తులుగా చిత్రీకరిస్తున్నారంటూ మోదీపై రాహుల్ విమర్శలు చేశారు. ఈ క్రమంలో ఇరుపక్షాల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది.

బీజేపీకి మిత్రుల షాకులు- యూపీలో పోటీకి బీహారీలు- వ్యతిరేకిస్తున్న యూపీ ఫ్రెండ్



దేశంలోనే అతిపెద్ద రాష్ట్రమైన ఉత్తర్ ప్రదేశ్ లో వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధమవుతున్న బీజేపీకి యూపీతో పాటు బీహార్ లోని మిత్రులు షాకులిస్తున్నారు. ముఖ్యంగా బీహార్ ఎన్నికల్లో బీజేపీ విజయంలో కీలకమైన నితీష్ కుమార్ జేడీయూ, చిరాగ్ పాశ్వాన్ లోక్ జన్ శక్తి పార్టీలు.. ఇప్పుడు యూపీ ఎన్నికల్లో పోటీ చేయడం ద్వారా తమ పార్టీల్ని విస్తరించుకునే పనిలో ఉన్నాయి. అయితే యూపీలో బీజేపీ మిత్రపక్షం, ఓం ప్రకాష్ రాజ్ భర్ కు చెందిన సుహేల్ దేవ్ భారతీయ సమాజ్ పార్టీ దీన్ని వ్యతిరేకిస్తోంది. దీంతో ఈ ప్రభావం ఎన్నికల ఫలితాలపై పడకుండా చూసుకోవడం బీజేపీకి సవాలుగా మారుతోంది.బీహార్ ఎన్నికల్లో బీజేపీ విజయం వెనుక జేడీయూ, ఎల్జేపీ కీలకంగా ఉన్నాయి. స్థానిక రాజకీయ, సామాజిక సమీకరణాల్లో భాగంగా ఈ రెండు పార్టీల్ని చేరదీసి, పలుమార్లు ఎన్నికల్లో లబ్ధి పొందిన బీజేపీ.. ఇప్పుడు అవే పార్టీలు యూపీలో ఎంట్రీ ఇస్తామంటే మాత్రం అవుననలేక, కాదనేక సతమతం అవుతోంది. అదే సమయంలో యూపీలో బీజేపీ మిత్రపక్షంగా ఉన్న ఎన్డీయే పార్టీ సుహేల్ దేవ్ పార్టీ వీరిద్దరి ఎంట్రీని తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. దీని వెనుక మరో కీలక కారణం కూడా ఉంది. గత బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమిలో ఉన్న బీజేపీ, జేడీయూ, లోక్ జన్ శక్తి.. ఇదే సుహేల్ దేవ్ పార్టీని కూటమిలో చేర్చుకునేందుకు ఒప్పుకోలేదు. దీంతో ఒంటరిగా పోటీ చేయాల్సి వచ్చింది. ఇప్పుడు యూపీలో మాత్రం జేడీయూ, లోక్ జన్ శక్తి పార్టీలు ఎన్డీయే కూటమిలో చేరి పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నాయి. దీంతో వీరిద్దరి ఎంట్రీని వ్యతిరేకిస్తున్న ఓం ప్రకాష్ రాజ్ భర్ పార్టీ.. ఇదే అదనుగా తమకు మరిన్ని సీట్లు ఇవ్వాలని బీజేపీపై ఒత్తిడి పెంచేందుకు ప్లాన్ చేసుకుంటోంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే కూటమిలో ఉన్న యూపీ మిత్రపక్ష పార్టీలతో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ సమావేశం ఏర్పాటు చేశారు. ఇందులో ఆయన ఇచ్చే క్లారిటీని బట్టి సుహేల్ దేవ్ పార్టీ రాజకీయాలు ఆధారపడి ఉంటాయి. అయితే జేడీయూ సంగతి ఎలా ఉన్న చిరాగ్ పాశ్వాన్ దళిత పార్టీ లోక్ జన్ శక్తిని యూపీలో తమతో కలిసి పోటీ చేసేందుకు బీజేపీ అనుమతించే అవకాశముంది. దీని వెనుక మధ్య యూపీతో పాటు పూర్వాంచల్ ప్రాంతాల్లో ఉన్న పాశ్వాన్ ల జనాభాయే కారణం.

భార్యపై కక్షతో కుటుంబంలోని ఏడుగురి హత్య

కుటుంబ కలహాలు ఏడుగురి ప్రాణాలను బలిగొన్నాయి. భార్యతో తరచూ గొడవలు పడుతున్న ఓ క్యాబ్ డ్రైవర్.. ఆమె కుటుంబంపై కక్ష పెంచుకుని ఏకంగా ఏడుగురిని హతమార్చాడు. పోలీసుల కథనం ప్రకారం.. భార్యతో పాటు అత్త, ఇద్దరు బావమరుదులు, వారి భార్యలు, ఏడేళ్ల బాలుడిని కూడా వదలకుండా కిరాతకంగా చంపాడు. ఈ దారుణ ఘటన బెంగళూరులో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నిందితుడు ఇందుశేఖర్‌ను రాజాజీనగర్ పోలీసులు అరెస్టు చేశారు.ఇందుశేఖర్‌కు సునీతతో సుమారు 20 ఏళ్ల క్రితం వివాహమైంది. అయితే సునీత తన పుట్టింటి వారితో సన్నిహితంగా ఉండటం నిందితుడికి నచ్చేది కాదు. ఈ విషయంపై భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవి. సునీతకు ఆమె తల్లి, సోదరులు అండగా నిలవడంతో వారిపై కూడా ఇందుశేఖర్ ద్వేషం పెంచుకున్నాడు. ఈ క్రమంలోనే ఏడుగురిని అంతమొందించేందుకు ముందుగానే పథకం వేశాడు.మొదట తన ఇంట్లోనే భార్య సునీతను రోకలిబండతో కొట్టి చంపాడు. ఆ తర్వాత ఆమె స్నేహితులతో కలిసి విహారయాత్రకు వెళ్లిందని కుటుంబ సభ్యులను నమ్మించాడు. అనంతరం మధ్యం తాగుదామంటూ బావమరుదులు శివకుమార్, శంకర్‌లను ఇంటికి పిలిచి హత్య చేశాడు. వారి భార్యలు దివ్య, నళినితో పాటు అత్త రూపావతిని, ఏడేళ్ల మనవడు పునీత్‌ను కూడా హతమార్చినట్లు నిందితుడిపై ఆరోపణలు ఉన్నాయి.నళిని కనిపించకుండా పోవడంతో ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దర్యాప్తులో ఇందుశేఖర్ పొంతనలేని సమాధానాలు చెప్పడంతో పోలీసులకు అనుమానం వచ్చింది. అతడి ఇంట్లో లభించిన ఆధారాలతో విచారించగా హత్యల విషయం బయటపడింది.మృతదేహాలను నంది హిల్స్ పరిసర ప్రాంతాల్లో వేర్వేరు చోట్ల పడేసినట్లు నిందితుడు చెప్పడంతో పోలీసులు అక్కడ గాలింపు చేపట్టారు. గురువారం దాదాపు నాలుగు గంటలపాటు వెతికి ఏడేళ్ల పునీత్ మృతదేహాన్ని చిక్‌బళ్లాపూర్ జిల్లాలో గుర్తించారు. మిగిలిన ఆరుగురి మృతదేహాల కోసం గాలిస్తున్నారు. హత్యలకు ఉపయోగించిన రోకలిబండను కడిగేసినట్లు, ఇంట్లో రక్తపు మరకలను శుభ్రం చేసినట్లు పోలీసులు గుర్తించారు. మృతదేహాలను తరలించేందుకు ఉపయోగించిన కారును స్వాధీనం చేసుకున్నారు.నిందితుడు 'తానా వరది' పేరుతో ఓ పత్రికను నడుపుతున్నట్లు పోలీసులు తెలిపారు. గత ఎనిమిదేళ్లుగా భాష్యం సర్కిల్ సమీపంలోని అద్దె ఇంట్లో ఉంటున్నాడు. ఇంటి యజమానితో ఉన్న వివాదం కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు. వెస్ట్ డివిజన్ జాయింట్ కమిషనర్ వంశీకృష్ణ, నార్త్ డివిజన్ డీసీపీ నేమగౌడ పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలు ఆధారాలు సేకరిస్తున్నాయి.

భారత్‌లో విదేశీయులకు పాస్‌పోర్ట్, వీసా నిబంధనలు సడలింపు.. కేంద్రం ఉత్తర్వులు



భారత్‌లో నివసిస్తున్న పలు కేటగిరీలకు చెందిన విదేశీ పౌరులకు కేంద్ర ప్రభుత్వం భారీ ఊరట కల్పించింది. పాకిస్థానీ పౌరులు, శ్రీలంక తమిళులు, టిబెటన్లు, మైనారిటీ శరణార్థుల సహా పలువురికి పాస్‌పోర్ట్, వీసా నిబంధనలను సడలిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించిన 'ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారినర్స్ (మినహాయింపు) (సవరణ) ఆర్డర్-2026'ను గెజిట్‌లో ప్రచురించింది.తాజా నిబంధనల ప్రకారం.. శాశ్వతంగా స్థిరపడే ఉద్దేశంతో 2009 డిసెంబర్ 31 లేదా అంతకుముందు భారత్‌కు వచ్చిన పాకిస్థాన్ పౌరులకు పాస్‌పోర్ట్ పునరుద్ధరణ నుంచి మినహాయింపు ఇచ్చారు. పాకిస్థాన్ జారీ చేసే కంప్యూటరైజ్డ్ జాతీయ గుర్తింపు కార్డు లేని కారణంగా పాస్‌పోర్ట్‌ను పునరుద్ధరించుకోలేని వారికి ఈ వెసులుబాటు కల్పించారు. అయితే, వీరంతా భారత్‌లో నివాసం కొనసాగించడానికి తప్పనిసరిగా సరైన వీసా పొందాల్సి ఉంటుంది.ఇదే తరహా మినహాయింపును మరికొందరికి కూడా వర్తింపజేశారు. దేశ విభజన తర్వాత పాకిస్థాన్‌కు వలస వెళ్లి, 2009 డిసెంబర్ 31 నాటికి భారత్‌కు తిరిగివచ్చి కేరళలో స్థిరపడిన కొందరు ముస్లిం పురుషులకు ఈ సడలింపు వర్తిస్తుంది. అలాగే, మలేషియా లేదా సింగపూర్ పౌరసత్వం పొంది, ఆ దేశాల పాస్‌పోర్టులతో 2009 డిసెంబర్ 31 లోపు భారత్‌కు తిరిగి వచ్చిన భారత సంతతి వ్యక్తులకు కూడా ఇది వర్తిస్తుంది. వారి పాస్‌పోర్టుల గడువు ముగిసి, పునరుద్ధరణకు వీలులేని పక్షంలో ఈ మినహాయింపు లభిస్తుంది.వీరితో పాటు ఆఫ్ఘనిస్థాన్, బంగ్లాదేశ్, పాకిస్థాన్ నుంచి 2024 డిసెంబర్ 31 నాటికి భారత్‌లో ప్రవేశించిన హిందూ, సిక్కు, బౌద్ధ, జైన, పార్శీ, క్రిస్టియన్ వర్గాల వారికి కూడా పాస్‌పోర్ట్ నిబంధనల నుంచి మినహాయింపు ఇచ్చారు. చెల్లుబాటయ్యే పత్రాలు లేకుండా దేశంలోకి ప్రవేశించినా లేదా వారి పత్రాల గడువు ముగిసినా ఈ సడలింపు వర్తిస్తుంది. వీరు కూడా దేశంలోకి ప్రవేశించాక, ఇక్కడ నివసించడానికి వీసా తీసుకోవడం తప్పనిసరి.ఇదే ఉత్తర్వుల ప్రకారం 2015 జనవరి 9కి ముందు భారత్‌లో ఆశ్రయం పొందిన శ్రీలంక తమిళ శరణార్థులకు, భారత రాయబార కార్యాలయం జారీ చేసిన ప్రత్యేక ఎంట్రీ పర్మిట్లపై దేశంలోకి వచ్చిన టిబెటన్లకు కూడా పాస్‌పోర్ట్, వీసా నిబంధనల నుంచి మినహాయింపు కల్పించారు.మరోవైపు, భారత్, నేపాల్, భూటాన్ పౌరుల మధ్య ప్రయాణ నిబంధనలను కూడా ఈ ఉత్తర్వుల్లో సవరించారు. ఈ మూడు దేశాల పౌరులు తమ మధ్య భూమార్గంలో గానీ, విమాన మార్గంలో గానీ ప్రయాణించేటప్పుడు పాస్‌పోర్టుకు బదులుగా ప్రభుత్వం నిర్దేశించిన ఏదైనా గుర్తింపు పత్రం చూపిస్తే సరిపోతుంది. అయితే, నేపాల్, భూటాన్ పౌరులు చైనా, మకావు, హాంగ్‌కాంగ్ లేదా పాకిస్థాన్ మీదుగా ప్రయాణిస్తే మాత్రం తప్పనిసరిగా పాస్‌పోర్ట్‌తో పాటు వీసా కూడా కలిగి ఉండాలని స్పష్టం చేశారు.

'హే రామ్ సేవ్ ఆంధ్ర.. హే రామ్ సేవ్ డెమొక్రసీ' ... ఇవి ఎలక్షన్సా? లేక సెలక్షన్సా?

చంద్రబాబుగెల్చిఓడారు. మేంఓడి గెల్సాం...మొత్తం ఎన్నికల ప్రక్రియను హైజాక్ చేసిన చంద్రబాబు...ప్రభుత్వం. పోలీసులు, ఎస్ఈసీ కుమ్మక్కు...రాష్ట్రంలోనే కాదు.. దేశంలోనే ఎక్కడా జరిగి ఉండదు...రాత్రికి రాత్రే మారిన పోలింగ్ శాతాలు...సుప్రీంకోర్టు ఆదేశాలు సైతం ఎస్ఈసీ బేఖాతరు...సీసీకెమెరాలఏర్పాటు ఏమాత్రంసక్రమంగాలేదు...అధికార పార్టీఏజెంట్లుగామారినపోలీసులు...రాష్ట్రాన్ని 'సౌత్ బీహార్'లామార్చినచంద్రబాబు...వ్యవస్థీకృతంగా ప్రజాస్వామ్య వ్యవస్థనూ ఖూనీ చేయడమే : వైయస్ జగన్

విజయవాడ (స్వర్ణాంధ్రప్రతినిధి) : రాష్ట్రంలోనే కాదు.. దేశంలోనే ఎక్కడా లేని విధంగా స్థానిక ఎన్నికల్లో ప్రతి దశలోనూ అంతులేని అక్రమాలు చేసిన సీఎం చంద్రబాబు ఈ ఎన్నికల్లో గెల్చినా తాను ఓడినట్లే అని.. అదే తాము ఓడినా ప్రజల మనసులో గెల్చామని మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్మోహన్రెడ్డి స్పష్టం చేశారు. మొత్తం ఎన్నికల ప్రక్రియను చంద్రబాబు హైజాక్ చ్యేశారని, ఈ ప్రక్రియలో ప్రభుత్వం. పోలీసులు, ఎస్ఈసీ కుమ్మక్కయ్యారని.. ఇలా రాష్ట్రంలోనే కాదు.. దేశంలోనే ఎక్కడా జరిగి ఉండదని ఆయన గుర్తు చేశారు. ఎన్నికల్లో ప్రతి దశలోనూ యథేచ్ఛగా రిగ్గింగ్ చేశారన్న వైయస్ జగన్.. నామినేషన్ల రిగ్గింగ్. నామినేషన్ల స్క్రుటినీ రిగ్గింగ్. పోలింగ్ బూత్ల రిగ్గింగ్. పోలింగ్ స్ట్రైకింగ్ రిగ్గింగ్. పోలింగ్ పర్సంటేజ్ రిగ్గింగ్. రాత్రిపూట బ్యాలెట్ బాక్స్ల రిగ్గింగ్. ఎక్కడైనా తమ పార్టీ వాళ్లు గెలిస్తే ఫలితాల్లోనూ రిగ్గింగ్ చేశారని వెల్లడించారు. ఇన్ని అక్రమాలతో గెల్చిన చంద్రబాబు గొప్పగా మాటలు చెబుతుంటే, వాటిని భుజాన మోస్తూ ఎల్లో మీడియా ప్రచారం చేస్తోందని ఆక్షేపించారు. తమ హయాంలో 'సేఫ్ ఆంధ్రా' అనే పరిస్థితి ఉండగా, ఇప్పుడు 'సేవ్ ఆంధ్రా' అంటున్న పరిస్థితి వచ్చిందని, రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా దిగజారాయని, రాష్ట్రాన్ని సీఎం చంద్రబాబు 'దక్షిణాది బీహార్' (సౌత్ బీహార్)లా మార్చారని వైయస్ జగన్ అన్నారు ఇంకా తన స్వార్థం కోసం దారుణంగా దిగజారిన చంద్రబాబు రాష్ట్ర పరువుతో పాటు, ప్రజాస్వామ్యాన్ని ఘణంగా పెట్టారని.. ఇది కేవలం ఎన్నికల ప్రక్రియను ఖూనీ చేయడమే కాకుండా, ప్రజల ఓటు హక్కు, వారు ఎన్నికల్లో పోటీ చేసే హక్కులకూ భంగం కలిగించడమే అని చెప్పారు. అంతే కాకుండా ఒక వ్యవస్థీకృతంగా ప్రజాస్వామ్య వ్యవస్థనూ ఖూనీ చేయడమే అన్న ఆయన, ఇది చట్ట ప్రకారం హేయమైన నేరం అని ధ్వజమెత్తారు.



అన్నీ ఎదుర్కొని నిలబడిన పార్టీ నాయకులు, కార్యకర్తలు

వారందరికీ సెల్యూట్ చెప్పిన శ్రీ వైయస్ జగన్, అన్యాయం జరిగితే ప్రశ్నించడం, ఫిర్యాదు చేయడమూ నేరమా? అని ప్రశ్నించారు. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేసినా కేసులు పెడతారా? అని నిలదీసిన ఆయన, కేసులతో తమను అడ్డుకోలేరని, అన్నీ సమర్థంగా ఎదుర్కొంటామని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన శ్రీ వైయస్ జగన్ తేల్చి చెప్పారు.

ఎన్నికల సూత్రమే ఏకంగా హైజాక్...అసలు ఇవి ఎలక్షన్సా? లేక సెలక్షన్సా?:

రాష్ట్రంలో స్థానిక ఎన్నికల నిర్వహణ అత్యంత దారుణం. ప్రతి చోటా యథేచ్ఛగా అధికార దుర్వినియోగం. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరిని కోరుతున్నాను. ఈ ఎన్నికల ప్రక్రియపై ఆలోచించమని విజ్ఞప్తి చేస్తున్నాను. రాష్ట్ర చరిత్రలోనే కాదు. దేశ చరిత్రలోనే ఇలా ఎప్పుడూ జరిగి ఉండదు. చంద్రబాబు జరిపించిన ఈ ఎన్నికలను అసలు ఎన్నికలు అంటారా?ప్రజాస్వామ్యంలో ప్రజలకు ఉన్న హక్కు, స్వేచ్ఛాయుత ఎన్నికలు. ఈ సూత్రాన్నే మొత్తంగా హైజాక్ చేసిన ఎన్నికలు ఇవి. ఇలాంటి ఎన్నికలను నిజంగా ఎన్నికలు అనగలమా? అని ప్రతి ఒక్కరూ ఆలోచించాలి. పూర్వం శకుని మాయా పాచికల గురించి విన్నాం. వాటి వల్ల ఏకంగా కురుక్షేత్ర యుద్ధం జరిగింది. ఈరోజు కూడా శకుని మాయ పాచికలు మాదిరిగానే.. అధికారం, రౌడీయిజమ్తో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ, జరిగే వాటిని ఎన్నికలు అంటారా? అసలు ఇవి ఎన్నికలా? లేక సెలక్షన్సా?.

ప్రజాస్వామ్యం ఖూనీ:

ఇదే చంద్రబాబునాయుడుగారిని అడుగుతున్నా. ఇలా ఎన్నికలు జరిపించి, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి, రాబోయే తరాలకు ఒక చెడు సంప్రదాయం మొదలుపెట్టిన దయనీయ స్థితికి చంద్రబాబు చేరాడు.ఎందుకంటే, ఎన్నికల ముందు సూపర్సిక్స్, సూపర్సెవెన్ అన్నాడు. ఇంటింటికీ బాండ్లు పంపాడు. జూన్, 2024 నుంచి ఆ డబ్బులన్నీ మీకు వస్తాయని చెప్పాడు. కానీ, అధికారంలోకి వచ్చాక అవన్నీ మోసాలుగా మారాయి. చంద్రబాబు అలా ప్రజలకు వెన్నుపోటు పొడిచాడు. ఇప్పుడు ఆ బాండ్లు చూపి, ప్రజలు నిలదీస్తున్నారు. దీంతో చంద్రబాబునాయుడు నేరుగా ఎన్నికలకు వెళ్లడం లేదు. అందుకే ఎన్నికలను హైజాక్ చేసి, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నాడు. ఒకసారి గమనించమని కోరుతున్నా.

స్థానిక ఎన్నికల హైజాక్. క్రమం ఇలా:

చంద్రబాబు ఏ విధంగా మొత్తం ఎన్నికల ప్రక్రియను హైజాక్ చేశారనేది చూస్తే.. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించగానే, రాష్ట్ర వ్యాప్తంగా మా పార్టీ నాయకులను పోలీస్ స్టేషన్లకు పిలిపించి, బెదిరించడం, బైండోవర్ చేశారు. అందుకు పోలీసులను వాడుకున్నారు. టీడీపీ గుండాలతో పోలీసులు కలిసిపోయి, వారితో కుమ్మక్కై మా అభ్యర్థులను అసలు నామినేషన్లు వేయనివ్వలేదు. ఆ తర్వాత కూడా స్క్రుటినీ సమయంలో ఆర్వోలు నామినేషన్లలో పత్రాలు మాయం చేయడం, లేని కారణాలు చూపడం, చివరకు ఫోర్జరీ సంతకాలతో నామినేషన్లు తిరస్కరించారు.

ఆ తర్వాత బలవంతపు ఉపసంహరణలు.

సీఎం, డీజీపీ, కలెక్టర్లు, ఎస్పీలు, డీఎస్పీలు, అధికారులు, ఆర్వోలు అంతా ఒక మాఫియా ముఠాగా మారి, మొత్తం ఎన్నికలను తమ చేతుల్లోకి తీసుకున్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఈసీ) కూడా సీఎం తొత్తుగా మారింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ తన రిఫరీ పాత్ర పూర్తిగా మర్చిపోయారు. ఇవన్నీ చూస్తుంటే ప్రజాస్వామ్యంలో ఇప్పుడు సంస్కరణలు ఎంత అవసరం అన్నది తేటతెల్లం అవుతుంది.

కాళ్లు చేతులు కట్టేసి పోటీలోకి దిగమన్నారు:

ఇవి పార్టీ గుర్తుతో జరిగే ఎన్నికలు. రాష్ట్రంలో మాది మాత్రమే ఏకైక ప్రతిపక్షం. అయినా మాకు ఎన్నికల్లో స్వేచ్ఛగా పోటీ చేసే అవకాశం ఇవ్వలేదు. మున్సిపాలిటీల్లో 17 చోట్ల చైర్మన్ పదవులకు మా పార్టీ నుంచి నామినేషన్లు వేయనివ్వలేదు. మరో 5 చోట్ల, స్క్రుటినీలో మా అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరించారు. అంటే 22 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో నామినేషన్ల పర్వంలోనే పోటీ లేకుండా చేశారు. ఇలాంటి ప్రక్రియ ఎక్కడా జరిగి ఉండదు. ఎమ్మెల్యేలు, ఎంపీల ఎన్నికల్లో అయినా ఈ స్థాయిలో ఇన్ని తిరస్కరణలు ఉంటాయా?. కానీ, ఇక్కడ నామినేషన్ల పర్వంలోనే ఏకంగా 22 మున్సిపాలిటీల్లో చైర్మన్ పదవులకు పోటీ లేకుండా చేశారు. ఇంకా కొన్ని చోట్ల మా పార్టీ నుంచి అందరు అభ్యర్థులు పోటీలో లేకుండా చేశారు. కేవలం కొందరే ఆయా కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో పోటీలో ఉండేలా చేశారు. అంటే వారికి కూడా కాళ్లు, చేతులు కట్టి పోటీలోకి దిగమన్నారు. మా పులివెందులలోనే 40 వార్డుల్లో 20 వార్డుల్లో మాత్రమే పోటీ ఉండేలా చేశారు. చివరకు ఇంత తీవ్రంగా కాళ్లు చేతులు కట్టేసి, పోటీ జరిగేలా చేసిన తర్వాత కూడా పోలింగ్ రోజున, మా పార్టీ ఏజెంట్లను బూత్ల్లో కూర్చోనివ్వలేదు. చివరకు పోలీసులు కూడా కుమ్మక్కై మా పార్టీ ఏజెంట్లను రాకుండా చేసి, రిగ్గింగ్ చేశారు.

ప్రస్తుత పరిషత్ ఎన్నికల్లో పరిస్థితి చూస్తే..:

ఇక ఇప్పుడు (గురువారం) జరుగుతున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో కూడా 84 చోట్ల జడ్పీటీసీ ఎన్నికల్లో మేము పోటీలో లేకుండా చేశారు. అంటే నామినేషన్లు వేయనివ్వక పోవడమో.. ఒకవేళ వేసినా స్క్రుటినీలో వాటిని తిరస్కరించడమో, బలవంతంగా విత్డ్రా చేయించడమో చేశారు. మరో 2,109 ఎంపీటీసీ స్థానాల్లో కూడా నామినేషన్ల దశలోనే పోటీ లేకుండా చేశారు. నిన్న, ఈరోజు కూడా మా పార్టీ అభ్యర్థులను అరెస్టు చేశారు. పోలింగ్ ఏజెంట్లను బూత్ల్లోకి పోకుండా పోలీసులే అడ్డుకున్నారు. అసలు పార్టీ గుర్తుతో జరిగే ఈ ఎన్నికల్లో ఏకైక ప్రతిపక్షం పోటీలో లేకుండా చేసినప్పుడు, వీటిని ఎన్నికలు అంటారా? నేరుగా ఎంపికలు అనొచ్చు కదా?.

సుప్రీంకోర్టు ఆదేశాలు సైతం బేఖాతరు:

రాష్ట్రంలో స్థానిక ఎన్నికల ప్రక్రియను చూసిన సుప్రీంకోర్టు, ఈ వ్యవహారంలో కలగ జేసుకుని ప్రభుత్వం, ఎస్ఈసీ, పోలీసులకు చీవాట్లు పెట్టింది. నామినేషన్ కేంద్రాలు, పోలింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్రూమ్లు, కౌంటింగ్ కేంద్రాలు.. ఇలా అన్ని చోట్లా సీసీ కెమెరాలు పెట్టాలని ఆదేశించింది. కానీ, ఆ ఆదేశాలు కూడా బేఖాతరు చేస్తున్నారు. మున్సిపల్ ఎన్నికల్లో మొత్తం 11,378 పోలింగ్ కేంద్రాలు ఉంటే వాటిలో కేవలం 5,737 కేంద్రాల్లో మాత్రమే సీసీ కెమెరాలు పెట్టారు. వాటిలో ఎన్ని పని చేస్తున్నాయో కూడా తెలియదు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి 31,460 కేంద్రాలు ఉంటే, వాటిలో కూడా కేవలం 16,064 కేంద్రాల్లో మాత్రమే సీసీ కెమెరాలు అమర్చారు. మరి వాటిలోనూ ఎన్ని పని చేస్తున్నాయో తెలియదు. అలా యథేచ్ఛగా సుప్రీంకోర్టు ఆదేశాలు సైతం పట్టించుకోవడం లేదు. ఆ ఆదేశాలు పాటించడం ఎస్ఈసీ డ్యూటీ కాదా? అవన్నీ పూర్తి చేశాకే, ఎన్నికలు నిర్వహించాలి కదా?. కానీ, ఎస్ఈసీ మాత్రం ఆ పని చేయడం లేదు.

యథేచ్ఛగా రిగ్గింగ్ల పర్వం:

స్థానిక ఎన్నికల్లో ప్రతి దశలోనూ యథేచ్ఛగా రిగ్గింగ్ చేశారు. చేస్తున్నారు. తొలుత నామినేషన్ల రిగ్గింగ్. ఇక ఆ తర్వాత వరసగా నామినేషన్ల స్క్రుటినీ రిగ్గింగ్.. పోలింగ్ బూత్ల రిగ్గింగ్. పోలింగ్ స్ట్రైకింగ్ రిగ్గింగ్.. పోలింగ్ పర్సంటేజ్ రిగ్గింగ్.. రాత్రిపూట బ్యాలెట్ బాక్స్ల రిగ్గింగ్.. విశాఖపట్నంలో ముందు బ్యాలెట్ బాక్సులు భద్రపర్చిన స్ట్రాంగ్రూమ్కు సీల్ వేయలేదు. మా పార్టీ వారు గొడవ చేశాకే స్ట్రాంగ్ రూమ్లు సీల్ వేశారు. ఇవన్నీ దాటుకుని మా వాళ్లు ఎక్కడైనా గెలిస్తే, ఆ ఫలితాలు కూడా రిగ్గింగ్ చేశారు. ఇలా ఇంత అన్యాయమైన పద్ధతులతో, ఎన్నికలు రిగ్గింగ్ చేసిన గెలుపును చంద్రబాబు గొప్పగా చెప్పుకోవడం, దాన్ని ఎల్లో మీడియా ఎత్తుకోవడం. జోరుగా ప్రచారం చేయడం. ఇంత కంటే దారుణం ఎక్కడైనా ఉంటుందా? గమనించండి.

ఏపీ పరిషత్ ఎన్నికలు: 7 కేంద్రాల్లో కొనసాగుతున్న రీపోలింగ్.. రేపే కౌంటింగ్



ఆంధ్రప్రదేశ్లో నిన్న జరిగిన జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో రిగ్గింగ్, బూత్ కబ్జా వంటి అక్రమాలు జరిగాయన్న ఫిర్యాదుల నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం రీపోలింగ్కు ఆదేశించింది. మొత్తం 6 జిల్లాల పరిధిలోని 7 పోలింగ్ కేంద్రాల్లో ఈరోజు ఉదయం 7 గంటలకు రీపోలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. సాయంత్రం 5 గంటల వరకు ఈ పోలింగ్ కొనసాగనుంది.అనంతపురం, శ్రీకాకుళం, కర్నూలు, మార్కాపురం, పల్నాడు జిల్లాల్లోని నిర్దేశిత కేంద్రాల్లో అధికారులు తిరిగి పోలింగ్ నిర్వహిస్తున్నారు. మరోవైపు, తుపాను కారణంగా నిన్న వాయిదా పడిన ఏలూరు, తూర్పు గోదావరి జిల్లాల్లోని కొన్ని మండలాల్లో కూడా నేడే పోలింగ్ జరుగుతోంది. నిన్న జరిగిన పోలింగ్ సందర్భంగా పలుచోట్ల అధికార, ప్రతిపక్ష పార్టీల కార్యకర్తల మధ్య స్వల్ప ఘర్షణలు, ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి.సాయంత్రం 5 గంటలకు పోలింగ్ ముగిసిన తర్వాత బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్ రూమ్లకు తరలిస్తారు. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం, పరిషత్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ రేపు (నవంబర్ 7) ఉదయం 8 గంటలకు ప్రారంభం కానుంది. మరోవైపు, అధికార కూటమి ప్రభుత్వం పెద్ద ఎత్తున రిగ్గింగ్కు పాల్పడిందని వైసీపీ అధినేత జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. రాష్ట్రంలో జరిగింది ఎన్నికలు కావని, సెలక్షన్లు అని ఆయన వ్యాఖ్యానించారు.

ఏఐ దెబ్బ.. స్మార్ట్ఫోన్ల ధరలకు రెక్కలు! సామాన్యులపై భారీ భారం



ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీ ప్రపంచవ్యాప్తంగా దూసుకెళ్తున్న వేళ, దాని ప్రభావం ఇప్పుడు నేరుగా సామాన్యుడి జేబుపై పడనుంది. కొత్తగా స్మార్ట్ఫోన్ కొనుగోలు చేయాలనుకునే వారికి ఇది చేదువార్త. రానున్న రోజుల్లో ఫోన్ల ధరలు, ముఖ్యంగా బడ్జెట్ ఆండ్రాయిడ్ ఫోన్ల ధరలు భారీగా పెరగనున్నాయి. ఈ పెరుగుదల ఏకంగా 30% వరకు ఉండొచ్చని ప్రముఖ గ్లోబల్ రీసెర్చ్ సంస్థ జెఫరీస్ తన తాజా నివేదికలో హెచ్చరించింది.ఏఐ టెక్నాలజీకి గుండెలాంటి ప్రాసెసర్లు, మెమరీ చిప్లకు విపరీతమైన డిమాండ్ ఏర్పడటమే ఈ పరిస్థితికి ప్రధాన కారణం. జెమిని, చాట్జీపీటీ వంటి ఏఐ అప్లికేషన్ల కోసం టెక్ దిగ్గజాలు భారీ డేటా సెంటర్లను నిర్మిస్తున్నాయి. దీనికోసం మార్కెట్లోని మెమరీ చిప్లను పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తుండటంతో స్మార్ట్ఫోన్ తయారీ కంపెనీలకు తీవ్ర కొరత ఏర్పడింది. ఫలితంగా, గతంలో 20 డాలర్లు (సుమారు రూ.1,680) పలికిన ఒక మెమరీ యూనిట్ ధర, ఇప్పుడు మూడు రెట్లు పెరిగి 60 నుంచి 65 డాలర్లకు (సుమారు రూ.5,000) చేరింది.ఈ ధరల పెరుగుదల ప్రభావం ముఖ్యంగా రూ.16,000 లోపు లభించే బడ్జెట్ ఫోన్లపైనే ఎక్కువగా పడనుంది. ఎందుకంటే, ఈ ఫోన్ల తయారీ ఖర్చులో దాదాపు 60% మెమరీ చిప్లదే ఉంటుంది. దీంతో పెరిగిన భారాన్ని కంపెనీలు తప్పనిసరిగా వినియోగదారులపై మోపేందుకు సిద్ధమవుతున్నాయి. ధరలు పెరగడంతో చాలా మంది కొత్త ఫోన్ల కొనుగోలును వాయిదా వేసుకోవడం లేదా సెకండ్ హ్యాండ్ (రీఫర్బిష్డ్) ఫోన్ల వైపు మొగ్గు చూపవచ్చని జెఫరీస్ అంచనా వేసింది. ఈ పరిణామాలతో ప్రపంచ స్మార్ట్ఫోన్ మార్కెట్లోనూ గణనీయమైన మార్పులు రానున్నాయి. 200 డాలర్ల లోపు ఫోన్ల మార్కెట్ వాటా 42% నుంచి 24%కి పడిపోనుండగా, 600 డాలర్ల కంటే ఎక్కువ విలువైన ప్రీమియం ఫోన్ల వాటా 29% నుంచి 38%కి పెరుగుతుందని నివేదిక తెలిపింది. తయారీ వ్యయాన్ని తగ్గించుకోవడానికి కొన్ని కంపెనీలు కొత్త ఫోన్లలో పాత తరం ప్రాసెసర్లను వాడే అవకాశం ఉందని, అలాగే తక్కువ ధర మోడళ్ల సంఖ్యను తగ్గించుకునే యోచనలో ఉన్నాయని పేర్కొంది. ఏఐ కంపెనీలు 2027 నాటికి సుమారు 1.5 ట్రిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టనున్నందున, మెమరీ చిప్ల ధరలు 2027 మధ్యకాలం వరకు గరిష్ఠ స్థాయిలోనే కొనసాగవచ్చని జెఫరీస్ స్పష్టం చేసింది.

ట్రంప్ ప్రభుత్వంలో తొలి వికెట్.. పౌర హక్కుల విభాగం చీఫ్ హర్మీత్ ధిల్లాన్ రాజీనామా



అమెరికా మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీకి ఎదురుదెబ్బ తగిలిన తర్వాత డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రభుత్వంలోని పౌర హక్కుల విభాగం చీఫ్గా పనిచేస్తున్న భారత సంతతి అధికారిణి, ట్రంప్ గట్టి మద్దతుదారైన హర్మీత్ కౌర్ ధిల్లాన్ తన పదవికి రాజీనామా చేశారు. ఎన్నికల ఫలితాల తర్వాత ట్రంప్ యంత్రాంగం నుంచి వైదొలగిన తొలి సీనియర్ అధికారి ఈమే కావడం గమనార్హం.హర్మీత్ ధిల్లాన్ రాజీనామా విషయాన్ని అటార్నీ జనరల్ టాడ్ బ్లాంచె గురువారం సోషల్ మీడియా ప్లాట్ఫామ్ ఎక్స్ వేదికగా ప్రకటించారు. "ఆమె ప్రతీ అమెరికన్ పౌర స్వేచ్ఛను కాపాడారు. ఎలాంటి భయం లేకుండా నిష్పక్షపాతంగా చట్టాన్ని అమలు చేశారు. ఆమె సేవలకు డిపార్ట్మెంట్ తరపున కృతజ్ఞతలు. భవిష్యత్తులో ఆమె మరిన్ని విజయాలు సాధించాలని కోరుకుంటున్నాం" అని బ్లాంచె పేర్కొన్నారు.అయితే, తాను మధ్యంతర ఎన్నికలకు నెల రోజుల ముందే రాజీనామా సమర్పించానని, కానీ ఎన్నికలు ముగిసే వరకు పదవిలో కొనసాగాలని ట్రంప్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ సూసీ వైల్స్ కోరారని హర్మీత్ ధిల్లాన్ ఫాక్స్ న్యూస్కు వెల్లడించారు. సాధారణంగా అమెరికాలో మధ్యంతర ఎన్నికల తర్వాత అధ్యక్షుడు తన యంత్రాంగాన్ని పునర్వ్యవస్థీకరించుకునేందుకు వీలుగా సీనియర్ అధికారులు వైదొలగడం ఆనవాయితీ.ట్రంప్కు గట్టి మద్దతుదారు అయినప్పటికీ, కొన్ని విషయాల్లో హర్మీత్ భిన్నంగా వ్యవహరించారు. ముఖ్యంగా, వలసదారుల విషయంలో సిక్కు ట్రక్కు డ్రైవర్లను లక్ష్యంగా చేసుకోవడాన్ని ఆమె తీవ్రంగా వ్యతిరేకించారు. ఆగస్టులో ఒక సిక్కు డ్రైవర్ ప్రమాదానికి కారణమైనప్పుడు, "కొందరు ఈ విషాదాలను అదనుగా తీసుకుని చట్టాన్ని గౌరవించే సిక్కు, భారత సంతతి డ్రైవర్లపై వారి మూలాల కారణంగా దాడి చేస్తున్నారు. ఇక్కడే పుట్టిన లేదా చట్టబద్ధంగా వలస వచ్చిన ఈ డ్రైవర్లు చాలా దేశభక్తి కలిగిన వారు, కష్టపడి పనిచేసేవారు" అని సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. 18 నెలల తన పదవీకాలంలో హర్మీత్ అనేక వివాదాస్పద నిర్ణయాలు తీసుకున్నారు. పౌర హక్కుల విభాగం దృష్టిని సాంప్రదాయకంగా మైనారిటీల హక్కుల పరిరక్షణ నుంచి యూదు వ్యతిరేకత, మత స్వేచ్ఛ, తుపాకీ హక్కులు, మహిళల క్రీడలలో ట్రాన్స్జెండర్ల భాగస్వామ్యం వంటి అంశాల వైపు మళ్లించారు. దీనివల్ల ఆఫ్రికన్-అమెరికన్లు వంటి మైనారిటీల ఓటు హక్కు కోసం పనిచేసిన ఆ విభాగంలోని చాలా మంది న్యాయవాదులు రాజీనామా చేశారు. 2020 ఎన్నికల్లో అవకతవకలు జరిగాయని ఆరోపించిన వారిలో హర్మీత్ కూడా ఉన్నారు. 2024 రిపబ్లికన్ జాతీయ సమావేశంలో ఆమె సిక్కుల ప్రార్థన 'అర్దాస్' చదివి వినిపించారు. చండీగఢ్లో జన్మించిన హర్మీత్, చిన్నతనంలో తన కుటుంబంతో కలిసి మొదట బ్రిటన్కు, ఆ తర్వాత అమెరికాకు వలస వెళ్లారు.

చంద్రబాబుపై కేసులు.. సీబీఐ విచారణ పిల్పై హైకోర్టులో వాడివేడి వాదనలు



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుపై గతంలో సీఐడీ నమోదు చేసిన కేసులను కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)కి బదిలీ చేయాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై హైకోర్టులో విచారణ జరిగింది. నిష్పక్షపాతంగా, స్వతంత్రంగా విచారణ జరిపించాలన్న ఈ పిల్పై గురువారం ఇరుపక్షాల వాదనలు విన్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ నేతృత్వంలోని ధర్మాసనం, తదుపరి విచారణను నవంబర్ 10వ తేదీకి వాయిదా వేసింది.2024లో రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత కొట్టి బాలగంగాధర తిలక్ ఈ పిల్ దాఖలు చేశారు. రాష్ట్రంలో అధికార మార్పిడి కారణంగా చంద్రబాబుపై నమోదైన కేసుల దర్యాప్తు నీరుగారిపోయే ప్రమాదం ఉందని, వాటిని పూర్తిగా మూసివేసే అవకాశం ఉందని పిటిషనర్ తన పిటిషన్లో ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పిల్ విచారణలో ఉండగానే పలు కేసులను "వాస్తవ దోషాలు"గా పరిగణించి సీఐడీ మూసివేయడాన్ని పిటిషనర్ సవాలు చేశారు. ముఖ్యంగా ఎస్సీ/ఎస్టీలకు చెందిన అసైన్డ్ భూముల బదలాయింపు, ఆప్టికల్ ఫైబర్ నెట్వర్క్ టెండర్లలో అవకతవకలు, నైపుణ్యాభివృద్ధి కేంద్రాల ఏర్పాటు, ఇన్నర్ రింగ్ రోడ్ భూసేకరణ, ఎక్సైజ్ పాలసీ నిర్ణయాలు, ఉచిత ఇసుక విధానం రూపకల్పన వంటి కీలకమైన కేసుల దర్యాప్తును సీబీఐకి అప్పగించాలని కోరారు.

దర్యాప్తు సమయంలో స్వాధీనం చేసుకున్న పత్రాలు, ఎలక్ట్రానిక్ పరికరాలను సంబంధిత వ్యక్తులకు తిరిగి ఇప్పకుండా విజయవాడ ఏసీబీ కోర్టును ఆదేశించాలని కోరుతూ ఒక మధ్యంతర పిటిషన్ను కూడా దాఖలు చేశారు.పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది రంజిత్ వాదనలు వినిపిస్తూ, ఈ కేసుల్లో ఫిర్యాదుదారులుగా ఉన్నది ప్రభుత్వ అధికారులేనని, ప్రస్తుతం చంద్రబాబు అధికారంలో ఉండటంతో వారు కేసుల మూసివేత నివేదికలను సవాలు చేయడానికి ముందుకు రావడం లేదని కోర్టు దృష్టికి తెచ్చారు. ఇలాంటి పరిస్థితుల్లో కేసులపై స్వతంత్ర దర్యాప్తు జరిగేలా చూడాలని కోర్టు జోక్యాన్ని కోరడం తప్ప పిటిషనర్కు మరో మార్గం లేదని ఆయన వాదించారు. కేసు స్టేటస్ చార్ట్ ప్రకారం, ఇప్పటికే పలు కేసుల్లో సీఐడీ క్లోజర్ రిపోర్టులు దాఖలు చేయగా, వాటిని కోర్టులు ఆమోదించాయని తెలిపారు. అసైన్డ్ భూముల కేసులో ఒక ఫిర్యాదుదారు, కేసు మూసివేతకు నిరభ్యంతర పత్రం ఇవ్వాలని సీఐడీ–సిట్ అధికారులు తనపై ఒత్తిడి తెచ్చారని ఆరోపిస్తూ నిరసన పిటిషన్ దాఖలు చేసిన విషయాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. పరిస్థితులను బట్టి దర్యాప్తును ఆదేశించే అధికారం రాజ్యాంగబద్ధమైన కోర్టుగా హైకోర్టుకు ఉందని, నిర్దోషిగా తేలిన తర్వాత కూడా లేదా నిష్పాక్షిక విచారణ కోసం కేసును సీబీఐకి బదిలీ చేయవచ్చని వాదించారు.గత నెల విచారణ సందర్భంగా ప్రభుత్వం, సీఐడీ తరఫున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ మరోసారి వాదనలు వినిపించారు. ఈ పిల్ను కొట్టివేయాలని కోరారు. చంద్రబాబుపై నమోదైన కేసుల్లో తగిన ఆధారాలు లభించలేదని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విజయవాడ ఏసీబీ కోర్టులో తుది నివేదికలు దాఖలు చేసిందని ఆయన తెలిపారు. ఆ నివేదికలను పరిశీలించిన ఏసీబీ కోర్టు కేసులను మూసివేయాలని ఆదేశించిందని హైకోర్టుకు వివరించారు. ఈ కేసుల మూసివేతను సవాలు చేస్తూ కొందరు వ్యక్తులు ఇప్పటికే హైకోర్టులో రివిజన్ పిటిషన్లు దాఖలు చేశారని తెలిపారు. ఈ పరిణామాల నేపథ్యంలో, ఈ ప్రజా ప్రయోజన వ్యాజ్యంలో విచారించడానికి ఇక ఏమీ మిగలలేదని, కాబట్టి ఈ పిల్ను నిరర్థకమైనదిగా పరిగణించి కొట్టివేయాలని రోహత్గీ వాదించారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం, తదుపరి విచారణను వాయిదా వేసింది.